اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 4 సంచిక 7 ఫిబ్రవరి 2013 రూ. 17/-



## పరమత సహనం

మదీనా రాజధానిగా 1400 సంవత్సరాల క్రితమే
అమలు పరచిన తొలి ప్రజాస్వామ్య దేశం

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ నేరంగా
ఎప్పుడు పరిగణించబడుతుంది?

## ఓ తల్లీకుమారుల

అపూర్వ సంభాషణ

هُوَ الْاَوَّلُ وَ الْاٰخِرُ وَالظَّاهِرُ وَ الْبَاطِنُ وَهُوَ بِكُلِّ شَیْءٍ عَلِيمٌ

ఆయనే మొట్టమొదటివాడు మరియు చిట్టచివరివాడు
మరియు ప్రత్యక్షుడు మరియు పరోక్షుడు. మరియు
ఆయనే ప్రతిదాని గురించి జ్ఞానం గలవాడు.

(ఖుర్'ఆన్ 57:3)

సృష్టికర్త

الله

అల్లాహ్

అల్-బాతిను

الْبَاطِنُ

పరోక్షుడు

THE INTIMATE
(Unapparent)

అజ్జాహిరు

الظَّاهِرُ

ప్రత్యక్షుడు

THE APPARENT
(Ascendant)

**He is the FIRST and the LAST, the APPARENT (Ascendant) and the INTIMATE (Unapparent) and He is, of all things, knowing.**
**(Qur'an 57:3)**

**ముఖ్య గమనిక : శాంతిబాట లోగో రిజిష్టర్ చేయబడింది.** *శాంతిబాట పేరుకు దగ్గరగా ఉండే విధంగా శాంతిబాటను అనుకరిస్తూ, శాంతిబాటతో సంబంధం ఉందని ప్రజలు బావించే విధంగా ఎవరైనా శాంతిబాట వ్యాసాలను గాని, మా సొసైటీచే ప్రచురించబడిన పుస్తకాలలోని విషయాలను గాని పబ్లిష్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.* ***మా దగ్గర నుండి వ్రాతపూర్వకంగా అనుమతి లేకుండా, వీటిలోని ఏదైనా భాగాన్ని ఎవరైనా ప్రచురించడం లేదా జెరాక్స్ కాపీలు తీసి అమ్మడం చేస్తే ఇన్షా అల్లాహ్ వారి పైకూడా చట్టపరంగా ప్రొసీడ్ కావడం జరుగుతుంది.*** *మా వెబ్‌సైట్ నుండి శాంతిబాట సంచికలు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని ఎవరైనా చదువుకునే అవకాశాన్ని మాత్రమే కల్పించాముగాని, వీటిలోని విషయాలను* ***ప్రచురించు కోవడానికి ఎవరికీ ఎటువంటి హక్కు లు ఇవ్వలేదు.*** *ఈ రాష్ట్రంలోనే కాదు, ఇండియాలోని ఏ రాష్ట్రంలోని ఏ పబ్లిషర్స్‌తోనూ మాకు ఎటువంటి సంబంధాలు లేవు. ఒకవేళ మా పాఠకులు అటువంటి ప్రచురణలను చూడటం జరిగితే, వెంటనే* ***మాకు తెలియజేయమని మనవి.*** *శాంతిబాటలో ప్రచురించబడుతున్న శీర్షికలను ఇన్షా అల్లాహ్ పుస్తకాలుగా* ***తెలుగు, English, ఉర్దూలో*** *విడుదల చేయడానికి ప్రయత్నిస్తాము.*


# శాంతిబాట

**మాసపత్రిక** రూ.17/-

సంపుటి 4 సంచిక 7 ఫిబ్రవరి, 2013

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440



**www.saanthibaata.net**

**www.saanthibaata.com**

Email:velugubaata@gmail.com

**Cell : 9491103017**



**ఎడిటర్:**

ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Editor**

Md. Athaharullah

**Advisory Board**

Dr. Salim Pasha

Dr. Nagireddi Srinivasa Rao

Md. Affan Omri

**Printed by**

Md. Athaharullah

**Published by**

Md. Athaharullah

**Owned by**

Velugubaata Educational Society

(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**

Saanthibaata Publishing House,

19-1-447, Hanuman Statue Center

Samalkot - 533440

and

**Published at**

2-8-31, Kota Bazar, Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,

Email: velugubaata@gmail.com

RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**

T. Srinivasa Rao

(Zakir)


## ఫిబ్రవరి 2013 (రబీ ఉల్ అవ్వల్ - రబీ ఉల్ ఆఖిర్ హి. 1434)


5 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 50 - 59 ఆయత్‌లు ...

10 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- **అస్మా** (రజి)

18 **హదీస్ విజ్ఞానం :** ముస్లిమ్(ర) జీవితచరిత్ర ప్రారంభం ...

21 **పరమత సహనం :** తొలి ప్రజాస్వామ్య దేశంలో ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా ఆచరణలో పెట్టబడిన పరమత సహనం ...

31 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...



**సంవత్సర చందా :**

**రూ. 200/-**

(వివరాలకు పేజీ నెం. 9 చూడండి)

**Velugubaata Educational Society**

D.No. 2-8-31, Kota Bazar

SAMALKOT - 533440

**East Godavari District**


మీ ఎడ్రస్ మారినా లేక ఫోన్ నంబర్ మారినా మీరు కాల్ చేయవలసిన నంబర్ : **9491103017**

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*

**(ముహమ్మద్ అబ్దుల్ కరీమ్ )**

ప్రతీరోజూ మధ్యాహ్నం 3 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు

లేదా పై నంబర్‌కి SMS ద్వారా తెలియజేయండి



**ప్రచురించిన విషయాలపై సద్విమర్శలు గాని, అభిప్రాయాలు గాని ఫోన్‌లో స్వీకరించబడవని మనవి చేస్తున్నాము. వాటిని మీ పూర్తి ఎడ్రస్‌తో సహా లెటర్‌లో వ్రాసి పంపగలరు.**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

***ఏది భావప్రకటనా స్వేచ్ఛ అవుతుంది? ఏది నేరమవుతుంది? ఈ రెండింటిని వేరేవేసే ఆ న్యాయపరమైన విషయాలు ఏమిటో ప్రజలకు స్పష్టపరచడానికి***

# ఇదే సరియైన సమయం

ప్రజల మనోభావాలను కించపరచవద్దని ఇస్లామ్ చాలా స్పష్టంగా బోధించింది.

**మతగ్రంథాల విషయంలో అల్లాహ్ యొక్క సందేశహరుడు ముహమ్మద్(స)వారు ఇలా చెప్పారు :**

అబూహురైరాగారి ఉల్లేఖనం : గ్రంథప్రజలు (తమ మతగ్రంథమైన) 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : "**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము''. **(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

**ఇక ఇతరులను దూషించే విషయంలో .....**

**ఇతరుల తల్లిదండ్రులను దూషిస్తే వారు వీరి తల్లిదండ్రులను దూషిస్తారు కాబట్టి, అది పరోక్షంగా తన తల్లిదండ్రులను తానే దూషించినట్లు అవుతుందని వివరిస్తూ ముహమ్మద్(స)వారు బోధించారు.**

అంతేకాదు ఎవరైనా తప్పు చేశారని తెలిసుండి, ఆ వ్యక్తి తన ముందు ఉన్నప్పటికీ అతని పేరు చెప్పకుండా 'నా అనుచర సమాజం ఇలా అయిపోయిందేమిటి?' అని అనేవారే గాని, పదిమందిలో ఆ వ్యక్తి యొక్క ఐడెంటీటీని ముహమ్మద్(స)వారు బయటపెట్టేవారు కాదు. ఇతరుల మనోభావాలను కించపరచడం ఇస్లామ్‌లో లేదు. ఇస్లామ్ మానవమాత్రుని సృష్టి కాదు. విశ్వసృష్టికర్తయైన అల్లాహ్ సమస్త మానవుల కొరకు ఏర్పాటు చేసి అది మార్పులకు గురికాకుండా ఆయనే స్వయంగా రక్షిస్తున్న ధర్మం.

మన రాష్ట్రంలో 2012 సంవత్సరం వివాదాలతో ముగిసింది. అంతేకాకుండా 2013 కూడా వివాదాలతోనే ప్రారంభమైంది. రాజకీయ వ్యాఖ్యలకు కులం రంగుగాని, మతం రంగుగాని పులిమినప్పుడు అవి వివాదాస్పదం అవుతాయి. ఇది మనదేశంలో సర్వసాధారణంగా కనిపించేదే. అక్బరుద్దీన్ వ్యవహారంలో రాజకీయ నాయకులు, పోలీసులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, స్వామిజీలు ... ఇలా ఎందరో ఎన్నో వ్యాఖ్యలు చేశారు. న్యాయపరంగా చూస్తే వీటిలో కొన్ని ఇబ్బందికరమైన వ్యాఖ్యలున్నాయి.

ఇటీవల అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు దేశంలో రక్తపాతం సృష్టించేవిగా ఉన్నాయని అతని వ్యాఖ్యలను కొందరు తీవ్రంగా ఖండించారు. కేసులు నమోదయ్యాయి. అతని అరెస్ట్ కొరకు ఉపయోగించిన సెక్షన్లు మరియు మీడియా కవరేజిని బట్టి ఇంతకు పూర్వమెన్నడూ మన రాష్ట్రంలో ఇటువంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదేమోనని అనిపించేలా ఉన్నాయి. అంతటి హైడ్రామా నడిచింది. ఎందుకంటే గతంలో బహిరంగంగా రక్తపాతం జరుగుతుందని నాయకులు హెచ్చరిస్తూ వేదికలపై ప్రసంగించడం జరిగినప్పటికీ ఈ శైలిలో మరియు ఈ స్థాయిలో అరెస్ట్‌లు జరగలేదు.

**రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎందరో చేసినా సరే అస్సలు ఏమాత్రం పట్టించుకోని వారంతా, ఈ రోజు పట్టుపట్టి ఫిర్యాదులు చేస్తున్నారంటే ప్రజలలో అవగాహన పెరిగిందా? లేక ఇదంతా స్వార్థప్రయోజనాల కోసమా?**

జరిగిన సంఘటనలను మరియు వాటిపై స్పందనలను కవర్ చేస్తూ మన రాష్ట్రంలోని రెండు న్యూస్ పేపర్ల (సాక్షి మరియు ద హిందూ) లో ఇచ్చిన సమాచారాన్ని ఈ ఎడిటోరియల్‌లో అందిస్తున్నాము. ఇటీవల ఇద్దరు వ్యక్తులు తమ బహిరంగ సభలలో చేసిన ప్రసంగాలలోని కొంత భాగాన్ని **'The Hindu** ఇంగ్లీష్ డైలీ**'** ఫిబ్రవరి 6వ తారీఖున మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించింది.

[Owaisi] said, remove the police [and see what we do], I say, for 20 years, the police has stood aside, doesn't he know what happened? In Nellie, Assam, **the police stood aside** and more than **3,000 dead bodies got piled up. Not one was Hindu.** Something similar happened in **Bhagalpur, Bihar ...** The Ganga was full of dead bodies, not one Hindu. **In Moradabad, Meerut, and in Gujarat, too, police stood aside.** (The Hindu, Pg.1, Feb 06, 2013)

- **Dr. Praveen Togadia**, Viswa Hindu Parishad leader
**22nd January, 2013** at Bokar

We (Muslims) are 25 crore, you are 100 crore (Hindus). You are so much more numerous. But just **remove the police for 15 minutes** and we will show who are the **brave ones**. who is **stronger**.

- **Akbaruddin Owaisi**, M.L.A., (MIM)
24th December, 2012 at Adilabad

పైన తెలిపిన వారిద్దరిలో ఒకరు ఎం.ఐ.ఎం. పార్టీకి చెందిన శాసన సభ్యుడు - **అక్బరుద్దీన్ ఓవైసీ**. మరొక వ్యక్తి **డా. ప్రవీణ్ తొగాడియా.** ఈయన విశ్వహిందూ పరిషత్ నాయకుడు. విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని అక్బరుద్దీన్‌ను అరెస్ట్ చేయడం గురించి తెలిసిందే. **విద్వేషపూరిత ప్రసంగాలకు పెట్టింది పేరు - తొగాడియా.** ఎన్నో సంవత్సరాలుగా ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, న్యాయవ్యవస్థగాని, శాంతి భద్రతల విభాగం గాని ఏమీ చేయలేక పోయింది. అక్బరుద్దీన్ మరియు తొగాడియా చేసిన ప్రసంగాలలోని భాగాలు పైన చదివారు కదా!

అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు, తొగాడియా స్పందించినట్లు చెబుతున్నారు. అంటే ఒకరిది **వ్యాఖ్య** మరియు మరొకరిది **స్పందన**. అక్బరుద్దీన్ చేసినది వ్యాఖ్య అవుతుందా? లేక అంతకు పూర్వం తొగాడియా వంటివారు చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించి ఆ విధంగా మాట్లాడడం జరిగిందా? ఒకవేళ వ్యాఖ్య చేస్తేనే అరెస్ట్ చేయడం జరుగుతుందిగాని, స్పందనకు లేదనుకుంటే ముందుగా ఒక విషయం తెలుసుకోవాలి. అక్బరుద్దీన్ ఎప్పుడూ లేనిది, మొదటిసారి ఇలా మాట్లాడటానికి గల కారణం ఏమిటి?

**పోలీస్‌లను 15 నిమిషాలు ఆపితే, ఎవరు ధైర్యవంతులో, ఎవరు బలవంతులో చూపుతాం అని ఛాలెంజ్ చేసిన అక్బరుద్దీన్ వ్యాఖ్యలు, అతని వ్యక్తిగత వ్యాఖ్యలు.** ఇందులో చంపేస్తాము అని చెప్పలేదు (పైన న్యూస్ పేపర్లో ఇచ్చిన సమాచారాన్ని బట్టి మాత్రమే). ఈ వ్యాఖ్యపై న్యాయమూర్తిగారి స్పందన : 'పిటిషనర్ మాట్లాడిన వీడియోలు నేను యూట్యూబ్‌లో చూశా. దారుణమైన వ్యాఖ్యలు ఉన్నాయి ... 15 నిమిషాలపాటు పోలీసులను పక్కన పెడితే 100 కోట్ల మంది హిందువుల అంతు చూస్తాడట ...! నాకున్న పరిధి మేరకు పోలీసులను 15 నిమిషాలు కాదు అరగంటసేపు ఆపుతా. ఏం జరుగుతుందో చూస్తాం. అందరినీ చంపేస్తారా ..... **ఆ ప్రసంగం ద్వారా అక్బరుద్దీన్ ఈ దేశానికి సవాలు విసిరాడు.** ఆ సవాలుపైనే నిలబడమని చెప్పండి. దాని నుంచి వెనక్కి ఎందుకు తగ్గుతున్నట్లు? ... "

సాధారణంగా ఎవరైనా వ్యక్తి ఓ నేరం చేస్తే, ఆ నేరం చేయడానికి పురిగొల్పిన కారణాలు తెలుసుకుని, మరలా అటువంటివి చేయకుండా ఉండమని మందలించడం జరుగుతుంది. కాని ఓ న్యాయమూర్తిగారి పై స్పందనను ఎలా అర్థం చేసుకోవాలో! పై స్పందన జనవరి, 10, 2013వ తారీఖున సాక్షి దినపత్రికలో 6వ పేజీలో ప్రచురించబడింది. ఈ న్యూస్ ఐటమ్ ప్రక్కనే మరో బాక్స్‌లో **'యూట్యూబ్ పిటిషన్ కొట్టివేత'** అనే శీర్షికన కొంత సమాచారం ప్రచురించ బడింది. *"మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎం.ఐ.ఎం. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన ప్రసంగం తొలగించాలని యూట్యూబ్‌ను ఆదేశించా లంటూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్ట్ బుధవారం కొట్టివేసింది. ఆ ప్రసంగాలను యూట్యూబ్‌లో ప్రసారం చేసినంత మాత్రాన వచ్చిన నష్టమేమీ లేదని, **అది భావప్రకటన స్వేచ్ఛ కిందకు వస్తుందని తెలిపింది.** వ్యక్తుల భావప్రకటనల హక్కుల విషయంలో కోర్టులు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది ఎస్.వి.ఎస్.జె. రామారావు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. 'ఆ ప్రసంగాలను యూట్యూబ్‌లో ఉంచడంలో తప్పేముంది? **ఆ ప్రసంగాన్ని కొంతమంది ఆస్వాదించవచ్చు. మరికొందరు వ్యతిరేకించ వచ్చు.** ఇదంతా భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన వ్యవహారం. కాబట్టి ఈ వ్యవహారంలో మేం జోక్యం చేసుకోలేం.' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ పిటిషన్‌ని కొట్టివేసింది."*

అక్బరుద్దీన్ ప్రసంగం భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించినదని ఒక పక్క చెబుతూనే, మరో పక్క అరెస్ట్ చేసి రిమాండ్‌లో ఉంచారు. ఇంతకీ ఈ విషయం **భావప్రకటనా స్వేచ్ఛ కిందకు వస్తుందా? నేరం కిందకు వస్తుందా?** <u>అంతా అయోమయంగా ఉంది</u>. యూట్యూబ్ విషయంలో పిటిషన్ వేసినవారు కూడా ఒక న్యాయవాదే! అంటే ఒక న్యాయవాదికే ఈ విషయంలో స్పష్టత లేకపోతే సామాన్య ప్రజలకు ఎలా తెలుస్తుంది?

**ఎవరు ఎవరికి సవాల్ చేస్తున్నారు?**

అక్బరుద్దీన్ 'దేశానికే సవాల్ విసిరాడని' న్యాయమూర్తిగారు స్పందించారు. విశ్వ హిందూ పరిషత్ నేత వెంకటేష్ అబ్దేవ్ మాట్లాడుతూ, తొగాడియాను అరెస్ట్ చేస్తే **దేశవ్యాప్తంగా తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని** హెచ్చరించారు." **ఈ హెచ్చరిక ఎవరికి చేసినట్లు?** అంతేకాదు ఇలా కూడా అన్నారు : "... **దమ్ముంటే అరెస్ట్ చేయాలని** ప్రభుత్వానికి సవాల్ విసిరారు". ఈ సవాల్ ఎవరికీ?

**డా. తొగాడియా తన ప్రసంగంలో 3000 కంటే ఎక్కువ శవాల గురించి ప్రస్తావించారు. అందులో ఒకటి కూడా హిందువుది లేదట. 20 సంవత్సరాలుగా పోలీసులు ఓ పక్కగానే నిలుచున్నారని, అయినా సరే నెల్లీ, అస్సాములో పేరుకుపోయిన ఈ 3 వేల ముస్లిమ్ శవాల గుట్టల గురించి జ్ఞాపకం చేశారు. ఇటువంటిదే భగల్‌పూర్, బీహార్‌లో జరిగిందట ... గంగానది శవాలతో నిండిపోయిందట. అందులో ఒక్కరూ హిందువు లేరట. మొరాదాబాద్, మీరట్ మరియు గుజరాత్‌లో కూడా పోలీసులు ఓ పక్కగానే ఉన్నారట.**

**స్వామీజీల స్పందనలు** : "హిందూ మతాన్ని మత గ్రంథాలను విమర్శిస్తూ, రక్తపాతాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేసిన అక్బరుద్దీన్‌పై తీవ్రంగా స్పందించాల్సిన ప్రభుత్వం, దాన్ని అడ్డుకునే సాధుపుంగవులపై అమానుషమైన చర్యలకు దిగడం తగదు" - *అహోబిల రామానుజ జీయర్ స్వామి* (సాక్షి, 18 జనవరి)

అక్బరుద్దీన్ ప్రసంగం రక్తపాతం సృష్టిస్తుందని అనుమానపడే ఈ స్వామీజీగారికి గత 20 సంవత్సరాలుగా ముస్లిములపై జరుగుతున్న రక్తపాతం గురించి తెలిసిన తరువాత ఏమని స్పందిస్తారో!

"అక్బరుద్దీన్ వ్యాఖ్యలు ప్రమాదకరమైనవని ఇటువంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా క్షమార్హం కాదని *శ్రీపీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద* అన్నారు. కమలానంద భారతి స్వామి వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమైనవని దీనిలో ఎవరినీ కించపరిచే, విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు దీనిలో లేవని గుర్తించాలని, ఆయన అరెస్ట్‌ను నిరసిస్తున్నామన్నారు" - (సాక్షి, 18 జనవరి)

"హైందవ మతం ఎంతో గొప్పదని, దాన్ని ఎవరు కించపరిచినా సహించేది లేదని *స్వరూపానందేంద్ర సరస్వతి* గారు అన్నారు. అలాంటివారిని శిక్షించాలన్నారు. ఎం.ఐ.ఎం. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. అతన్ని అరెస్ట్ చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. హిందూ మతంపై తీవ్రంగా కుట్ర జరుగుతోందని, దీన్ని హిందువులంతా గ్రహించాలని తెలిపారు" - (సాక్షి, 10 జనవరి)

అక్బరుద్దీన్ అరెస్ట్‌ను స్వాగతించిన స్వామీజీలు, ఇదే సందర్భంగా మతపరమైన ద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎన్నో సంవత్సరాలుగా దేశమంతా తిరుగుతూ ప్రసంగించే తొగాడియా వంటి వారి అరెస్ట్‌ను కూడా కోరి ఉంటే చాలా బాగుండేది.

**20 సంవత్సరాలుగా ఈ ఘోరాలు జరుగుతూ ఉంటే మన దేశ శాంతిభద్రతల వ్యవస్థ వైఫల్యం చెందినట్లే కదా! ఇది ప్రపంచానికి ఎటువంటి సంకేతాలను ఇస్తుంది. మన దేశ పరువును దిగజార్చదా? పై వ్యాఖ్యలు చదివిన న్యాయవ్యవస్థ, పోలీస్ వ్యవస్థ స్పందించాయా? అక్బరుద్దీన్‌పై తీవ్రంగా స్పందించిన బిజెపి నేత యశ్వంత్ సిన్హాగారు ఇప్పుడు మౌనంగా ఉన్నారెందుకో?**

**పోలీస్ వ్యవస్థను గౌరవిస్తున్నదెవరు?**

పోలీసులను ఆపండి చూసుకుందాం అని అక్బరుద్దీన్ సవాల్ చేస్తే, పోలీసులున్నా సరే శవాలు గుట్టలుగా పడ్డాయని తొగాడియా గుర్తు చేయడం, వీరిద్దరిలో ఎవరు వ్యవస్థను గౌరవిస్తున్నారు? **భారతదేశ పోలీస్ వ్యవస్థ అసమర్థమైనదని సంకేతాలు ఎవరు ఇస్తున్నట్లు?**

డిశంబర్ 31, 2012న జరిగిన సభలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగించిన వి.హెచ్.పీ. నేత ప్రవీణ్ తొగాడియాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలంటూ హైదరాబాద్‌లోని సైదాబాద్ పోలీసులను నాంపల్లి కోర్టు గురువారం ఆదేశించింది. **భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు చేసుకోనివ్వకపోతే హైదరాబాద్ మరో అయోధ్యగా మారుతుందంటూ తొగాడియా వ్యాఖ్యలు చేశారని** పిటిషనర్ ఆరోపించారు. (సాక్షి, 18 జనవరి)

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారని ఫిర్యాదు (ఫిబ్రవరి 8, పేజీ 5, సాక్షి) : సెక్షన్లు 295, 505 కింద నాందేడ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. జనవరి 22న మాత్రమే కాకుండా, ఈ నెల 1న జరిగిన ఓ కార్యక్రమంలో కూడా తొగాడియా వివాస్పద వ్యాఖ్యలు చేశారని మహారాష్ట్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి నసీంఖాన్ ఆరోపించారు. ఇలా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై **ఎం.ఐ.ఎం. నేత అక్బరుద్దీన్ ఒవైసీ జైలులో ఉన్నప్పుడు ... మరి తొగాడియాను ఎందుకు ఉపేక్షించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.** తొగాడియాపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తొగాడియాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు.


ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన "**రాజకీయ ఉగ్రవాదం - ముస్లిమ్ యువత**" అనే సదస్సులో సి.పి.యం. నాయకులు బి.వి. రాఘవులు గారు ఇలా విమర్శించారు. అభ్యంతరకర వ్యాఖ్యల నేపథ్యంలో ఎం.ఐ.ఎం. ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ను అరెస్ట్ చేసిన ప్రభుత్వం, అదే ప్రవీణ్ తొగాడియా విషయంలో మెతక వైఖరి అవలంభిస్తోంది.

**అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరం.** అయితే అధికారంలో ఉన్నవారు ఒకరి విషయంలో ఒక రకంగా, మరొకరి విషయంలో మరో రకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉంటే ఒక రకంగా, లేకుంటే మరో రకంగా వ్యవహరిస్తామని అనడం మంచి సాంప్రదాయం కాదు. **చట్టం అందరినీ ఒకే విధంగా చూడాలి.** మజ్లిస్ లేదా బిజేపీ లేదా టీఆర్ఎస్ లేదా ఇంకెవరైనా కావచ్చు. మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనుకోవడం తప్పు ... నాలుకలు చీరేస్తాం ... తంతాం ... వంటి రకరకాల మాటలను కొందరు వాడుతున్నారు. వారినేమన్నా అంటున్నామా? అందరి విషయంలో సమానంగా వ్యవహరించాలి." - మైసూరారెడ్డి, వై.యస్.ఆర్.సి.పి. (సాక్షి,10 జనవరి)

**ఎవరి ధర్మం వారికి గొప్పదే.** ఒక వ్యక్తి చేసే ప్రతీ ఆచరణను అతని ధర్మానికి ఆపాదించడం సరికాదు. ఏ ముస్లిమైనా ఖుర్ఆన్ బోధనల ప్రకారమే వ్యవహరిస్తే, అతనిని ప్రపంచంలో మానసిక ఆరోగ్యం బాగున్న వారెవరూ విమర్శించలేరు. **అంతటి విశిష్టత కలిగిన ధర్మం - ఇస్లామ్.**

బహిరంగ ప్రసంగాలలో మత మరియు ప్రాంతీయ విద్వేషాలకు కారణమయ్యే అంశాలు ఉండ కూడదని, ఒకవేళ ఆ విధంగా ఎవరైనా ప్రసంగిస్తే, ప్రసంగీకునితో పాటు ఆ ప్రసంగాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టాన్ని తయారు చేయాలి. పరమత ధర్మ ప్రస్తావన రాకుండా ఉండాలి. అంటరానితనం నేరమని పాఠ్యపుస్తకాల చివరిలో ఎలా చెప్పేవారో అదే విధంగా అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలలో ఈ చట్టం గురించి అచ్చువేయాలి. కనీసం మన భావిపౌరులైనా వివాదాలకు దూరంగా ఉండవచ్చు, ఇన్షా అల్లాహ్!

**మనదేశంలో తొలి ప్రాధాన్యత ఇవ్వవలసింది పరమత సహనానికే!** పరమత సహనంపై ఓ ప్రత్యేక వ్యాసాన్ని ఈ సంచికలో అందించాము. చదవండి. పరమత సహనాన్ని అమలు పరచిన తొలి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ఇస్లామీయ పరిపాలనలో ప్రపంచానికి చూపారు రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారు.



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

27

## ఖుర్'ఆన్ తఫ్సీర్

البَقَرَة

2. సూరహ్ అల్-బఖరా

( గత సంచిక తరువాయి )

## 50వ ఆయత్ నుండి 59వ ఆయత్ వరకూ

### సూరహ్ అల్-బఖరా (50 నుండి 59 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| అర్థం | అరబీ పదం |
|---|---|
| 399. అప్పుడు | إِذْ |
| 400. మేము వేరుచేశాము | فَرَقْنَا (ف ر ق) |
| 401. మీ కొరకు | بِكُمْ |
| 402. సముద్రం | بَحْرٌ |
| 403. మేము ముంచివేశాము | أَغْرَقْنَا |
| 404. మీరు చూస్తూనే ఉన్నారు | تَنْظُرُوْنَ |
| 405. మేము వాగ్దానం చేశాము | وَاعَدْنَا |
| 406. నలభై | أَرْبَعِيْنَ |
| 407. రాత్రి | لَيْلَة (لَيَالِي) |
| 408. అప్పుడు | ثُمَّ |
| 409. మీరు తీసుకున్నారు | اتَّخَذْ تُمْ (ا خ ذ) |
| 410. ఆవు దూడ | عِجْلٌ |
| 411. ఆయన తరువాత | مِنْ بَعْدِهِ |
| 412. దుర్మార్గులు | ظَالِمُوْنَ (ظ ل م) |
| 413. మేము క్షమించాము | عَفَوْنَا |
| 414. దాని తరువాత | مِنْ بَعْدِ ذٰلِكَ |
| 415. సత్యాన్ని అసత్యం నుండి వేరుపరిచే గ్రంథం | فُرْقَانْ |
| 416. మరలండి (పశ్చాత్తాపంతో) | تُوْبُوْا |
| 417. నిర్మాత | بَارِئٌ |
| 418. వరకు | حَتّٰى |
| 419. మేము చూస్తాము | نَرٰى |
| 420. బహిరంగంగా | جَهْرَةً |
| 421. ఉరుము | صَاعِقَةٌ |
| 422. లేపబడింది | بَعْثٌ |
| 423. నీడనిస్తాము | ظَلَّلْنَا (ظ ل ل) |
| 424. మేఘం | غَمَامٌ |
| 425. అల్-మన్ను | اَلْمَنَّ |
| 426. సల్వా | سَلْوٰى |
| 427. తినండి | كُلُوْا |
| 428. మంచి వస్తువులు | طَيِّبَاتِ (ط ي ب) |
| 429. వారు అన్యాయం చేశారు / దుర్మార్గం వహించారు | ظَلَمُوْا |
| 430. కాని | لٰكِنْ |

| | | | |
|---|---|---|---|
| 431. ఇది | هٰذِهِ | 440. మేము క్షమిస్తాము | نَغْفِرْ |
| 432. పట్టణం | قَرْيَةٌ | 441. మీ దోషాలు | خَطَايَاكُمْ |
| 433. ఎక్కడైనా | حَيْثُ | 442. త్వరలో | سَ |
| 434. మీరు కోరినది | شِئْتُمْ | 443. మేము పెంచుతాము | نَزِيْدُ (ز ي د) |
| 435. అమితంగా | رَغَدًا | 444. మంచి చేసినవారు | مُحْسِنِيْنَ |
| 436. ద్వారం | بَابٌ | 445. కాని / అప్పుడు | فَ |
| 437. సజ్దా | سُجَّدًا | 446. మారింది, బదులు | بَدَّلَ |
| 438. చెప్పండి | قُوْلُوْا | 447. శిక్ష | رِجْزًا |
| 439. క్షమాపణ | حِطَّةٌ | 448. దౌష్ట్యాల ఫలితంగా | يَفْسُقُوْنَ (ف س ق) |

**మరియు మేము మీ కొరకు సముద్రాన్ని చీల్చి మిమ్మల్ని రక్షించి నప్పుడు మీరు చూస్తూ ఉండగనే ఫిర్'ఔన్ జాతివారిని ముంచివేశాము. (2:50)**

ఫిర్'ఔన్ మరియు అతని ప్రజలు సత్యాన్ని అర్థం చేసుకోవాలని మూసా(అ)వారు అల్లాహ్ యొక్క సందేశహరునిగా ఎంతో కృషి చేశారు. కాని వారు తిరస్కార వైఖరే అవలంబించారు. ఇస్రాయీలీయులను తీసుకుని రహస్యంగా ఈజిప్టును వదిలి వెళ్ళమని అల్లాహుతాలా మూసా(అ)వారిని ఆదేశించారు. వారు వెళ్ళే మార్గంలో సముద్రం ఉంది. ఫిర్'ఔన్ తన సైన్యంతో వారిని వెంబడించాడు.

అల్లాహ్ సముద్రాన్ని చీలిపొమ్మని ఆదేశించారు. మూసా(అ) మరియు అతని ప్రజలు వెళ్ళడానికి సముద్రంలో దారి ఏర్పాటు చేశారు. కాబట్టి వారు క్షేమంగా వెళ్ళగలిగారు. కాని ఫిర్'ఔన్ మరియు అతని సైన్యం వారిని అనుసరిస్తూ సముద్రంలోకి రాగానే, చీలిన సముద్రం తిరిగి కలిసి పోయింది. ఆ విధంగా ఫిర్'ఔన్ మరియు అతని సైన్యం ముంచి వేయబడ్డారు.

ఇస్రాయిల్ సంతానం ఫిర్'ఔన్ నుండి కాపాడబడిన ఆ రోజును 'ఆషూరా' అంటారు. ఇది ముహర్రమ్ నెల 10వ రోజున వస్తుంది.

ఈ 'ఆషూరా రోజుకి సంబంధించి, దిగువున రెండు హదీస్‌లు అందిస్తున్నాము.

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు మదీనా వచ్చారు. మరియు యూదులు ఉపవాసం ఉన్నారని ఆయన తెలుసు కున్నారు. ఆయన(స) అడిగారు : 'ఇది ఏమిటి?' వారు చెప్పారు: "ఈ రోజే అల్లాహ్ మూసా(అ)వారిని రక్షించి ఫిర్'ఔన్‌ను ముంచి వేశారు. కాబట్టి మూసా(అ)వారు కృతజ్ఞతతో ఈ రోజు ఉపవాసం ఉన్నారు." అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అన్నారు : "మాకే ఎక్కువ హక్కు ఉంది మూసా(అ)వారిపై మీ కంటే." కాబట్టి ఆయన ఉపవాసం ఉన్నారు (ఆ రోజు) మరియు (ఇతరులను) కూడా ఆదేశించారు ఉపవాసం ఉండమని **(ఇబ్నెమాజా, సహీహ్, 1734, అధ్యా.41, సంపుటి 2)**

ముహమ్మద్ బిన్ సైఫీ ఉల్లేఖించారు. రసూలుల్లాహ్(స)వారు 'ఆషూరా దినాన మాతో చెప్పారు : "మీలో ఎవరైనా ఈ రోజు తిన్నారా?" మేము చెప్పాము : "మాలో కొందరు తిన్నారు మరియు మాలో కొందరు తినలేదు." ఆయన(స) చెప్పారు : "పూర్తి చేయండి మిగిలిన మీ రోజును ఎవరైతే తిన్నారో మరియు ఎవరైతే తినలేదో (అంటే రోజులో మిగిలిన భాగం ఉపవాసం ఉండమని)మరియు కబురు పంపండి చివరి ప్రాంతాలవారికి మిగిలిన రోజును పూర్తి చేయమని." ఆయన(స) ప్రస్తావించింది మదీనా చుట్టుపక్కల ఉండే ప్రజల గురించి" **(ఇబ్నెమాజా, సహీహ్, 1735, అధ్యా. 41, సం.2)**

**మరియు మేము మూసాను నలభై రాత్రుల వాగ్దానం చేసి (పిలిచి నప్పుడు), మీరు అతను లేకపోవడం చూసి, ఆవుదూడను (ఆరాధ్య దైవంగా) చేసుకున్నారు. మరియు మీరు దుర్మార్గులయ్యారు. అయినప్పటికీ మీరు కృతజ్ఞులు అవుతారేమోనని మేము మిమ్మల్ని మన్నించాము. (2:51-52)**

మూసా(అ)వారి ప్రజలు ఫిర్'ఔన్ మరియు అతని సైన్యం నుండి రక్షింపబడ్డారు. చివరికి వారికి ప్రశాంతత లభించింది. ఇప్పుడు వారికి కావలసినది అల్లాహ్ ఆదేశాల ప్రకారం జీవించడానికి ఓ షరీయహ్.

మూసా(అ)వారి వేడుకోలు అల్లాహుతాలా స్వీకరించారు. అల్లాహ్ దివ్య గ్రంథాన్ని వాగ్దానం చేశారు. దాని కొరకు తూర్ పర్వతం పైకి వెళ్ళి 30 రోజులు ఆరాధనలో మూసా(అ)వారు గడిపారు. మూసా(అ) అల్లాహ్ ఆజ్ఞను పాటించారు. దివ్యగ్రంథాన్ని అందుకున్నారు. మరో 10 రోజులు సౌమ్ (ఉపవాసం) ఉండమని అల్లాహ్ ఆదేశించారు. మూసా(అ)వారు 40 ఉపవాస ఆరాధనలను పూర్తి చేశారు.

ఇదే విషయం ఖుర్'ఆన్‌లో మరోచోట కూడా చెప్పబడింది.

**"మరియు మేము మూసా కొరకు ముప్ఫయి రాత్రులు నిర్ణయించాము. తరువాత పది పొడిగించాము. ఈ విధంగా అతని ప్రభువు నిర్ణయించిన నలభై రాత్రుల గడువు పూర్తయింది."** (ఖుర్'ఆన్ 7:142)

పైన ప్రస్తావించిన నలభై రోజులలో మొదటి ముప్ఫయి రోజులు జిల్ ఖదా నెలవని మరియు తరువాయి పదిరోజులు జిల్ హిజ్జాకి చెందినవిగా చెప్పబడింది.

**మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మీరు సన్మార్గులు అవుతారేమో నని మేము మూసాకు గ్రంథాన్ని మరియు ఫుర్‌ఖాన్ (సత్యాన్ని అసత్యం నుండి వేరుచేసేదానిని) ప్రసాదించాము. (2:53)**

మూసా(అ)వారికి ఇచ్చిన ఆ గ్రంథం పేరు - **తౌరాత్.**

ఇదే విషయం 28వ సూరహ్‌లో కూడా చెప్పబడింది. క్రింది ఆయత్ చూడండి:

**"మరియు వాస్తవానికి పూర్వతరాల వారిని నాశనం చేసిన తరువాత- మేము మానవులకు జ్ఞానవృద్ధి చేయడానికి మరియు వారికి మార్గదర్శకత్వంగా కారుణ్యంగా ఉండటానికి, మూసాకు గ్రంథాన్ని ప్రసాదించాము. బహుశా వారు హితబోధ నేర్చుకుంటారని!"** (ఖుర్'ఆన్ 28:43)

మూసా(అ)వారు తౌరాత్ గ్రంథాన్ని తీసుకుని వచ్చారు. అయితే ఆయన తూర్ పర్వతంపై ఉన్నప్పుడు ఇక్కడ ఇస్రాయీల్ సంతానం ఆవుదూడను ఆరాధించారు. ఆ విషయమై ఖుర్'ఆన్‌లో ఇలా వివరించబడింది.

**మరియు (జ్ఞాపకం చేసుకోండి!) మూసా తన జాతివారితో ఇలా అన్న విషయాన్ని : "ఓ నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, ఆవుదూడను (ఆరాధ్య దైవంగా) చేసుకుని మీకు మీరే అన్యాయం చేసుకున్నారు. కనుక పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కొరకు మీ నిర్మాతను (సృష్టికర్తను) వేడుకోండి. మీలోని (ఘోర పాతకులను) సంహరించండి. ఇదే మీ కొరకు - మీ సృష్టికర్త దృష్టిలో - శ్రేష్ఠమైనది." ఆ తరువాత ఆయన (అల్లాహ్) మీ పశ్చాత్తాపాన్ని అంగీకరించాడు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, అపార కరుణాప్రదాత. (2:54)**

అబుల్ ఆలియహ్, స'ఈద్ బిన్ జుబైర్ మరియు అర్-రబీ బిన్ అనస్ పై ఆయత్‌లోని **"కాబట్టి పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కొరకు మీ నిర్మాతను వేడుకోండి."** అనే అంశంపై ఇలా వ్యాఖ్యానించారు. "మీ నిర్మాతను" అనేది ఇస్రాయీల్ సంతానం చేసిన పాపం యొక్క ఘోరం గురించి వారిని అప్రమత్తం చేస్తుంది.

అంటే "పశ్చాత్తాప పడండి ఆయనకు ఎవరైతే మిమ్మల్ని సృష్టించారో, ఆరాధనలో ఇతరులను మీరు సహవర్తులుగా చేసిన తరువాత"

ఇబ్నె జరీర్(రజి)వారి ఉల్లేఖనం. ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పారు ..... అల్లాహ్ ఆదేశించారు మూసా(అ)వారిని తన ప్రజలతో పరస్పరం చంపుకోవాలని ఆదేశించమని. ఆయన ఆదేశించారు ఆవు దూడను ఆరాధించిన వారిని కూర్చోమని మరియు ఆవుదూడ ఆరాధన చేయని వారిని చేతులలో కత్తులు పట్టుకుని నిలుచోమని. వారు వారిని చంపడం ప్రారంభించగనే దట్టమైన చీకటి వారిపై అలుముకుంది. ఆ చీకటి తొలగిపోగానే, వారు వారిలోని 70వేల మందిని చంపారు. చంపబడిన వారూ క్షమించబడ్డారు మరియు జీవించి ఉన్నవారూ క్షమించబడ్డారు.

పై ఆయత్‌లో అల్లాహ్ పశ్చాత్తాపాన్ని అంగీకరించారని మరియు అపార కరుణాప్రదాత అని ఉంది. కాని 70వేల మంది సంహారం జరిగింది. కాబట్టి ఇక్కడ కొంత వివరణ తప్పనిసరిగా అందించవలసి ఉంది. తరువాయి వచ్చే 2 ఆయత్‌ల తరువాత వివరణ ఇచ్చాము.

**మరియు అప్పుడు మీరు అతనితో అన్న మాటలు "ఓ మూసా! మేము అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూడనంత వరకు నిన్ను ఏమాత్రం విశ్వసించము." అదే సమయంలో మీరు చూస్తూ ఉండగానే ఒక భయంకరమైన పిడుగు మీపై విరుచుకుపడింది (మీరు చనిపోయారు). ఆ తరువాత, మీరు కృతజ్ఞులై ఉంటారేమోనని - మీరు మరణించిన తరువాత - మిమ్మల్ని తిరిగి బ్రతికించాము.** (2:55-56)

పై ఆయత్ వివరణపై ఎన్నో ఉల్లేఖనాలను తఫ్సీర్ ఇబ్నెకసీర్‌లో అందించారు.

- **"మీరు చూస్తూ ఉండగానే"** అనే విషయంపై 'ఉర్వా బిన్ రువైమ్ ఇలా వివరించారు : 'వారిలో కొందరిపై పిడుగు పడింది ఇతరులు గమనిస్తుండగా. అల్లాహ్ వారిని తిరిగి బ్రతికించారు మరియు మిగిలిన వారిపై పిడుగుపడేలా చేశారు.'
- **"ఒక భయంకరమైన పిడుగు మీపై విరుచుకు పడింది"** అనే ఆయత్ భాగంపై అస్-సుద్ది గారి వ్యాఖ్యానం : వారు చనిపోయారు మరియు మూసా(అ)వారు రోదిస్తూ నిలుచుని అల్లాహ్‌ను వేడుకున్నారు. "ఓ ప్రభూ! నేనేమి చెప్పాలి ఇస్రాయీల్ సంతానానికి వారి దగ్గరికి వెళ్లినప్పుడు మీరు వారిలోని ఉత్తములను నాశనం చేసిన తరువాత."

"ఓ నా ప్రభూ! నీవు కోరితే, వీరిని మరియు నన్ను కూడా ఇంతకు పూర్వమే సంహరించి ఉండేవాడవు. ఏమీ? మాలో కొందరు మూర్ఖులు చేసిన పనికి నీవు మమ్మల్ని నశింపజేస్తావా?"

అల్లాహ్ మూసా(అ)వారికి తెలియజేశారు. ఆ 70 మంది ఆవుదూడను ఆరాధించిన వారిలో ఉన్నారు. తరువాత అల్లాహుతాలా వారిని తిరిగి బ్రతికించారు ఒక్కొక్కరిని ఒకేసారిగా, మిగిలినవారు అల్లాహుతాలా ఏ విధంగా తిరిగి బ్రతికిస్తున్నారో గమనిస్తుండగా.

అదే విషయాన్ని పైన తెలిపిన 56వ ఆయత్‌లో అల్లాహ్ చెప్పారు : "మీరు మరణించిన తరువాత - మిమ్మల్ని తిరిగి బ్రతికించాము."

● అ(రబీ బిన్ అనస్ చెప్పారు, "మరణమే వారికి శిక్ష. మరియు వారు మరణించిన తరువాత తిరిగి బ్రతికించబడ్డారు. కాబట్టి వారు తమ జీవితాలని తిరిగి ముగించగలరు." ఖతాదా ఇదే విధంగా చెప్పారు.

● అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్ బిన్ అస్లమ్ ఈ ఆయత్‌పై ఇలా వ్యాఖ్యానించారు. "మూసా(అ)వారు తన ప్రభువును కలుసుకుని, ఆయనచే వ్రాయబడిన తౌరాత్ ఫలకాలను తీసుకుని తిరిగి వచ్చారు. తాను లేని సమయంలో వారు ఆవుదూడను ఆరాధించిన సంగతి తెలుసుకున్నారు. పర్యవసానంగా, వారిని ఆదేశించారు వారిని వారే చంపుకోవాలని. వారు పాటించారు మరియు అల్లాహ్ వారిని క్షమించారు. ఆయన వారితో చెప్పారు, "ఈ ఫలకాలు అల్లాహ్ గ్రంథం, ఏదైతే మిమ్మల్ని ఆదేశించాడో మరియు ఏదైతే మీ కొరకు నిషేధించాడో కలిగి ఉంది."

వారు అన్నారు, "నీవు చెప్పావు కాబట్టి మేము ఈ ప్రకటనను విశ్వసించాలా? అల్లాహ్ సాక్షి! మేము విశ్వసించము, ప్రత్యక్షంగా మేము అల్లాహ్‌ను చూసేవరకూ, ఆయన మాకు స్వయంగా కనిపించే వరకూ మరియు ఇలా చెప్పేవరకూ, '**ఇది నా గ్రంథం, కాబట్టి దీనిని అంటిపెట్టుకుని ఉండండి**' అని ఎందుకు ఆయన మాతో మాట్లాడరు మీతో మాట్లాడినట్లు, ఓ మూసా?"

తరువాత ఆయన (అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్) అల్లాహ్ ఆయత్‌ని పఠించారు. "ఓ మూసా! మేము అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూడనంత వరకు నిన్ను ఏమాత్రం విశ్వసించము" మరియు అన్నారు, "కాబట్టి అల్లాహ్ ఆగ్రహం వారిపై పడింది, ఓ పిడుగు వారిపై విరుచుకు పడింది మరియు వారంతా మరణించారు. తరువాత అల్లాహ్ తిరిగి వారిని బ్రతికించారు ఆయన వారిని మరణింపజేసిన తరువాత."

తరువాత ఆయన (అబ్దుర్రహ్మాన్ బిన్ జైద్) అల్లాహ్ ఆయత్‌ని పఠించారు : **"ఆ తరువాత, మీరు కృతజ్ఞులై ఉంటారేమోనని - మీరు మరణించిన తరువాత - మిమ్మల్ని తిరిగి బ్రతికించాము."**

తరువాత చెప్పారు,

"మూసా(అ) వారితో అన్నారు, '**స్వీకరించండి అల్లాహ్ గ్రంథాన్ని**' వారు అన్నారు, '**లేదు.**' ఆయన అడిగారు, "మీకేమైంది?" వారు చెప్పారు, "సమస్య ఏమిటంటే మేము మరణించాము మరియు తిరిగి లేపబడ్డాము?" ఆయన(స) చెప్పారు '**స్వీకరించండి అల్లాహ్ గ్రంథాన్ని**' వారు చెప్పారు '**లేదు.**' తరువాత అల్లాహ్ తన దూతలలో కొందరిని పంపారు పర్వతాన్ని వారిపై పడేలా చేయడానికి (తబరీ 2:88). అంటే ఇస్రాయీల్ సంతానం తిరిగి లేపబడ్డాక ఈ ఆదేశాలు పాటించాలని తెలుస్తుంది. ఇంకనూ ఎన్నో ఉల్లేఖనాలు ఈ సందర్భంగా చెప్పబడ్డాయి. అవి ఇక్కడ అందించడం లేదు.

ఖుర్తుబీ గారు చెప్పిన దానిని బట్టి, 'ఇస్రాయీల్ సంతానం ఈ భయంకరమైన ఉపద్రవాలు మరియు సంఘటనలు ప్రత్యక్షంగా చూసినప్పటికీ, ఇక ఆదేశాలను శిరసా వహించవలసిన బాధ్యత తమపై లేదని అనుకోకూడదు. బదులుగా వారు దాని కొరకు బాధ్యత వహించాలి మరియు అది స్పష్టం. అల్లాహ్‌కే బాగా తెలుసు.'

ఈ వ్యాసంలో ఇప్పటివరకూ అంటే, ఫిర్ఔన్ నుండి ఇస్రాయీల్ సంతానం రక్షించబడి నప్పటి నుండి మరణించిన వారు తిరిగి లేపబడిన వరకూ జరిగిన సంఘటనలు ఇస్రాయీల్ సంతానం యొక్క పరిస్థితిని తెలియ జేస్తున్నాయి.

ఫిర్ఔన్ రాజు వారి మగబిడ్డలను చంపి, ఆడబిడ్డలను వదిలేసే వాడు మరియు వారిని అతి నీచంగా చూసేవాడు. ఫిర్ఔన్ పరిపాలనలో ఎన్నో కష్టాలు అనుభవిస్తూ బానిసలుగా బ్రతుకుతూ అల్లాహ్ పంపే ఓ ప్రవక్త గారి కోసం ఎదురు చూసేవారు. అల్లాహ్ తన సందేశహరుడిని పంపారు. ఫిర్ఔన్ నుండి వారిని తప్పించడానికి రహస్యంగా అల్లాహ్ ఆదేశం ప్రకారం వారిని తీసుకుని బయలుదేరారు.

వెంబడించిన ఫిర్ఔన్ సైన్యాన్ని మరియు తమ ముందున్న సముద్రాన్ని చూసిన తరువాత వారంతా ఎటువంటి ఆందోళనకు గురి అయి ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

సముద్రం చీలిపోయి నేల కనిపిస్తుందని, దానిపై అవతలివైపుకు క్షేమంగా చేరుకోగలమని వారు ఊహించి ఉండరు. ఎందుకంటే అటువంటి అద్భుతం గురించి వారికి తెలిసి ఉండకపోవచ్చు. అటువంటి అద్భుతం కేవలం తమను సృష్టించి, పోషిస్తున్న అల్లాహ్‌యే చేయగలడని వారికి తెలుసు.

ఎంతో కాలంగా బానిస బ్రతుకులలో మగ్గిన వారు ఫిర్ఔన్ వంటి దుర్మార్గుడి నుండి రక్షింపబడ్డాక తమ సృష్టికర్తపై ఎంతటి కృతజ్ఞత చూపాలి? ప్రత్యక్షంగా ఆ అద్భుతాన్ని చూసిన తరువాత కూడా, వారు ఆవుదూడ విగ్రహాన్ని తయారు చేసుకుని, దానిని ఆరాధించడాన్ని బట్టి అల్లాహ్‌కు ఎంతటి కృతఘ్నత చూపారో అర్థం చేసుకోవచ్చు.

సముద్రాన్ని దాటించింది ఆ ఆవుదూడ కాదు. బానిస బ్రతుకులతో అష్టకష్టాలు పడుతున్నవారిని రక్షించింది వారు తయారు చేసుకున్న ఆ ఆవుదూడ కాదు. అల్లాహ్ నుండి అనుగ్రహాన్ని పొందిన తరువాత కూడా ఆయనతో ఓ ఆవుదూడ విగ్రహాన్ని సమానం చేస్తారా?

అప్పుడు వారికి మరియు అల్లాహ్ సందేశాన్ని తిరస్కరించిన ఫిర్ఔన్ జాతికి తేడా ఏముంది? ఫిర్ఔన్ మరియు అతని సైన్యం సముద్రంలో చిక్కుకుని నాశనం అయింది. వీరిగతి మాత్రం అందుకు భిన్నంగా ఎందుకుండాలి? చనిపోయే ముందు ఫిర్ఔన్‌కి కూడా పశ్చాత్తాపం కలిగింది.

అయితే ఓ ముఖ్య విషయాన్ని ఇక్కడ గమనించాలి. ఫిర్ఔన్ చనిపోయాడు. అతడు అల్లాహ్‌చే క్షమించబడలేదు. కాని సంహరించ బడిన ఇస్రాయీల్ సంతానాన్ని అల్లాహ్ క్షమించాడు. కాబట్టి వారు పరలోకంలో రక్షించబడినట్లే. అందుకే అల్లాహ్ అపార కరుణాప్రదాత.

అల్లాహ్ ఆదేశంతోనే మూసా(అ)వారు కర్రతో కొట్టగానే సముద్రం చీలింది. అది సరిపోదా వారికి ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడని నమ్మడానికి? ఆయన అల్లాహ్ గ్రంథాన్ని తీసుకు వచ్చిన తరువాత, అల్లాహ్ చెబితేనేగాని వారు నమ్మము అని చెప్పారు. మరి వారితో అల్లాహ్ ప్రత్యక్షంగా చెబితేనే సముద్రాన్ని దాటారా? '**ప్రత్యక్షంగా తమతో అల్లాహ్ చెబితేనే గాని కదలము**' అని చెప్పారా? లేదు కదా!

నేటి మన సమాజంలో కూడా ఎందరో ఇటువంటి కృతఘ్నులు ఉన్నారు. వివేకం గలవారు అల్లాహ్ చేస్తున్న మహోన్నతమైన మేలు అర్థం చేసుకో గలుగుతారు.

**(మరికొంత భాగం వచ్చే సంచికలో, ఇన్షా అల్లాహ్ ...)**

### హితబోధ గ్రహించడం సులభమే!

ప్రతిరోజూ ఖుర్'ఆన్ అర్థం చేసుకుంటూ చదవండి. అరబీలో చదివిన తరువాత దాని అర్థాన్ని మరియు వీలైతే తఫ్సీర్‌ని కూడా చదవండి. ప్రతీ రోజూ ఎన్నో పత్రికలు, పుస్తకాలు చదివే వారుంటారు. వాటిని చదవవద్దని గాని లేక మరే విధంగానూ మేము వ్యాఖ్యలు చేయదలచు కోలేదు. ఖుర్'ఆన్ ను కాస్సేపు రోజూ చదవమని మాత్రం కోరుతున్నాము.

"అరబీలో చదవడం రాదు. అనువాదాన్ని చదవడానికి తెలుగు రాదు లేదా ఇంగ్లీష్ రాదు లేదా ఉర్దూ రాదు .....". ఈ విధంగా 'రాదు, రాదు' అని చెప్పడం అలవాటు చేసుకుంటే ఏదీ రాదు.

మన అవసరాన్ని తెలుసుకుని బస్సులు, ట్రెయిన్‌లు మన దగ్గరకు రావు కదా! ప్రయాణం చేయాలంటే వాటి దగ్గరకు మనమే వెళ్ళాలి. అల్లాహ్ పేరుతో కృషి చేస్తే సాధ్యమవుతుంది.

'ఇహదినస్ సిరాతల్ ముస్తఖీమ్' (మాకు సన్మార్గం చూపండి) అని ప్రతీ రకాత్‌లో అల్లాహ్‌ను మనం వేడు కుంటున్నాము. దానికి జవాబుగా ఆయన చూపిన సన్మార్గమే - 'ఖుర్'ఆన్'. అల్లాహ్‌ను కోరినది ఆయన మనకు ఇచ్చినప్పుడు, దానిని వదిలేయడమా? అటువంటి సన్మార్గాన్ని వదిలేసి మనం ఎటుపోతున్నామో ఆలోచించాలి. ఖుర్'ఆన్ చదవండి. సులభంగా అర్థమౌతుంది. ఆ విషయాన్ని అల్లాహ్‌యే ఖుర్'ఆన్‌లో స్పష్టంగా చెప్పారు.

**"మరియు వాస్తవానికి, మేము ఈ ఖుర్'ఆన్‌ను హితబోధ గ్రహించ డానికి సులభం చేశాము. అయితే హితబోధ స్వీకరించేవాడు ఎవడైనా ఉన్నాడా?"**

(ఖుర్'ఆన్ 54:32)

**కాబట్టి ఖుర్'ఆన్ ప్రతీ రోజూ చదువుతూ అల్లాహ్ చేసిన హితబోధను గ్రహించుదాం, ఇన్షా అల్లాహ్!**

**మీ బంధువులు మరియు స్నేహితులను శాంతిబాట చందా దారులుగా చేర్చి సత్యాన్ని వ్యాపింప చేయడంలో సహకరించమని కోరుతున్నాము.**

**డి.టి.డి.సి. కొరియర్ ద్వారా కాపీని పొందగోరువారు సంవత్సర చందా రూ. 200/- కు అదనంగా మరో రూ. 100/- చెల్లిస్తే, మీకు కొరియర్ ద్వారా పంపిన వెంటనే కన్‌సైన్‌మెంట్ నంబర్ మీకు ఎస్.ఎమ్.ఎస్. చేస్తాము, ఇన్షా అల్లాహ్**

### కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం ప్రతీ నెల 15వ తారీఖున శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది. ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

# తిరిగి గూటికి

దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

### నవ ముస్లిమ్? New Muslim?

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

### ఏ భాష అయినా ఒక్కటే! అంతా సమానమే!

ఖుర్ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్'ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన బిలాల్(రజి), అబూజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి), అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు, పైన వివరించిన విశ్వాసుల సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. గత మూడు సంచికల నుండి విశ్వాస స్త్రీల జీవితచరిత్రలను ఓ ఆరు నెలల పాటు అందించాలని అల్లాహ్ పేరుతో సంకల్పించడం జరిగింది. **క్రిందటి సంచికలో ఉమ్మె అమ్మారహ్ (రజి) వారి గురించి, ఆమె విశిష్ఠత గురించి క్లుప్తంగా తెలియజేశాము.**

# అస్మా బిన్తె అబూబక్ర్ సిద్దీఖ్ (రజి)

**• ధీర వనిత • జ్ఞాని • జాతున్ నితాఖైన్**

**ఇస్లామ్ స్వీకరించిన 18వ వ్యక్తి.**

**ముహమ్మద్(స)వారి సతీమణి ఆయిషా(రజి)వారు ఈమెకు చెల్లెలు.**

**కుమార్తెగా, భార్యగా, మాతృమూర్తిగా ఇస్లామ్ ప్రారంభం నుండి దాదాపు 86 సంవత్సరాలు ఇస్లామ్ ప్రకారం జీవించిన ఉత్తమురాలు**

మక్కా నుండి మదీనాకు జరిగిన హిజ్రత్‌కు 27 సంవత్సరాలకు ముందు అస్మా(రజి) జన్మించారు. ఆమె తల్లిగారి పేరు ఖతీలహ్ మరియు తండ్రిగారు అబూబక్ర్ సిద్దీఖ్(రజి). అబూబక్ర్(రజి) మరియు ఖతీలహ్ గారి వివాహం ఇస్లామ్‌కు పూర్వం జరిగింది. అబూబక్ర్ (రజి)వారికి 21 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు అస్మా(రజి) జన్మించారు. ఆమె మాతృమూర్తి మాత్రం ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించలేదు. మక్కా విజయం తరువాత ఇస్లామ్ స్వీకరించారు.

తండ్రిగారి ప్రభావం మరియు బోధనల వలన **అస్మా**(రజి)వారు ప్రారంభంలోనే ఇస్లామ్ స్వీకరించారు. ఇస్లామ్ స్వీకరించిన 18వ వ్యక్తి - అస్మా(రజి)వారు.

మక్కాను విడిచి మదీనా వలస వెళుతున్నప్పుడు, ముహమ్మద్(స) వారు మరియు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు సౌర్ పర్వత గుహలో తలదాచుకోవలసి వచ్చింది. జనాలు లేని ఆ ఎడారిలో అస్మా(రజి)వారే ఆహారాన్ని తీసుకుని వారి దగ్గరికి వెళ్ళేవారు.

ఆ ఎడారిలో ఎవరి కంటా పడకుండా తీసుకెళ్ళడం సామాన్యమైన విషయం కాదు. అప్పటికే ముహమ్మద్(స)వారిపై మక్కా ముష్రిక్ నాయకులు హత్యా ప్రయత్నం చేశారు. దాని నుండి ముహమ్మద్(స) వారు అల్లాహ్ అనుగ్రహంతో తప్పించుకున్నారు. కాబట్టి ఆ దుర్మార్గుల బారిన పడకుండా తనను తాను రక్షించుకోవడం మాత్రమే కాకుండా, తన రాకపోకల ద్వారా ముహమ్మద్(స) ఎక్కడ ఉన్నారో ఎవరికి అనుమానం రాకుండా ఉండాలి. అంటే ధైర్యం మరియు తెలివితేటలు కలిగి ఉండాలి. ఇవి మాత్రమే కాదు ఎన్నో సుగుణాలున్న విశ్వాసురాలు - అస్మా(రజి).

ముహమ్మద్(స) మరియు అబూబక్ర్ సిద్దీఖ్(రజి) ఆ ప్రదేశాన్ని వదిలి మదీనా వైపు పయనమై వెళ్ళిన తరువాత అబూ జహ్ల్ అసహనంతో అబూబక్ర్(రజి)వారి ఇంటికి వచ్చాడు. **'నీ తండ్రి ఎక్కడ?'** అని అస్మా(రజి)వారిని అడిగాడు. **'నేనేమి చెప్పగలను?'** అని ఆమె సమాధానం ఇచ్చారు. ఆమె చెంపపై చాలా గట్టిగా కొట్టాడు. ఆమె చెవి రింగు విరిగి క్రింద పడిపోయింది. అస్మా(రజి)వారు సహనంతో భరించారు. ఇంట్లోకి వెళ్ళి తన వెనుకే తలుపు వేసేసారు.

అస్మా(రజి)వారికి ఓ బిరుదు ఉంది. **జాతున్ నితాఖైన్**. ఈ బిరుదు రావడానికి ఓ సంఘటన చెప్పాలి. నడుము చుట్టూ స్త్రీలు కట్టుకునే తాడుని నతాఖ్ అంటారు. ప్రవక్త(స)వారు మరియు అబూబక్ర్(రజి)వారు మదీనా ప్రయాణానికి సిద్ధమైనప్పుడు అస్మా(రజి)వారు ఆహార పదార్థాలను ఒక చర్మపు సంచిలో ఉంచారు. కాని ఆ సంచి మూతిని కట్టడానికి తాడు లేదు. కాబట్టి ఆమె తన నడుముకు కట్టుకున్న తాడును

తీసుకుని దానిని రెండు ముక్కలు చేసి, ఒక ముక్కతో ఆ చర్మపు సంచిని కట్టారు. మరొక ముక్కతో నీటి తిత్తిని కట్టారు. ప్రవక్త(స)వారు ఆమెను **జాతున్ నితాఖైన్** అని ఆశీర్వదించారు మరియు చెప్పారు ఆమె త్యాగం చేసిన ఒక తాడు స్థానంలో, స్వర్గంలో రెండు పొందుతారని. అంటే ఆమె స్వర్గప్రవేశ శుభవార్త హిజ్రత్‌కు ముందే అందుకోవడం జరిగింది.

ఆమె తండ్రి మరియు ప్రవక్త(స)వారు మక్కా వదిలి వెళ్ళిన తరువాత, అంధుడు మరియు ముసలివాడైన తన తాతగారు, అబూ ఖుహాఫహ్‌తో అస్మా(రజి)వారు మక్కాలోనే ఉన్నారు. తన కుమారుడు మదీనా పట్టణానికి వలస వెళ్లిపోవడం ఆ ముసలాయనకి విచారం కలిగించింది. ఖర్చుల కోసం ధనం ఏమైనా కుమారుడు వదిలి వెళ్లాడో లేదోనని కంగారు పడ్డారు.

ఆమె చెప్పారు, ఇంటిలో 4 లేక 5 వేల (బంగారు) దీనార్లు ఉండేవి. అయితే తన తండ్రి ప్రయాణం కోసం ఆ మొత్తాన్ని తీసుకుని వెళ్ళారు. కాని ఆమె తన తాతయ్యగారితో ఇంట్లో చాలా ఉందని, లోటు లేదని చెప్పి సముదాయించారు. ఆయనని నమ్మించడానికి దీనార్ సైజులో ఉండే గుళకరాళ్ళని సేకరించి ఓ కుండలో ఉంచి పైన వస్త్రంతో వాటిని కప్పారు. అబూబక్ర్(రజి)వారు ధనాన్ని ఉంచేచోట దానిని ఉంచారు. అది ఎంత ఉందో అంచనా వేయమని తాతగారిని అడిగారామె. ఆయన చేతులతో దానిని తడిమి తృప్తి పడ్డారు. అబూ ఖుహాఫా చాలా సంతోషించారు తన కుమారుడు వారిని నిర్లక్ష్యం చేయలేదని. అస్మా(రజి)వారు ఆ ముసలాయన ప్రశాంతత కోసం అలా చేశారు. అల్లాహ్‌పై అబూబక్ర్(రజి)వారికి ధృడమైన విశ్వాసం ఉంది. అదే వారికి సహాయం చేస్తుంది. పై సంఘటన ద్వారా ఆమె మానసిక పరిపక్వత గురించి తెలుస్తుంది. అంతేకాకుండా తన తండ్రి తన కొరకు ఏ ఐశ్వర్యాన్ని వదలక పోయినా ధైర్యంగా ఉన్నారామె. అల్లాహ్‌పై ఆమెకెంత విశ్వాసం ఉందో అర్థమౌతుంది.

ఈమె వివాహం ముహమ్మద్(స)వారి మేనత్తగారైన **సఫియ్యహ్** (రజి) వారి కుమారునితో జరిగింది. ఆయన పేరు - **జుబైర్ బిన్ 'అవ్వామ్**(రజి). ఈయన ప్రవక్త(స)వారి స్నేహితుడు మరియు అనుచరుడు. ప్రతీ ప్రవక్త ఒక శిష్యుడుని కలిగి ఉంటారని మరియు తన శిష్యుడు జుబైర్(రజి) అని ముహమ్మద్(స)వారు చెప్పారు.ముహమ్మద్(స)వారి మాటలను బట్టి జుబైర్(రజి)వారి గురించి ప్రత్యేకంగా ఇక్కడ వివరించవలసిన అవసరం లేదు.

ఈ దంపతులిద్దరికి సంబంధించి ఇక్కడ ఒక సంఘటన చెప్పవలసి ఉంది. అయితే ఇదే సంఘటనను ముస్లిమ్ మహిళ శీర్షికలో రాబోవు సంచికలో అందిస్తున్నాము, ఇన్షా అల్లాహ్!

ఈ దంపతులకు 5 గురు కుమారులు (అబ్దుల్లాహ్, ఉర్వా, మంజర్, మహజిమ్, ఆసిమ్) మరియు 3 గురు కుమార్తెలు (ఖథీజా, ఉమ్ముల్ హస్సన్ మరియు ఆయిషా).

అస్మా(రజి)వారు తన బంధువులతో కలిసి మదీనాకు హిజ్రత్ చేశారు. హిజ్రత్ లో ఖుబా లోయకు దగ్గరలో ఉండగా ఆమెకు ప్రసవ వేదన మొదలైంది మరియు ఓ కుమారునికి జన్మనిచ్చారు. ఆ అబ్బాయి పేరు - **అబ్దుల్లాహ్ బిన్ జుబైర్**(రజి). ఇది ముస్లిములకు ఓ ప్రత్యేక సందర్భం. ఎందుకంటే చాలా కాలం నుండి ముస్లిములకు మగపిల్లలు జన్మించ లేదు. అందువలన ముస్లిమ్ జాతి అంతరించిపోతుందని అవిశ్వాసులు చాలా సంతోషపడేవారు. ప్రవక్త(స) వారితో సహా ముస్లిములందరికి 'అబ్దుల్లాహ్' పుట్టుక సంతోషం కలిగించింది.

ముహమ్మద్(స)వారు ఆ అబ్బాయిని చేతుల్లోకి తీసుకుని ఆ కుటుంబానికి శుభాకాంక్షలు అందజేశారు. తరువాత ఖర్జూరాన్ని నమిలి ఆ బిడ్డ నోటిలో ఉంచారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగున్నప్పుడు కూడా ఆమె సాధారణమైన జీవితాన్నే గడిపేవారు. సాధారణ ఆహారం మరియు సాధారణ దుస్తులతోనే తృప్తి పడేవారు. దానాలు విరివిగా చేసేవారు.

ఎప్పుడైనా జబ్బు పడితే, ఆమె తన దగ్గరుండే బానిసలకు స్వేచ్ఛ నిచ్చేసేవారు. తరచుగా ఆమె తన పిల్లలకు చెబుతుండేవారు:

> **"ఐశ్వర్యం కూడబెట్టడం కోసం కాదు మంచి పనుల కోసం ఉపయోగించడానికి మరియు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడానికి. మీరు పిసినారి అయితే అల్లాహ్ మీపై అనుగ్రహాలు కురిపించరు. మీరు అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తే, ఆయన మీకు సహాయం చేస్తారు మరియు ఎన్నటికీ నాశనం కాని ఐశ్వర్యాన్ని ఇస్తారు."**

**ఆమె తన చివరి శ్వాస వరకూ నిరాడంబరంగా ధర్మపరాయణతతోనే బ్రతికారు.**

ఆమె ధర్మానికి సంబంధించి ప్రతీ విషయాన్ని స్పష్టంగా తెలుసుకునే వారు. ఈమె తల్లిగారు ముష్రిక్‌గా ఉన్నప్పుడు మదీనా వచ్చి కుమార్తె నుండి కొంత ధనాన్ని సహాయంగా అడిగారు. తన తల్లి ముష్రిక్ అయినందు వలన తాను ఆమెకు సహాయం చేయవచ్చో చేయకూడదో తెలియదు. కాబట్టి తెలుసు కోవడానికి ఆమె ముహమ్మద్(స)వారి దగ్గరకు వెళ్ళారు. ఆయన అలాగేనని చెప్పారు. దయతో మెలగడం మరియు కరుణ చూపడాన్ని అల్లాహ్ ఎన్నడూ నిషేధించరని ఆయన(స) స్పష్టం చేశారు.

మరోమారు ఆమె మాతృమూర్తి ఆమె కోసం కొన్ని బహుమతులు తీసుకు వచ్చారు. అప్పుడు కూడా అస్మా(రజి) ప్రవక్త(స)వారి నుండి సలహా తీసుకున్నారు. ఆ బహుమతులు స్వీకరించడానికి మరియు ఆమెను కొంతకాలం పాటు తనతో ఉంచు కోవడానికి అనుమతి ఉందో లేదో తెలుసుకోవడం కోసం ప్రవక్త(స)వారి దగ్గరకు వెళ్ళారు. ప్రవక్త(స)వారు అప్పుడు కూడా అలాగేనని చెప్పారు.

అంటే కుమార్తె ముస్లిమ్ అయివుండి, తల్లి ముష్రిక్ అయినప్పటికీ తల్లికి సహాయం చేయడంలో, ఆమె నుండి బహుమతులు తీసుకోవడంలో ఎటువంటి దోషం లేదు. హరామ్/షిర్క్ కలిగి యుండనివి అయివుండాలి.

ఆమె చాలా ఔదార్యం మరియు వివేకం గల మహిళ. అబ్దుల్లాహ్ (రజి) చెప్పారు, తన మాతృమూర్తి (అస్మా) మరియు తన పిన్నిగారు ఆయిషా(రజి)కంటే ఎక్కువ ఔదార్యం గలవారిని ఎవరినీ చూడలేదని. అయితే వారిద్దరి మధ్య ఒక తేడా ఉంది. అది ఆయనే చెప్పారు. ఆయిషా(రజి)వారు కూడబెట్టి, ఆ మొత్తాన్ని ఒకేసారి దానం చేసేవారు. అస్మా(రజి)వారు ఎప్పటిదప్పుడే దానం చేసేసేవారని.

జబ్బుపడినవారు ఈమె ఆశీర్వాదాలకై వస్తుండేవారు.

అస్మా(రజి)వారి కుమారుడు, అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) పెరిగి పెద్దవారయ్యారు. జ్ఞానాన్ని పొందారు. మంచి ధర్మావగాహనతో ధైర్యాన్ని కలిగి ఇస్లామీయ చరిత్రలో ప్రముఖంగా నిలిచారు.

ముహమమ్మద్(స)వారి మనుమడు మరియు ఫాతిమా(రజి)వారి కుమారుడు హుసైన్(రజి)వారు షహీద్ అయిన తరువాత, అబ్దుల్లాహ్(రజి)వారు బనీ ఉమయ్యద్‌తో పోరాడారు. తన తండ్రి జుబైర్(రజి) వలే అబ్దుల్లాహ్(రజి) కూడా ధైర్యవంతుడు మరియు పరాక్రమశాలి.

ము'అవియహ్ బిన్ అబీ సుఫ్యాన్(రజి) మరణించిన తరువాత ఖలీఫత్ విషయమై యజీద్ బిన్ ము'అవియహ్‌కి బైత్ చేయడానికి పత్రం వచ్చింది. యజీద్‌తో విధేయతా ప్రతిజ్ఞ చేయడానికి అబ్దుల్లాహ్ (రజి) మరియు హుసైన్ (రజి) తిరస్కరించారు. వారు మక్కాకు వెళ్ళిపోయి అక్కడ నివాసం ఏర్పరచు కున్నారు. ఆయన మక్కాకు వెళ్ళిపోయేటప్పుడు ఆయనతో పాటు మాతృమూర్తి అస్మా(రజి)వారు కూడా ఉన్నారు.

హుసైన్(రజి)వారు ఇరాఖ్‌కి వెళ్ళారు మరియు కర్బల దగ్గర షహీద్ అయ్యారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఏకైక నాయకుడుగా మరియు పాలకుడిగా మక్కాలో మిగిలారు.

యజీద్ బిన్ ము'అవియహ్ మరణించిన కొంతకాలనికి అతని కుమారుడు ఖలీఫా అయ్యాడు మరియు అతని పేరు ము'అవియహ్. అతడు యువకుడు. ఖలీఫత్ కోసం తన వారసుడు ఎవరో చెప్పకుండానే ఇతడు కూడా మరణించాడు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ వెంటనే స్వయంగా తననే ముస్లిమ్ ప్రాంతాలపై ఖలీఫాగా ప్రకటించుకున్నారు. ముస్లిమ్ భూభాగాలలోని వారంతా ఆయనకు బైత్ చేశారు.

అరేబియా ద్వీపకల్పంలోని వారు, ప్రత్యేకంగా హిజాజ్ ప్రాంతీయులు మరియు మక్కా ప్రజలు ఆయనతో విధేయతా ప్రతిజ్ఞ చేశారు. అదే విధంగా ఇరాఖ్ ప్రజలు కూడా చేశారు. వారు ఉమయ్యద్ పరిపాలనలో చాలా కష్టాలు అనుభవించారు. అంతేకాకుండా ఉమయ్యద్ పరిపాలనలో అలీ(రజి)వారి కుటుంబానికి ఏమి జరిగిందో వారికి తెలుసు.

ఈజిప్టు వాసులు కూడా బైత్ చేశారు. ఒక జోర్డాన్ తప్ప మిగిలిన ప్రాంతాలలోని ప్రజలు కూడా ఈయనను ఖలీఫాగా ఆమోదించారు.

హిజ్రీ శకం 64లో అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)వారు ఖలీఫా అయ్యారు. హిజ్రీ శకం 73 వరకూ ఖలీఫాగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో ఆయన రెండు బలగాలతో పోరాడవలసి వచ్చింది. ఒక బలగం ముఖ్తార్ బిన్ అబూ ఉబైద్ సఖ్ఫీకు చెందినది. మరొకటి బనూ ఉమయ్యహ్ బలగం.

అయితే 'అబ్దుల్ మాలిక్ బిన్ మర్‌వాన్' ఖలీఫాగా అధికారం చేపట్టాక, కొన్ని ప్రాంతాలను అతను చేజిక్కించుకున్నాడు. అతడు తన ప్రతినిధిగా హిజాజ్‌కు హజ్జాజ్ బిన్ యూసుఫ్‌ను పంపాడు. అన్ని వైపుల నుండి దాడి చేసి సిరియా బలగాలను లొంగదీసుకున్నాడు.

అబ్దుల్లాహ్(రజి) యొక్క ఖలీఫత్‌ను ముగించడానికి, అబ్దుల్ మాలిక్ బిన్ మర్వాన్ నిర్ణయం తీసుకుని, అందుకొరకు తన సైన్యాధిపతి హజ్జాజ్ బిన్ యూసుఫ్ సఖఫీను ఎన్నుకున్నాడు. అతడు హిజ్రీ శకం 72లో భారీ సైన్యంతో మక్కాను చుట్టుముట్టాడు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) వారు ధైర్యంగా పోరాడి ఉమయ్యద్ బలగాలను 6 నెలలపాటు దూరంగా ఉంచారు.

అయితే హుజ్జాజ్ మక్కాలోకి ఆహారధాన్యాలు రాకుండా కట్టడి చేశాడు. కాబా మస్జిద్ యొక్క పవిత్రతను కూడా దృష్టిలో పెట్టు కోకుండా రాళ్ళు విసిరింపజేశాడు. అయినా ఎటువంటి భయం లేకుండా అబ్దుల్లాహ్(రజి)వారు కాబాలో సలాత్ చేస్తుండేవారు.

ఈ వీరుడి గురించి ఎంతో చెప్పవలసి ఉంది. కాని ఈ వ్యాసంలో కాకుండా మరో ప్రత్యేక వ్యాసంలో తెలియజేస్తాం, ఇన్షా అల్లాహ్!

సరిగ్గా ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ తన తల్లిని చూడటానికి వెళ్ళారు. మాతృమూర్తి జబ్బుపడ్డానని ఆయనతో చెప్పినప్పుడు, **మనుషులు శాంతిని మరియు విశ్రాంతిని మరణం తరువాత పొందగలరు** అని ఆయన సమాధానమిచ్చారు. ఆమె చిరునవ్వుతో అతనిని అడిగారు, తన మరణాన్ని కోరుతున్నాడా అని.

ఆమె అన్నారు తన కుమారుడు జీవించాలని మరియు తానూ స్వయంగా జీవించాలని కోరుకుంటున్నానని. ఎందుకంటే అతని పోరాట ఫలితాన్ని ఆమె చూడాలని అనుకుంటున్నారు.

అతడు గనుక షహీద్ అయితే ఆమె సహనంతో మరియు స్థైర్యంతో దానిని స్వీకరిస్తారు మరియు అతడు శత్రువును ఈ యుద్ధంలో జయిస్తే, ఆమె సంతోషిస్తారు.

అన్ని ముఖ్య విషయాలలో అబ్దుల్లాహ్(రజి)వారు తన మాతృమూర్తినే సలహా అడిగేవారు.

## తల్లీ కుమారుల అపూర్వ సంభాషణ

అసాధ్యమైన యుద్ధం మక్కాలో జరుగుతుంది మరియు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) సైన్యం పరాజయం దిశలో ఉంది. ఆయన తన తల్లిని చూడాలనుకున్నారు. ఆ సమయంలో ఆమె మస్జిద్ దగ్గర ఉన్నారు. ఆమెను అడిగారు:

**"అమ్మా! నా స్నేహితులు నన్ను వంచించారు. ఇప్పుడు కొద్ది మందే నాతో మిగిలి ఉన్నారు. నేను లొంగిపోతే నా సహచరులను మరియు నన్ను వదిలేసే అవకాశం ఉంది! నీ అభిప్రాయం ఏమిటమ్మా?"**

"నా కుమారా! నీవు ఇహలోక ప్రయోజనం కోసం యుద్ధం చేస్తే, నీవు నిశ్చయంగా అందరికంటే చెడ్డవాడివి అవుతావు. మరియు నీ పరలోకాన్ని నష్టపోతావు ఇతరుల జీవితాలను నష్టపెట్టి. మరియు నీవు సన్మార్గంలో ఉంటే అవమానాన్ని స్వీకరించకు మరియు నీ జీవితాన్ని త్యాగం చేయి అల్లాహ్ పేరుతో మరియు షహీద్ గౌరవాన్ని పొందు."

"నా ప్రియ మాతృమూర్తీ! నేను సత్యం కోసం పోరాడాను మరియు నా సహచరులను సత్యం కోసం పోరాడేలా చేశాను. ఇప్పుడు నేను నిన్ను విడిచి వెళుతున్నాను."

"నా కుమారా! గౌరవనీయులు మరియు నిజమైన ముస్లిములు, కేవలం కొందరు సహచరులు వంచించిన కారణంగా శత్రువులకు భయపడటం సరికాదు. నీవు సన్మార్గంలో ఉంటే, నీ బాధ్యతను దానికి అనుగుణంగా నిర్వర్తించు."

**"ఓ నా మాతృమూర్తీ! నేను చావుకు భయపడలేదు. నేను భయపడేది కేవలం నా మరణం తరువాత, వారు నా శరీరాన్ని ఛిద్రం చేస్తారని. అది నిన్ను బాధపెడుతుందని."**

"ఓ నా కుమారా! ఒక మేక వధించబడిన తరువాత, దాని చర్మం ఒలచ బడుతుందా, ముక్కలుగా కోయబడుతుందా అనేది అప్రస్తుతం. నీవు అల్లాహ్‌పై భరోసా ఉంచి నీ బాధ్యతను నిర్వర్తించు. కత్తి కింద చావడం మేలు దుర్మార్గుల బానిసత్వాన్ని స్వీకరించడం కంటే. ఎన్నటికీ మరణానికి భయపడకు మరియు ఎన్నటికీ అవమానాన్ని స్వీకరించకు."

**మాతృమూర్తి నుండి ఆ మాటలు వినగానే కుమారుని కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. ఆయన బావోద్రేకానికి లోనయ్యారు. తన తల్లి నుదుటను ముద్దాడారు.**

**తరువాత చెప్పారు "ఓ నా ప్రియ మాతృమూర్తీ! నా ఉద్దేశ్యమూ ధైర్యంతో పోరాడి అల్లాహ్ మార్గంలో జీవితాన్ని త్యాగం చేయాలనే. కాని నిన్ను సంప్రదించడం నా బాధ్యతగా భావించాను. ఆ విధంగా నా మరణం వలన కలిగే బాధను నీవు తట్టుకో గలుగుతావని. అల్లాహ్ కారుణ్యంతో నా కంటే నీవు స్థిరంగా ఉన్నావని తెలుసు కున్నాను. అల్లాహ్ పట్ల నీ విశ్వాసం చెక్కుచెదరినిది. నీవు నా విశ్వాసాన్ని కూడా మరింత దృఢపరిచావు. ఈ రోజు నా జీవితాన్ని అల్లాహ్ మార్గంలో త్యాగం చేస్తాను మరియు నేను అనుకుంటున్నాను నేను షహీద్ అయిన తరువాత సహనం కలిగి ఉంటావని."**

"అల్లాహ్ పేరుమీదుగా నేను ప్రకటిస్తున్నాను, ఇంత వరకూ నేను ఏదైతే చేశానో (అది) అల్లాహుతాలా కోసమే. నేను చెడుపనులను ఇష్టపడలేదు. నేను ఏ ముస్లిమ్‌కీ అన్యాయం చేయలేదు. నా ఖలీఫత్‌లో నా శక్తిమేర నాతో రక్షణ ఒప్పందంలో ఉన్న వారెవరికీ వాగ్దాన భంగం చేయలేదు. ఎల్లప్పుడూ నేను అల్లాహ్‌కు లెక్క చెప్పవలసి ఉందని తలచేవాడిని. నేను ప్రజలను చెడునుండి నిరోధించాను మరియు వారికి సన్మార్గాన్ని బోధించాను. **అల్లాహ్ సాక్షి! ఇస్లామే నాకు సమస్తం.** మరియు ఈ లోకం నాకు ఏమీ కాదు. నేను నా హృదయంలో దేనినీ నాదిగా భావించ లేదు. అల్లాహ్‌ను సంతోషింపజేయడం తప్ప."

ఆకాశాల వైపు తిరిగి, **"నా ప్రభూ! నేను ఇది చెప్పింది నా తల్లిని ఓదార్చడానికేగాని గర్వంతో కాదు."**

అస్మా(రజి)వారు శ్రేష్ఠుడైన తన కుమారుడిని ఆశీర్వదించి అన్నారు, "నా కుమారా! అల్లాహ్ కొరకు నీ జీవితాన్ని త్యాగం చెయ్యి. అల్లాహ్ కారుణ్యంచే నీవు నన్ను ప్రశాంతత పొందిన దానిగా మరియు సహనవతిగా తెలుసుకుంటావు. ఇప్పుడు నా దగ్గరకు రా, నా చివరి ప్రేమను మరియు వీడ్కోలును వ్యక్తం చేయడానికి."

అబ్దుల్లాహ్(రజి)వారు ముందుకు వచ్చారు. **ఆ మాతృమూర్తి కుమారుడిని కౌగలించుకుని అతని నుదుటిని ముద్దాడారు.** ఆ సమయంలో ఆయన కవచం ధరించి ఉన్నారు. ఆ మాతృమూర్తి దానిని స్పర్శించినప్పుడు అడిగారు, ఈ గట్టి వస్తువేమిటి?

ఆయన చెప్పారు, **ఇది శత్రువుల దాడి నుండి రక్షణ కొరకు కవచం.**

"ఓ నా కుమారా! నీవు అల్లాహ్ మార్గంలో నీ జీవితాన్ని త్యాగం చేయడానికి వెళ్ళేటప్పుడు, ఈ తాత్కాలిక రక్షణ అవసరం నీకెందుకు?

అబ్దుల్లాహ్ వెంటనే కవచాన్ని తీసి దానిని దూరంగా విసిరేశారు. ఆయన తెల్లటి వస్త్రాన్ని తన తలకు కట్టుకుని తన తల్లితో అన్నారు, "నా ప్రియ మాతృమూర్తీ! నేనిప్పుడు సాధారణ వస్త్రాన్నే ధరించాను."

అదృష్టవంతురాలైన ఆ మాతృమూర్తి సమాధానం ఇచ్చారు, "నేను ఇప్పుడు సంతోషంగా ఉన్నాను. వెళ్ళు మరియు అల్లాహ్ కోసం పోరాడు మరియు ఆయన ముందు ఈ దుస్తులతో కనిపించు."

కాబట్టి ఆయన యుద్ధరంగానికి రెట్టించిన ఉత్సాహంతో వెళ్ళి వరుసలను దాటుకుంటూ ధైర్యంగా పోరాడారు. కాని వారి సంఖ్య తక్కువ అయిపోయింది. **ఆయన షహీద్ అయ్యారు.**

ఈ వీరుడి సమయస్ఫూర్తి, యుద్ధకౌశల్యం, ధైర్యం, ఆరాధన గురించి తెలుసుకుంటే ఎవరైనా ఉత్తేజితులౌతారు. ఇక్కడ ఆ విషయాలన్నీ ఇవ్వడం లేదు.

క్రూరుడైన హజ్జాజ్ బిన్ యూసుఫ్ అబ్దుల్లాహ్(రజి)వారి శరీరాన్ని ఆయన తల్లిగారికి అప్పగించకుండా వ్రేలాడదీశాడు. ఎందుకు వేలాడదీశాడని అడిగితే, అందరూ అది చూసి గుణపాఠం నేర్చుకోవాలనే ఆ విధంగా వ్రేలాడదీశానని చెప్పాడు.

రెండవ రోజు ఇబ్నె ఉమర్(రజి) హజాన్ ప్రాంతం నుండి వెళుతూ ఇబ్నె జుబైర్(రజి)వారి శరీరం వ్రేలాడబడటం చూసి నిశ్చేష్టుడయ్యారు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) వారి శరీరం దగ్గరికెళ్ళి, దు:ఖంతో స్వరం వణుకుతుండగా అన్నారు, **"అస్సలాము అలైకుమ్ ఓ అబూ ఖుబైబ్, అస్సలాము అలైకుమ్ ఓ అబూ ఖుబైబ్"**

తరువాత ఆ శరీరాన్ని చూస్తూ ఆయన అన్నారు తాను 'అబ్దుల్లాహ్' (రజి)ని హెచ్చరించానని అధికారం కోసం జరిగే పోరాటంలో చిక్కుకోవద్దని. మిక్కిలి గౌరవనీయులు తరచుగా వారి ప్రతిష్ఠను కోల్పోతారు అధికార పోరాటంలో. తరువాత ఆయన అల్లాహ్‌ను ప్రార్థించారు తన కారుణ్య స్వర్గంలో ఆయనకి స్థానం ఇవ్వమని.

కుమారుడి శరీరం వ్రేలాడదీయబడింది అని తెలిసి, ఆమె పవిత్రమైన మస్‌జిద్ హరమ్‌కి వెళ్ళారు. ముసల్లా దగ్గర హజ్జాజ్ బిన్ యూసుఫ్ ప్రసంగిస్తున్నాడు. అంతటి మిక్కిలి వృద్ధాప్యంలో సైతం ఆమె ఆత్మ నిబ్బరం కోల్పోలేదు. ఆమె ధైర్యంగా వెళ్ళి అతని ప్రక్కన నిలుచున్నారు. అతడు ఆమెను చూడగానే ఆమె కుమారుడు అవిశ్వాసాన్ని మరియు నాస్తికత్వాన్ని అల్లాహ్ గృహంలో వ్యాపింప జేశాడని అన్నాడు మరియు ఆయనకి ఇతడు ఘోరమైన శిక్ష వేసినట్లు చెప్పాడు.

అస్మా(రజి) వెంటనే సమాధానమిచ్చారు, తన కుమారుడు ఎన్నడూ నాస్తికుడు కాడని ఆయన ధర్మపరాయణుడని, జ్ఞాని మరియు ఎల్లప్పుడు అల్లాహ్‌ను ప్రార్థించేవాడని, ముస్లిమ్ ఉమ్మత్ యొక్క సంక్షేమం కోసం పనిచేశాడని మరియు పరిపూర్ణతకి మరియు నిజాయితీకి ధ్వజాన్ని ఎత్తుకున్న సైనికుడని. "ఇక నీవు ఒక అబద్ధాలకోరువి, ఓ మునాఫిక్‌వి మరియు ఒక విశ్వాసఘాతకుడివి." అల్లాహ్ ఆగ్రహానికి భయపడమని హెచ్చరించారు ఆమె.

ఆమె చెబుతున్న విషయాలు విననట్లు నటిస్తూ హజ్జాజ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ చెప్పాడు,

"నేను ఒప్పుకుంటున్నాను అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ ఈ ఉమ్మత్ ఉత్తమ సభ్యుడని, కాని అతనికి అధికారం కోసం తీవ్ర కోరిక ఉంది. అందుకే ఆయన ప్రజల మధ్య బేధాలను కల్పించాడు మరియు అల్లాహ్ గృహంలోనే సమస్యలకు కారణమయ్యాడు. మీకు తెలుసు ఆదమ్(అ) చాలా గొప్పవారు మరియు చాలా ఎక్కువ గౌరవాన్ని అల్లాహ్ ప్రవక్తగా పొందారు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) కంటే. అల్లాహ్ ఆయనకి (ఆదమ్‌కి) ప్రశాంతమైన మరియు శాంతియుత జీవితాన్ని స్వర్గంలో ఇచ్చారు. కాని ఆయన అల్లాహ్ ఆదేశానికి అవిధేయత చూపి మరియు నిషేధించబడిన చెట్టు ఫలాన్ని తిన్నారు. ఆయన స్వర్గం నుండి విసిరి వేయబడ్డారు. నిస్సందేహంగా స్వర్గమే ఉత్తమ స్థలం పవిత్ర కాబా కంటే."

(**పాఠకులు గమనించాలి :** ఆదమ్(అ)వారు అల్లాహ్‌కు ఎన్నడూ అవిధేయత చూపలేదు. ఈ విషయాలు ఇంతకు పూర్వం శాంతిబాటలో వివరించ బడ్డాయి. హుజ్జాజ్ మునాఫిక్ గనుక ఆ విధంగా మాట్లాడాడు.)

తరువాత అసాధారణమైన స్వరంలో అతడు ప్రజలతో లేచి సలాత్‌కు సిద్ధం కమ్మని చెప్పాడు. ఆ సమయంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వారు అక్కడే ఉన్నారు. మరియు ఆయన పెద్ద స్వరంతో అన్నారు:

**"ఓ హజ్జాజ్! నేను నిన్ను ఓ మునాఫిక్‌వని మరియు ఓ అబద్ధాల కోరువని అంటే, అది వాస్తవ విరుద్ధం కాదు. నేను ప్రమాణం చేస్తున్నాను అల్లాహ్ యొక్క సార్వభౌమాధికారం మరియు ఆగ్రహం సాక్షి! అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ తన పూర్తి జీవితకాలంలో ఎన్నడూ అల్లాహ్ ఆదేశాలకు విరుద్ధంగా అడుగు వేయలేదు. నేను ఇప్పుడు బహిరంగంగా సాక్ష్యమిస్తున్నాను అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) తఖ్వా కలిగిన వ్యక్తి అని. ఉపవాసాలుంటూ రాత్రులు ప్రార్థనలలో గడిపేవాడని. ఆయన ఎల్లప్పుడూ ఏదైతే ధర్మమో దానివైపే ఉన్నాడు మరియు దానివైపే ఉన్నాడు."**

మరియు మూడురోజుల తరువాత కూడా శరీరాన్ని దింపలేదు. మూడవరోజు వృద్ధురాలైన ఆ మాతృమూర్తి పరాక్రమశాలి మరియు శ్రేష్టుడైన తన కుమారుని శరీరాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. దాదాపు 100 సంవత్సరాల వయస్సు, వృద్ధాప్యం వలన ఆమెకు చూపు సరిగ్గా కనిపించడం లేదు. నిట్టూరుస్తూ ఆమె అడిగారు ఇంకా సమయం రాలేదా తన కుమారుడిని గుర్రంపై నుండి దింపడానికి అని. ఆమె ఈ ఘోర హింసని సహజ బలంతో మరియు స్థైర్యంతో ఎదుర్కొన్నారు.

ఆ మాతృమూర్తి తన కుమారుడి శరీరం దగ్గర నిలుచోవడాన్ని చూసిన హజ్జాజ్, ఒక వార్తాహరుణ్ణి ఆమె దగ్గరికి పంపాడు తన దగ్గరికి ఆమెను తీసుకురమ్మని. తన కుమారుడిని హత్య చేసినవానిని చూడటానికి రానని ఆమె ద్వేషంతో తిరస్కరిస్తూ సమాధానమిచ్చారు.

హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఈ సమాధానం తెలుసుకోగానే ఉద్రేకంతో ఊగిపోయాడు మరియు తన వార్తాహరుడిని ఆమె దగ్గరకెళ్ళి ఆమె స్వయంగా రాకపోతే ఆమె జుట్టుపట్టుకుని తన దగ్గరికి ఈడ్చ బడుతుందని చెప్పమన్నాడు.

అయినా సరే ఆమె అత్యంత నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చారు, ఆ నీచమైన అగౌరనీయుడైన మనిషిని చూడనని చెప్పారు. అదే ఆమె చివరి నిర్ణయం. మరియు వాడు తాను అనుకున్నది ఏదీ చేయలేకపోయాడు. తన హెచ్చరికలకు ఫలితం లేకపోవడంతో, వాడే ఆమె దగ్గరకు వెళ్ళి అడిగాడు ఆమె కుమారుడిని వాడు ఏమి చేశాడో చూసారా అని.

ఆమె అన్నారు, **అతడు తన కుమారుడి ఇహలోక జీవితం నాశనం చేస్తే, తన కుమారుడు అతని పరలోక జీవితాన్ని నాశనం చేశాడని.**

అంతేకాకుండా ప్రవక్త(స)వారి దగ్గర విన్న ఓ విషయాన్ని కూడా ఆమె చెప్పారు. బనూ సఖీఫ్ తెగలో ఒకడు కనిపిస్తాడు, వాడు అబద్ధాలకోరు మరియు దుర్మార్గుడు మరియు అగౌరవనీయుడైన క్రూరుడు. వాడు ముఖ్తార్ బిన్ అబూ ఉబైద్. చూశాను. రెండవ క్రూరుడివి నువ్వు. ఈ రోజు స్వయంగా  చూస్తున్నానని చెప్పారామె. హజ్జాజ్ బిన్ యూసుఫ్ నిశ్శబ్దంగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

**హజ్జాజ్ వంటి మునాఫిక్ అబ్దుల్లాహ్(రజి)వారిపై ఘోరమైన నిందలు వేశాడు. కాబట్టి ఇక్కడ అబ్దుల్లాహ్(రజి)వారి గురించి కొన్ని విషయాలు జ్ఞాపకం చేయడం మా బాధ్యతగా భావిస్తున్నాము.**

- అబ్దుల్లాహ్(రజి) అంటే విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారికి ఎంతో ఇష్టం. ముహమ్మద్(స)వారి సలహామేరకు ఈ అబ్బాయి పేరుతో ఆమె 'ఉమ్మె అబ్దుల్లాహ్' అని కున్యా కూడా పెట్టుకున్నారు అంటే అబ్దుల్లాహ్ తల్లి అని అర్థం. వాస్తవానికి అబ్దుల్లాహ్ తన అక్క కుమారుడు అయినప్పటికీ 'ఉమ్మె అబ్దుల్లాహ్' అయ్యారు.
- అబ్దుల్లాహ్ మరణించలేదనే శుభవార్తను తీసుకువచ్చిన వ్యక్తికి ఆయిషా(రజి) వారు 10 వేల దిర్హములు ఇచ్చి, కృతజ్ఞతతో అల్లాహ్‌కు సజ్దా చేశారు. అబ్దుల్లాహ్(రజి) అంటే ఎంతటి ప్రేమ ఉందో ఈ సంఘటన ద్వారా అర్థమౌతుంది.
- అబ్దుల్లాహ్(రజి)వారి తమ్ముడైన ఉర్వా(రజి)వారి ఉల్లేఖనాన్ని బట్టి ముహమ్మద్(స) మరియు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారి తరువాత అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)వారిని ప్రేమించినంతగా ఆయిషా(రజి) మరెవరినీ ప్రేమించలేదు. తన తండ్రి మరియు ఆయిషా(రజి)వారు అబ్దుల్లాహ్(రజి) కొరకు అల్లాహ్‌ను వేడుకున్న విధంగా మరొకరి కోసం వేడుకోలేదని ఉర్వా జ్ఞాపకం చేశారు.
- ఉమర్ బిన్ దీనార్ చెబుతుండేవారు : **నేనెన్నడూ ఏ ఆరాధకుడిని చూడలేదు అతని ప్రార్థన అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ కంటే ఉన్నతంగా.**
- ఎప్పుడైనా ఇబ్నె జుబైర్ ప్రార్థనలో నిలుచుంటే, ఆయన ఓ స్తంభంలా ఉండేవారని మరియు ప్రార్థనలో ఆయన కుండే అణుకువ వలన అని ముజాహిద్‌గారు చెప్పారు.
- ఆయన మాతృమూర్తి చెప్పారు, **ఇబ్నె జుబైర్ రాత్రుళ్ళు ప్రార్థనలో గడిపేవారు మరియు ఉపవాసం ఉండేవారు పగటి వేళల్లో. మరియు అతడు <u>హమామతుల్-మస్జిద్</u>గా తెలుసు.**

హమామతుల్ మస్జిద్ అంటే **మస్జిద్ పావురం.** ఏవిధంగా పావురం ఎల్లప్పుడు తన గూటికి చేరుకుంటుందో అదే విధంగా ఆయన మస్జిద్‌కు చేరుకుంటారని.

అన్నగారు అబ్దుల్లాహ్(రజి)గారికి తోడుగా యుద్ధం చేసిన ఉర్వా(రజి), అన్నయ్య షహీద్ అయిన తరువాత మక్కా నుండి నిశ్శబ్దంగా డమాస్కస్ వెళ్ళి ఖలీఫా అబ్దుల్ మాలిక్ బిన్ మర్వాన్‌ను కలిసారు. ఖలీఫా ఈయనను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఆయనకు జరిగిన విషయాలు చెప్పి, తన అన్నగారి శరీరాన్ని తల్లిగారికి ఇప్పించమని చెప్పారు.

అతడు జరిగింది విని నిశ్చేష్టుడు అయ్యాడు. చాలా తీవ్రంగా ఒక లేఖను హజ్జాజ్‌కు వ్రాసి, అతడు చేసిన దానిని ఖండిస్తూ వెంటనే అబ్దుల్లాహ్ గారి శరీరాన్ని అస్మా(రజి)వారికి అంద జేయాలని ఆదేశించాడు. హజ్జాజ్ అబ్దుల్లాహ్(రజి)వారి శరీరాన్ని అస్మా(రజి)వారికి అప్పగించాడు.

**తన ప్రియకుమారుని శరీరానికి గుస్ల్ చేయించమని ఇబ్నె అబూ మలీకహ్‌ను అడిగారు. ఆయన అన్ని భాగాలను కడిగి మరియు వాటిని కఫన్‌లో ఉంచారు. అస్మా(రజి)వారు అల్లాహ్‌ను ప్రార్థించారు. హజూన్ ప్రాంతంలో ఆయన(రజి) సమాధి గావించ బడ్డారు.**

హజ్జాజ్ బిన్ యూసుఫ్ సిరియా న్యాయస్థానం నుండి ఆదేశం అందుకున్నాడు. అతడు వ్యక్తిగతంగా అస్మా(రజి)వారిని దర్శించి, ఏదైనా ఆమె మనవిగాని లేదా ఆమెకు ఏదైనా అవసరమో అడగమని ఆదేశించ బడ్డాడు.

హజ్జాజ్ ఆమె ఇంటికి వెళ్ళాడు గవర్నర్ పంపిన సందేశాన్ని ఆమెకు చేరవేయడానికి. అస్మా(రజి) చాలా ఉద్రేకపడ్డారు.

ఆమె వాడితో అసాధారణమైన స్వరంలో చెప్పారు, ఆమెకు ఏదీ అవసరం లేదని మరియు అతడిపై అరిచారు తన ఇంటి నుండి బయటికి పొమ్మని. ఆమె అన్నారు అతని ఆఫర్‌ని అతని ముఖంపైనే తృణీకరించానని. ఆమె అడిగారు సిగ్గులేని దుర్మార్గుడు తన గాయాలను గిల్లడానికి వచ్చాడా అని. ఆమె అన్నారు ఈ భూమికి అతడు భారమని మరియు ఆమె వాడిని ఒక దురదృష్టమైన మరియు అధర్మ పరాయణుడిగా పరిగణించారు.

## ఆమె ఆరాధన

అస్మా(రజి) పూర్తి ఏకాగ్రతతో ప్రార్థించేవారు. ఆమె భర్త జుబైర్ బిన్ అవ్వామ్(రజి) చెప్పిన దానిని బట్టి. ఒకరోజు ఆయన ఇంటికి వచ్చినప్పుడు **ఆమె ప్రార్థన చేస్తూ రోదిస్తున్నారు.** ఆమె ఖుర్‌ఆన్ నుండి అదే ఆయత్ మరలా మరలా చదువుతున్నారు.

**"కావున నిశ్చయంగా, అల్లాహ్ మనమీద కనికరం చూపాడు మరియు మమ్ము దహించే గాలుల శిక్ష నుండి కాపాడాడు"**
(ఖుర్‌ఆన్ 52:27)

అది చూసిన తరువాత, ఆయన బజారుకి వెళ్ళి చాలా ఆలస్యంగా తిరిగి ఇంటికి వచ్చారు. ఆమె ఇంకనూ ప్రార్థనలోనే ఉన్నారు. అబ్దుల్లాహ్(రజి)వారు కూడా ఆరాధనలో తల్లిని మించిన తనయుడనే

చెప్పాలి. ఆయన ఏకాగ్రతలో సలాత్ చేస్తుంటే, పక్షులకు ఆయనకు ఒక శిలగా అనిపించేవారు. ఆయన రుకూ, సజ్దాలు చేసినప్పుడు పావురాలు ఆయనపై వాలేవి.

---

అస్మా(రజి)వారిది చురుకైన జ్ఞాపకశక్తి. ఆమె ఒక్కసారి ఏదైనా వింటే దానిని మరచిపోయేవారు కాదు. ఆయిషా, ఉమ్మె సలమహ్ మరియు అస్మా బిన్త్ యజీద్(రజి) వారి వలే చాలా హదీస్‌లను ఆమె ద్వారా మనకు అందాయి. 56 హదీస్‌లు అస్మా(రజి)వారి ద్వారా అందినట్లు చెప్పబడింది.

“ఓ అల్లాహ్! నన్ను సజీవంగా ఉంచు నా కుమారుడు అబ్దుల్లాహ్ జనాజాను నిర్వర్తించడానికి.” అని ప్రార్థించేవారు. అల్లాహ్ ఆమె దు'ఆను స్వీకరించారు.

తన ప్రియకుమారుడిని సమాధిగావించిన దాదాపు 100 రోజులకు అస్మా బిన్త్ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) హిజ్రీ శకం 73లో తన జీవిత ఘట్టాలను విశ్వాసుల హృదయాలలో శాశ్వతంగా లిఖించి ఈ లోకాన్ని వీడారు.

దాదాపు 100 సంవత్సరాలు జీవించారు. కాని ఆ వయస్సులో కూడా ఆమె పూర్తి పలువరుస కలిగి ఉన్నారు. ఏ దంతమూ ఊడిపోలేదు. మరియు ఆమె జ్ఞాపక శక్తి కూడా అలాగే ఉండింది.

**గొప్పవ్యక్తిత్వంగల తండ్రి పాలనలో ఐశ్వర్యంలోనే పెరిగారు. ఐశ్వర్యంలో ఉన్నప్పుడు, అది లేనప్పుడూ ఒకే విధంగా జీవించారు. భర్తను గౌరవించారు, ప్రేమించారు మరియు ప్రశంసించేవారు. భర్త ఆత్మాభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని మెలిగేవారు. గొప్ప ఔదార్యంతో విరివిగా దానాలు చేసేవారు. చేసే ప్రతీ పని ధర్మ సమ్మతం అవునో, కాదో తెలుసుకుని చేసేవారు. ఆనాడు యువతిగా ఉన్నప్పుడు అబూజహ్ల్ చెంపపై కొట్టి అవమానించాడు. సహనంతో భరించారుగాని భయపడలేదు. 100 సంవత్సరాల వయస్సులో ఆమెను అవమానించాలనుకున్న హజ్జాజ్ వంటి క్రూరుడి ఎదుట ధైర్యంగా నిలుచుని మాట్లాడారు. ఆమె భర్త ధైర్యవంతుడు, పరాక్రమశాలి. మరియు ఆమె కుమారుడూ అంతే. ఇక ఆమె తండ్రి గురించి చెప్పనవసరం లేదు. ముహమ్మద్(స) వారి ప్రాణ స్నేహితుడు మరియు తొలి ఖలీఫా. ఆమె చెల్లెలు విశ్వాసుల మాతృమూర్తి.**

అరేబియాలో ఇస్లామ్ ప్రారంభం నుండి దాదాపు 86 సంవత్సరాల చరిత్రకు సాక్షి ఆమె. 100 సం॥ల వృద్ధాప్యంలో కుమారుడిని అల్లాహ్ మార్గంలో ప్రాణ త్యాగానికి సిద్ధం కమ్మని బోధించారు. ఆ వయస్సులో తన ప్రియకుమారుడి మరణాన్ని తట్టుకుని జనాజా జరిపించిన ఈమె మనోనిబ్బరం, విశ్వాసులకు కన్నీళ్ళు తెప్పిస్తుంది. వారి విశ్వాసాన్ని మరింత ధృడంగా చేస్తుంది.

హజ్జాజ్ బిన్ యూసుఫ్ వంటి మునాఫిక్‌లు నేటి మన సమాజంలో కూడా ఎందరో ఉన్నారు. ఆ క్రూరుడు కాబా మస్జిద్‌లో ప్రసంగించాడు. నేడు కూడా అటువంటి వారు మస్జిద్‌లలో ప్రసంగిస్తున్నారు. ఇటువంటి మునాఫిక్‌లను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి), అస్మా(రజి)వారు ఎలా నిలదీసారో, ఆ విధంగా నిలదీయాలి.

తల్లి ధర్మపరాయణురాలైతే, సంతానం ఎంత ఉత్తమంగా ఉంటుందో చెప్పడానికి ఈ తల్లీకొడుకులు ఓ వాస్తవ ఉదాహరణ.

**కలిమా చదివేసి ముస్లిముగా మారిపోయామని, షిర్క్ మానివేసామని అనుకుంటే సరిపోదు. హృదయం లోపల నిజమైన విశ్వాసం లేకపోతే సాఫల్యం లేదు. ఖుర్'ఆన్ ప్రకారం ఆచరణ ఉండాలి. ముహమ్మద్(స) వారి బోధనలకు తగిన విధంగా ఆచరణ ఉండాలి.**

**ఎవరి కుమార్తెయైనా ఇస్లామ్ స్వీకరించి ఉండవచ్చు ...**

**ఎవరి భార్యయైనా ఇస్లామ్ స్వీకరించి ఉండవచ్చు ...**

**ఎవరి మాతృమూర్తియైనా ఇస్లామ్ స్వీకరించి ఉండవచ్చు ...**

అటువంటి వారికి అస్మా(రజి)వారి జీవితంలో ఎదురైనటువంటి పరిస్థితులు ఎదురుకావచ్చు. అటువంటివారికి ఈమె జీవితం పరిష్కారం కాగలదు, ఇన్షా అల్లాహ్. **ఈమె ఉత్తమ కుమార్తె, ఉత్తమ భార్య, ఉత్తమ మాతృమూర్తికి ఒక ఉదాహరణ.**

తిరిగి గూటికి శీర్షికలో అందించేవి కథలు కాదు. వాస్తవాలు. వాటికి ప్రామాణిక ఆధారాలున్నాయి.

ముహమ్మద్(స)వారి అనుచరుల జీవితాలు మన విశ్వాస స్థాయిని తెలిపే గీటురాళ్ళు. అంతేకాదు ఇస్లామ్‌ని ప్రాక్టికల్‌గా అర్థం చేసుకోవడానికి వీరి జీవిత చరిత్రలు ఎంతగానో ఉపయోగ పడతాయి. **ముహమ్మద్(స)వారి అనుచరులలో ఒక్కొక్కరు ఒక్కొక్క ధార్మిక అంశానికి** స్పెషలిస్టులుగా మనకు కనిపిస్తారు.

మనం నివశిస్తున్న ఈ కాలంలో ఇహలోక ప్రశాంతత సాధించడానికి మరియు పరలోక సాఫల్యం కొరకు, వీరి జీవితాలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. వారు చేసిన పనులను విశ్లేషించి ఆలోచించుకోవాలి.

**సహాబాలపై ఒక ప్రత్యేక పుస్తకం**

**పాఠకుల కోరిక మేరకు సహాబాల జీవితచరిత్రలను ఒక పుస్తక రూపంలో ప్రచురించడానికి ప్రయత్నం చేస్తున్నాము. ముద్రణ ప్రారంభం కాగానే ఇన్షా అల్లాహ్ శాంతిబాటలో ప్రకటిస్తాము.**

Science of Hadith

# హదీస్ విజ్ఞానం

( గత సంచిక తరువాయి )

14

## ముస్లిమ్ (ర)

**(అబుల్ హుసైన్ ముస్లిమ్ బిన్ అల్-హజ్జాజ్)**

(204 - 261 హి.)

### పరిచయం

ఈ శీర్షిక ప్రారంభంలో హదీస్‌ల యొక్క వివిధ వర్గీకరణలు ఉదాహరణ పూర్వకంగా వివరించిన తరువాత, హదీస్ విద్వాంసుల నాయకుడిగా ప్రశంసలందుకున్న ఇమామ్ బుఖారీ(ర)వారి జీవిత చరిత్ర అందించడం జరిగింది. హదీస్ విజ్ఞానం యొక్క గొప్పదనాన్ని తెలియ జేయడానికి మాత్రమే కాకుండా, ఏ రంగంలోనైనా అత్యున్నత స్థాయిలో పరిశోధించే ప్రతీ పరిశోధకుడికి స్ఫూర్తిగా ఈయన జీవితంలోని ముఖ్య సంఘటనలు తెలియజేయడం జరిగింది. హదీస్ విద్వాంసుడు కావడానికి అవసరమైన 4 విషయాల సముదాయాల గురించి క్రిందటి సంచికలో వివరించడం జరిగింది.

**ఈయన అడుగుజాడలలో హదీస్ విజ్ఞానానికి సేవ చేసిన ఎందరో శాస్త్రవేత్తలున్నారు. వీరందరి గురించి క్లుప్తంగా తెలియజేయాలని అల్లాహ్ పేరుతో సంకల్పించుకున్నాము. దీని ద్వారా వారి గురించి తెలియ పరచడమే కాకుండా సగటు ముస్లిమ్‌కి హదీస్ విజ్ఞానంపై స్పష్టమైన అవగాహన ఇన్షా అల్లాహ్ కలుగుతుంది.**

ఈ నెల నుండి సహీహ్ హదీస్‌లను గ్రంథస్థం చేసిన మరొక ముహద్దిస్ **ముస్లిమ్**(ర)వారి జీవితచరిత్రను ప్రారంభిస్తున్నాము.

ముస్లిమ్(ర)వారి పూర్తి పేరు: **అబుల్ హుసైన్ ముస్లిమ్ బిన్ అల్-హజ్జాజ్.** ఇతని తండ్రిగారు కూడా విద్వాంసులే. ఈయన తల్లిదండ్రులకు సంబంధించి మరికాస్త చెప్పడానికి ప్రామాణిక ఆధారాలు మాకు లభ్యం కాలేదు. ముస్లిమ్(ర)వారు జ్ఞానసంపాదన కోసం ఎటువంటి కృషి చేశారో తెలుసుకునే ముందు ఈ హదీస్ విజ్ఞానానికి సంబంధించిన కొన్ని విషయాలు ఇక్కడ ప్రస్తావించ వలసి ఉంది. 'ముహద్దిస్' కావడం సామాన్యమైన విషయం కాదని, క్రిందటి సంచికలో బుఖారీ(ర)వారు అల్-వలీద్ బిన్ ఇబ్రాహీమ్‌గారికి ఇచ్చిన సలహా ద్వారా స్పష్టమైంది. కష్టతరమైన ప్రయాణాలెన్నో చేయాలి మరియు అసాధారణ ప్రతిభ కావాలి.

**జ్ఞాన సముపార్జనకై ప్రయాణాలు**

ఇబ్నె సలాహ్ చెప్పారు : ఎక్కువ ఉల్లేఖకులు కలిగిన ఇస్నాద్ మరియు ముఖ్యమైన ఉల్లేఖనాలను తన పట్టణంలో వినడం పూర్తి అయిన తరువాత, విద్యార్థి (student) తప్పనిసరిగా ఇతర ప్రదేశాలకు ప్రయాణించాలి. హదీస్‌లకు సంబంధించి వాటి ఉల్లేఖకుల పరంపరపై చేసిన అధ్యయనాలలో ఈ ప్రయాణాల యొక్క ప్రభావం చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

ఏదైనా సనద్ తీసుకుని దానిలోని ఉల్లేఖకుల జీవితాల గురించి అధ్యయనం చేస్తే, చాలా వాటిలో వారు ఒకటికంటే ఎక్కువ ప్రాంతాల నుండి వచ్చిన వారేనని తెలుసుకుంటాము. వాస్తవానికి కొన్నిసార్లు వారిలోని ప్రతీ ఒక్కరూ వేరే పట్టణం నుండి వచ్చినవారేనని తెలుసు కుంటాము.

హదీస్ జ్ఞాన సముపార్జనకై చేసే ప్రయాణం అందరినీ కలుపుతుంది. ఎంతవరకూ అంటే ఒకే హదీస్ యొక్క సనద్‌లో వీరందరూ ఉంటారు వారంతా ఒకే కాలానికి చెందినవారు.

ఈ ప్రయాణాల విషయంపై ఎన్నో గొప్ప విషయాలున్నాయి. అవి అన్నీ ఈ శీర్షికలో అందించలేము.

**ఎవరైతే జ్ఞానం కొరకు ఎక్కువగా ప్రయాణిస్తారో, అటువంటివారి దగ్గరికే ప్రజలు కూడా ఎక్కువగా ప్రయాణిస్తారు, అతని దగ్గర నుండి నేర్చుకోవడానికి.**

**ముహద్దిస్‌లు చేసినంత ప్రయాణం మరొకరు చేసి ఉండరేమో!**

- ముహమ్మద్(స)వారి నుండి సహాబీలు (ఆయన అనుచరులు) విన్నారు. వారి నుండి తాబిఈన్‌లు విన్నారు. ముహమ్మద్(స)వారి అనుచరులు ఒక ప్రాంతంలోనే స్థిరపడకుండా, వేర్వేరు బాధ్యతలను నిర్వహిస్తూ ముస్లిమ్ భూభాగంలో వేర్వేరు చోట్ల ఉండవలసి వచ్చింది. కాబట్టి వారి నుండి హదీస్ జ్ఞానాన్ని పొందడానికై వారు నివశించే ప్రాంతాలకి ప్రయాణాలు తప్పనిసరి అయ్యాయి. కేవలం ఒకే ఒక హదీస్ కోసం సుదూర ప్రయాణాలెన్నో చేసేవారు.
- ఒక ముహద్దిస్ తాను కలిగియున్న ఉల్లేఖనాలలోని కొన్నింటిని, ఆయన చేసే ప్రయాణాలలో ఇతరుల ద్వారా వినవచ్చు. తన ఉల్లేఖనాలలో ఉండే మతన్ వంటి దానినే వేరే సనద్‌తో వినడం జరగవచ్చు. **అది తన ఉల్లేఖనాన్ని బలపరుస్తుంది.** ఒకొక్కసారి దయీఫ్ (బలహీనమైన) హదీస్ యొక్క స్థాయి పెరిగి, అది సహీహ్‌గా తెలుసు కోవచ్చు. అంతేకాకుండా తాను సహీహ్‌గా తెలుసుకున్న హదీస్ యొక్క ప్రామాణికత మరింత ఎక్కువ కావచ్చు. ఈ విధంగా అధ్యయనాలు చేయడం ద్వారా హదీస్‌లలోని లోటుపాట్లు తెలియవచ్చు.

కేవలం ఒక హదీస్ యొక్క ప్రామాణికతను తెలుసుకోవడం కోసం అబూ అయ్యూబ్‌గారు మదీనా నుండి ఈజిప్టుకు ప్రయాణించారు. ఆ హదీస్‌ను విన్నవారిలో ఎవరూ జీవించి లేరు, ఒక్క ఉఖ్బా ఆమిర్ గారు తప్ప.

**'ఉలూ : ఒక సనద్‌లో ఉల్లేఖకుల సంఖ్య తక్కువయ్యేకొద్దీ, ఆ హదీస్ యొక్క ఔన్నత్యం పెరుగుతూ ఉంటుంది.** ఒక హదీస్‌ను ఒక ఉల్లేఖకుడు తన గురువుగారి దగ్గరి నుండి విన్నాడు. గురువుగారి దగ్గర నుండి ఆ హదీస్ విన్న తరువాత అతడు మరొకరికి దానిని ఉల్లేఖించారు. ఇక్కడ ముగ్గురు ఉన్నారు - గురువుగారు, శిష్యుడు మరియు మరో వ్యక్తి. హదీస్‌ను విన్న ఆ మూడవ వ్యక్తి అప్పటికి ఇంకా జీవించి ఉన్న గురువు గారి దగ్గరికి వెళ్ళి ఆ హదీస్‌ను తానే స్వయంగా ఆ గురువు నుండి వినడం జరిగితే అప్పుడు సనద్‌లో 'శిష్యుడు' తప్పించబడతాడు. ఈ విధంగా మధ్యవర్తులు తగ్గడం వలన లోటుపాట్లు కూడా తగ్గుతాయి. ఈ విధంగా హదీస్ యొక్క ప్రమాణికతకి బలం చేకూరుతుంది.

అందువల్లనే ముహద్దిస్‌లు ఈ **'ఉలూ**ను సాధించడం కోసం ఎన్నో కష్టతరమైన ప్రయాణాలు చేశారు. తన కాలంలోనే జీవించియున్న ఓ వ్యక్తి సనద్‌లో ఉన్నాడని తెలిసిన వెంటనే, ప్రత్యక్షంగా అతని నుండే ఆ హదీస్‌ను వినడానికి ప్రయాణం మొదలయ్యేది.

హాఫిజ్ అబుల్ ఫ'ల్ అల్-మఖ్దిసీ చెప్పినదానిని బట్టి తక్కువ ఉల్లేఖకులున్న సనద్‌తో ఒక ముహద్దిస్ సంతృప్తి చెందితే ఇక ప్రయాణం చేసేవారు కాదు.

**ఇమామ్ అహమద్ బిన్ హంబల్‌గారు ఉన్నత స్థాయి ఇస్నాద్‌ను పొందడానికై చేసే అన్వేషణను సున్నత్‌గా పేర్కొన్నారు.**

యహ్యా బిన్ మ'ఈన్(ర) జబ్బుపడినప్పుడు, ఆయన అడగబడ్డారు 'మీ కోరిక ఏమిటి?' ఆయన చెప్పారు, **"ఖాళీగా ఉండే ఇల్లు మరియు ఉన్నత స్థాయి ఇస్నాద్."** ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు అడగబడ్డారు, **"ఒకరు ప్రయాణం చేయాలా జ్ఞానాన్ని అన్వేషిస్తూ?"**

ఆయన అన్నారు, **"అవును, అల్లాహ్ సాక్షి, గొప్ప కృషితో."** ఆయన చెప్పారు, **"ఉమర్(రజి)వారి ఓ ఉల్లేఖనాన్ని 'అల్‌ఖమహ్ మరియు అస్వద్ విన్నారు మరియు వారు తృప్తి చెందలేదు, ఉమర్(రజి)వారి దగ్గరికి వెళ్ళి ఆయన నుండి దానిని వినేంతవరకూ."**

అబుల్ 'ఆలియహ్ చెప్పారు, "మేము రసూలుల్లాహ్(స)వారి అనుచరుల యొక్క ఉల్లేఖనాన్ని వినేవారము బస్రాలో ఉండగా మరియు మేము తృప్తి పడేవారము కాదు, మేము మదీనాకు ప్రయాణించి దానిని వారి నోళ్ళ నుండి వినేవరకూ ..."

హదీస్ విద్వాంసులు అతి ముఖ్యంగా ఫోకస్ చేసే విషయం ఒకటుంది. ఆ విషయం క్లుప్తంగా ఈ శీర్షిక ప్రారంభ వ్యాసాలలో చెప్పుకోవడం జరిగింది. అది ఏమిటంటే ఉల్లేఖకుల గురించి తెలుసుకోవడం. ఉల్లేఖకుల స్థాయి గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఏ ఉల్లేఖకుని ఉల్లేఖనం స్వీకరించాలి? ఎవరిది తిరస్కరించాలి?

ఉల్లేఖకుల నిజాయితీ తెలుసుకోవడానికి వారి జ్ఞాపకశక్తిని పరీక్షించడానికి ముహద్దిస్‌లు చాలా కృషి చేశారు. ఈ కృషిలో వారు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. అబద్ధాలు చెప్పే ఉల్లేఖకుల గురించి, బలహీన ఉల్లేఖనాలను అందించే ఉల్లేఖకుల గురించి ఈ ముహద్దిస్‌లు ప్రజలను హెచ్చరించారు.

ఈ హెచ్చరికే గనుక వారు చేసి ఉండకపోతే ఇస్లామ్ మసక బారేటట్లు అస్పష్టత కల్పించబడేదని అనిపిస్తుంది. అయితే ఇస్లామ్‌ను అల్లాహ్ రక్షిస్తున్నారు కాబట్టి, అసత్యాలను నిలదీసి హెచ్చరించేలా విశ్వాసులకు జ్ఞానాన్ని అందించారాయన. విరోధులు మనల్ని కంట్రోల్ చేసి ఉండేవారు మరియు అసత్యవాదులు పెరిగిపోయి ఉండేవారు. ఇప్పటికీ హదీస్‌లను వక్రీకరించాలని ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా సరే, ముహద్దిస్‌లు అందించిన ప్రామాణిక హదీస్‌ల ద్వారా వారికి విశ్వాసులు బుద్ధి చెప్పగలుగుతున్నారు. అల్-హమ్‌దులిల్లాహ్! ఈ ముహద్దిస్‌లపై అల్లాహ్ కారుణ్యం కురిపించు గాక! ఆమీన్!

ఉల్లేఖకులను అన్నివిధాలా పరీక్షించడానికి ఎన్నో సైన్సెస్(sciences) ఉన్నాయి. వీటి మూలాలపై మంచి అవగాహన కలిగి ఉండాలి.

అహమద్ బిన్ మన్‌సూర్ అర్-రమాదీ తెలియజేశారు :

నేను అహమద్(ర) మరియు యహ్యా(ర)తో వారి సేవకుడిగా అబ్దుర్రజ్జాఖ్ గారి దగ్గరికి వెళ్ళాను. ఆయన చెప్పారు : మేము కూఫాకు తిరిగి చేరుకున్నప్పుడు యహ్యా బిన్ మ'ఈన్(ర) అన్నారు, **"నేను అబూ ను'ఐమ్‌ను పరీక్షించదలిచాను."**

అహమద్(ర) అన్నారు, **"అది చెయ్యవద్దు, ఎందుకంటే ఆ వ్యక్తి నమ్మకస్తుడు."**

యహ్యా అన్నారు, "నేను అలా చేస్తాను."

ఆయన ఒక కాగితం తీసుకుని, దానిపై (అబూ ను'ఐమ్‌గారు ఉల్లేఖించిన) 30 హదీస్‌లు వ్రాశారు. ప్రతీ 10 హదీస్‌లకు ప్రారంభంలో ఒక హదీస్‌ను ఉంచారు. ఆ హదీస్ ఆయన ఉల్లేఖించినది కాదు. తరువాత వారు అబూ ను'ఐమ్(ర)వారి వద్దకు వచ్చారు. ఆయన బయటికి వచ్చారు మరియు మట్టి అరుగు మీద కూర్చున్నారు. ఆయన అహ్మద్ బిన్ హంబల్(ర)వారిని తీసుకుని తన కుడివైపు కూర్చోబెట్టుకున్నారు మరియు యహ్యా(ర)వారిని తన ఎడమ వైపు. నేను అరుగు క్రింద కూర్చున్నాను.

యహ్యా(ర) వ్రాతప్రతి తీశారు మరియు ఆయనకు 10 హదీస్‌లు చదివి వినిపించారు. ఆయన 11వ హదీస్ చదివి వినిపించినప్పుడు, అబూ ను'ఐమ్ అన్నారు, "ఇది నా హదీస్‌ల నుండి కాదు. దానిని కొట్టివెయ్యి." తరువాత ఆయన రెండవ సెట్ 10 హదీస్‌లు చదివారు, అంతసేపు అబూ ను'ఐమ్ నిశ్శబ్దంగా ఉన్నారు. ఆయన (యహ్యా) (కలిపిన) రెండవ హదీస్ చదివిన తరువాత అబూ ను'ఐమ్ అన్నారు,

"ఇది నా హదీస్‌ల నుండి కాదు. కొట్టివెయ్యి దానిని."

తరువాత 3వ సెట్ పది చదివారు. తరువాత (కలిపిన) మూడవ హదీస్ చదివారు. అప్పుడు అబూ నుʼఐమ్‌గారి ముఖ కవళికలు మారాయి మరియు అతని కళ్ళు (రంగు) మారాయి. తరువాత ఆయన యహ్యా వైపు తిరిగి అన్నారు 'ఇతని కొరకు' - అహమద్(ర)వారి ముంజేయి ఆయన చేతిలో ఉంది - 'ఈయన చాలా ధర్మపరాయణుడు అటువంటిదే చేయడానికి'

'ఇతని కొరకు' - నన్ను ఉద్దేశించి - 'ఇతడు క్రింద ఈ విధంగా ఏదో చేస్తున్నాడు. అయితే, ఇది నీవు చేస్తున్నది, నీవు బాధ్యత వహించాలి."

ఆయన తన పాదాన్ని వెనక్కి లాగి మరియు యహ్యా(ర)వారిని తన్నారు, అరుగుపై నుండి క్రిందికి పడేలా. తరువాత ఆయన లేచి తన ఇంట్లోకి వెళ్ళిపోయారు.

అహ్‌మద్ బిన్ హంబల్(ర) చెప్పారు యహ్యా(ర)తో "నేను నిన్ను ఆపలేదా మరియు చెప్పలేదా ఆయన నమ్మదగినవారు అని."

**ఆయన సమాధానమిచ్చారు, "అల్లాహ్ సాక్షి! ఆయన నన్ను తన్నడాన్ని ఎక్కువ ఇష్టపడ్డాను నేను చేసిన ప్రయాణం కంటే."**

## విద్వాంసులతో హదీస్‌లను సమీక్షించడం

ఇది చాలా శ్రేష్ఠమైన రంగం. దీనికొరకు ఎంతో శ్రద్ధ తీసుకుని అధ్యయనం చేయాలి మరియు వివిధ ఇస్నాద్‌లను మరియు ఉల్లేఖనాలను పరీక్షించాలి. కాబట్టి విద్వాంసులతో సమీక్షించడం చాలా ముఖ్యం.

సుఫ్యాన్ బిన్ 'ఉయైయ్‌నా మక్కాలో ఉండేవారు మరియు అలీ బిన్ మదీనీ ఇరాఖ్ నుండి వచ్చేవారు ఆయనతో సమీక్ష కోసం. ఇబ్నె ఉయైయ్‌నా చెప్పారు, "వారు నన్ను ఆక్షేపించేవారు అలీ బిన్ మదీనీ పట్ల నేను చూపే ప్రేమకు. అల్లాహ్ సాక్షి! నేను అతని నుండి నేర్చుకునేదే ఎక్కువ, అతను నా నుండి నేర్చుకున్న దాని కంటే."

ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు రాత్రివేళల్లో ఒక వంద కంటే ఎక్కువ రకాత్‌లు ప్రార్థనలో గడిపేవారు. అయితే యహ్యా బిన్ మʼఈన్ ఆయనని సందర్శించేవారు. కాబట్టి ఇమామ్ అహమద్ బిన్ హంబల్(ర)వారు నఫిల్ సలాత్ తగ్గించుకునేవారు మరియు యహ్యా(ర) వారితో కూర్చుని సమీక్ష చేస్తుండేవారు.

ఆ విషయంపై ఆయన కుమారుడు అడిగారు. ఆయన చెప్పారు, "ఓ నా కుమారా! నాకు తప్పిన నఫిల్ సలాత్‌లను నేను చేసుకోగలను. అయితే ఏదైతే ఈ యువకుని నుండి నేనక్షేది తప్పిపోతానే దానిని తిరిగి పొందలేను."

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

హదీస్‌లలో అన్ని రకాల సైన్సెస్ (Sciences) ఉన్నాయి. కాబట్టి వీటిపై అవగాహన సాధించడానికి జ్ఞానం మరియు ప్రతిభ కావాలి.
అంటే ఎంతో కష్టపడి దానిని సాధించాలి. విశ్వాసంతో కృషి చేస్తే ఇన్షా అల్లాహ్ హదీస్ జ్ఞానాన్ని ఎవరైనా పొందగలరు. కాని కేవలం తమకు అర్థమయ్యే భాషలోని అనువాదాన్ని చదివేసి తమకు తోచినట్లు మాట్లాడటం విశ్వాసులకి తగని పని.


**FORM IV**

***Statement about ownership and other particulars of SAANTHIBAATA Monthly (Telugu)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | D.No. 2-8-31, Kota Bazar, SAMALKOT-533440 East Godavari District Andhra Pradesh |
| 2. | Periodicity of its publication: | | Monthly |
| 3. | Printer's Name | : | Md. ATHAHARULLAH |
| | Nationality | : | Indian |
| | Address | : | D.No. 2-8-42, Kota Bazar Samalkot-533440 East Godavari District Andhra Pradesh |
| 4. | Publisher's Name | : | Md. ATHAHARULLAH |
| | Nationality | : | Indian |
| | Address | : | D.No. 2-8-42, Kota Bazar Samalkot-533440 East Godavari District Andhra Pradesh |
| 5. | Editor's Name | : | Md. ATHAHARULLAH |
| | Nationality | : | Indian |
| | Address | : | D.No. 2-8-42, Kota Bazar Samalkot-533440 East Godavari District Andhra Pradesh |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : | VELUGUBAATA EDUCATIONAL SOCIETY (Regd. No. 569/2008) D.No. 2-8-31, Kota Bazar SAMALKOT-533440 East Godavari District Andhra Pradesh |

I, Md. Athaharullah, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 28th February, 2013
Samalkot

Sd/-
Md. ATHAHARULLAH
Publisher

ఎటువంటి సందేహానికి తావు లేకుండా అత్యంత స్పష్టంగా ఇస్లామ్ బోధించిన

# పరమత సహనం

## ముహమ్మద్(స)వారు బోధించి మరియు ఆచరించి చూపారు

**ఖలీఫాలు ఆయనను అనుసరించారు. ఫలితంగా ప్రపంచానికి ఉన్నత విలువలతో కూడిన అసలైన ప్రజాస్వామ్యం పరిచయం అయింది**

### పాలకుల తొలి ప్రాధాన్యత :

విభిన్న మత ధర్మాలకు చెందినవారు ఒకేచోట నివశించేటప్పుడు, వారి ఆచార వ్యవహారాలు మరియు ఆరాధనా పద్ధతుల వలన వారి మధ్య స్పర్థలు రాకుండా, ఒకరిపై మరొకరు ఘర్షణకు దిగకుండా ఉండాలి. కాబట్టి ఇటువంటి ప్రాంతాలలో / దేశాలలో **తొలి ప్రాధాన్యత పరమత సహనానికే ఇవ్వాలి.** ఆ దేశం రాచరికపు పాలనలో ఉన్నా లేక ప్రజాస్వామ్య పరిపాలనలో ఉన్నా సరే ప్రజలలో పరమత సహనాన్ని అలవరచక పోతే పాలకులు తీవ్ర ఒత్తిడికి లోనవ్వక తప్పదు.

### మత ఘర్షణలకు కారణాలు :

కేవలం మత వ్యవహారాల కారణంగానే ఘర్షణలు జరగడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. ఈ ఘర్షణలకు ఎన్నో కారణాలు ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో ఉన్న మతధర్మానికి చెందిన వారిపైనే పాలకుల దృష్టి ఎల్లప్పుడూ ఉంటుంది. ప్రజాస్వామ్య దేశంలో ఇది సర్వసాధారణం. తిరిగి అధికారంలోకి రావాలంటే వారి ఓట్లు కావాలి. అయితే ఆ మతవర్గంపై రెండు రాజకీయ వర్గాలవారికి పట్టు ఉంటే, అప్పుడు మైనారిటీల ఓట్ల కోసం, వారిపై కూడా దృష్టి ఉంచుతారు. ఈ రాజకీయ క్రీడలో ఎన్నో ఘర్షణలు చోటుచేసుకుంటాయి.

ఏ కారణం చేతనైనా, అది నీటికోసమైనా లేదా మరొక సాధారణ విషయం కోసమైనా కావచ్చు, రెండు వర్గాల మధ్య గొడవ జరిగినప్పుడు, యాధృచ్ఛికంగా వారు రెండు మతధర్మాలకు చెందిన వారైతే, జరిగిన ఆ ఘర్షణను మత ఘర్షణగా ప్రచారం చేస్తారు. ఒకవేళ వారు ఒకే మత ధర్మానికి చెందినప్పటికీ, రెండు కులాలకు చెందిన వారైతే దానిని కుల ఘర్షణగా ప్రచారం చేస్తారు.

మన భారతదేశాన్ని ముస్లిమ్ రాజులు పాలించారు. తరువాత ఆంగ్లేయులు యుద్ధంతో కాకుండా కేవలం మోసంతో మన దేశాన్ని ఆక్రమించారు. **మనవాళ్ళని బానిసలుగా చేసుకున్నారు.** హిందూ ముస్లిములు ఐక్యంగా వారిని ఎదుర్కొన్నారు. కాబట్టి ఆంగ్లేయులు **'విభజించి పాలించు'** అనే సూత్రంతో మతఘర్షణలు జరిగేలా చేశారు.

**బాల్యంలో పిల్లలపై పడే ప్రభావం చాలా బలంగా ఉంటుంది.** కాబట్టి వారి పాఠ్య పుస్తకాలలోని చారిత్రక అంశాలను వక్రీకరించి హిందూ ముస్లిముల మధ్య ద్వేషాలు పుట్టడానికి తొలి బీజం నాటారు. అటువైపు మరియు ఇటువైపు కొందరిని ప్రలోభపెట్టి ఈ ఘర్షణ వాతావరణాన్ని పెంచి పోషించారు. చరిత్ర చదివిన వారిలో కొందరికి ఈ వాస్తవాలు అర్థమౌతాయి. బ్రిటిష్‌వారు ఈ దేశంలో కాలుమోపనంత వరకూ, ఇక్కడ మతధర్మాల కారణంగా ఘర్షణలు జరగలేదు.

ఇదే విషయంపై సుప్రీమ్‌కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి 'మార్కండేయ కాట్జు'గారు వాస్తవాలను వివరిస్తూ ఉన్నత విద్యాలయాల్లో ప్రసంగించారు. న్యూస్‌పేపర్లలో వ్యాసాలు కూడా వ్రాశారు. మన దేశంలో ఈ విధంగా బహిరంగంగా ఒకరో, ఇద్దరో నిర్భయంగా వాస్తవాలు చెప్పేవారున్నారు.

బ్రిటిష్‌వారికి సహజంగా ఇస్లామ్ పట్ల ఉన్న మత దురభిమానం కూడా ఈ నీచకార్యానికి ప్రేరేపించింది అని చెప్పవచ్చు. స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో ఏనాడూ లేని విధంగా హిందూ ముస్లిముల మధ్య బేధాభిప్రాయాలు బ్రిటిష్ వారు సృష్టిస్తే, స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం దాదాపు 50 సంవత్సరాలకు ఈ దేశంలో ఏనాడూ లేనివిధంగా ముస్లిములపై తీవ్రవాద ముద్రపడింది. దానికి కారణం ధూర్తదేశాలలో ఒకటైన అమెరికా. ఆ పదానికి ఇస్లామ్‌కి ముడిపెట్టి **'ఇస్లామిక్ తీవ్రవాదం'** అని ప్రచారం చేసింది మరియు అన్ని దేశాలలో ఆ ప్రచారాన్నే చేయిస్తుంది. పరమత సహనం లేని కారణంగా పాశ్చాత్యులు ఇస్లామ్‌కి వ్యతిరేకంగా కొన్ని వేల పుస్తకాలు వ్రాయించారు. మత విద్వేషాన్ని కక్కుతూనే ఉన్నారు.

### మన పాలకులపై ఉన్న ప్రధాన బాధ్యత :

మన దేశంలో ఉన్నట్లే పాశ్చాత్య దేశాలలో కూడా ప్రజాస్వామ్యం ఉన్నప్పటికీ, సంస్కృతులు విభిన్నం. అక్కడ ఉన్నట్లు ఇక్కడ విచ్చల విడితనం లేదు. ఎవరి ధర్మాన్ని వారు మనదేశంలో అనుసరిస్తున్నారు. మన చట్టం అన్ని ధర్మాల వారికి సమాన హక్కులు కల్పించింది.

ఆంగ్లేయులను తరిమికొట్టిన మనవారు, వారు నాటిన విషబీజాల ద్వారా పెరిగిన విషవృక్షాలను మాత్రం సమూలంగా కూల్చేయలేక

పోయారు. చరిత్రలో వారు కక్కిన విద్వేషాన్ని కడిగేయలేదు. 'విభజించి పాలించు' అనే వారి సూత్రాన్ని నేటి మన రాజకీయ నాయకులు అమలులో పెట్టారు.

ఆంగ్లేయులు రాకపూర్వం మన దేశంలో నెలకొని ఉన్న భిన్న సంస్కృతుల ఐక్యతను తిరిగి మనం సాధించాలి. పూర్వ వైభవాన్ని మరలా తీసుకు రావాలి.

## చరిత్ర పుస్తకాలలోని అంశాలు :

మన విద్యాబోధన పిల్లల ఆలోచనాశక్తిని పెంచేదిగా ఉండాలి. పిల్లలపై మనకిష్టమైన సిద్ధాంతాన్ని రుద్దేయకూడదు. ఉదాహరణకు **'రాతియుగం'** కోసం చెప్పేటప్పుడు, అటువంటి యుగం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. వాటికి శాస్త్రీయ ఆధారాలు కూడా ఉన్నాయి. మరియు ఈ రాతియుగం కూడా కేవలం సిద్ధాంతమేగాని వాస్తవంగా నిర్ధారించబడ లేదని చెప్పాలి.

మనిషి కోతినుండి పుట్టాడని చెప్పే పరిణామ సిద్ధాంతం, కేవలం ఒక సిద్ధాంతంగానే పిల్లల మనస్సులలోకి వెళ్ళాలిగాని, అదే నిజం అని వారు నమ్మేవిధంగా మనం వారిని బలవంతం చేయకూడదు.

భూకేంద్రక సిద్ధాంతం తప్పు అని నిరూపించి అసలు వాస్తవాన్ని ఎలా చెబుతున్నామో, అదే విధంగా ప్రతీ అంశంపైనా పిల్లలు ఆలోచించేలా చేయాలి.

'ఔరంగజేబ్'ను దుర్మార్గుడుగా చెబుతారు. **అతడు తన కుటుంబ పోషణకోసం ప్రజా సొమ్ము ఉపయోగించలేదు.** టోపీలు కుట్టి, ఖుర్'ఆన్ ప్రతులు వ్రాసి, ఆ సంపాదనతో తన కుటుంబాన్ని పోషించు కున్నాడు. ఈయన గురించి పరిశోధించి ఎన్నో వాస్తవాలను ప్రొఫెసర్లు బయట పెట్టారు. కాని ఆ వాస్తవాలకి చరిత్ర పుస్తకాలలో చోటు లభించలేదు. **తన స్వంత ఖర్చుల కోసం ప్రజాధనాన్ని ఉపయోగించని వాడు దుర్మార్గుడు ఎలా అవుతాడు?** అనే ఆలోచన పిల్లలలో కలుగ జేయాలి.

'ముహమ్మద్ బిన్ తుగ్లక్'ను పిచ్చివాడు అన్నారు. ఆయన కూడా తన కుటుంబం కోసం ప్రజాధనంపై ఆధారపడలేదు.

కొన్ని చోట్ల కవులే చరిత్రకారులయ్యారు. కవులను బాగా పోషిస్తే, పోషించిన రాజులను వారు గొప్పవారిగా చిత్రీకరించారు. ఉదాహరణకు ఎన్నో ప్రకృతి వైపరీత్యాలు, కరువులు తాండవించడం వంటి వాస్తవాలు ఎన్ని ఉన్నా, ఆ విషయాల కంటే బజార్లలో వంకాయలు అమ్మినట్లు రత్నాలు అమ్మారని గొప్పగా చెప్పడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. దున్నినప్పుడు నేల పైభాగానే రత్నాలు దొరికి నప్పుడు వాటిని అమ్మడం జరిగిందనే వాస్తవాన్ని కూడా తెలియజేయాలి.

**చరిత్రకారులు కేవలం రిపోర్టర్లుగా ఎవరు ఏది చెబితే దానిని స్వీకరించడం సరికాదు. సత్యాన్ని వెలికి తీయాలి.**

చరిత్ర పాఠ్య పుస్తకంలో ప్రచురించబడిన ఓ ఘోరమైన అసత్యంపై మార్కండేయ కాట్జుగారు చెప్పిన కొన్ని విషయాలు :

అలహాబాద్ యూనివర్శిటీ ప్రొఫెసర్, ఆ తరువాత ఒరిస్సా గవర్నర్ అయిన బి.ఎన్.పాండేగారు 1977లో పార్లమెంట్ ఎగువసభయైన రాజ్యసభలో ఇచ్చిన (History in the service of Imperialism) ప్రసంగాన్ని మీరు అర్థం చేసుకుంటే, హిందూ ముస్లిములు పరస్పరం విరోధులుగా అయ్యేటట్లు బ్రిటిష్‌వారి విధానం ఎలా ఉండేదో ప్రొఫెసర్ పాండేగారు చాలా వివరంగా ప్రస్తావించారు.

ఉదాహరణగా ఆయన ప్రస్తావించింది ఏమిటంటే, 1928లో ఆయన అలహాబాద్ యూనివర్శిటీ చరిత్ర ఆచార్యులుగా ఉన్నప్పుడు, కొందరు విద్యార్థులు ఒక పుస్తకంతో ఆయన దగ్గరకు వచ్చారు. ఆ పుస్తకం కలకత్తా యూనివర్శిటీలోని సంస్కృత ఆచార్యుడైన ప్రొఫెసర్ హరప్రసాద్ శాస్త్రి గారిచే వ్రాయబడింది. అందులో ప్రస్తావించబడినది ఏమిటంటే, **టిప్పు సుల్తాన్ 3000 మంది బ్రాహ్మణులను ఇస్లామ్ స్వీకరించమని లేకపోతే చంపబడతారని చెప్పారు మరియు ముస్లిములుగా మారడం కంటే చావడం మేలని ఆ 3000 మంది బ్రాహ్మణులు ఆత్మహత్య చేసుకున్నారు.** అది చదివి, ఏ ఆధారంతో మీరు ఇది వ్రాశారని అడుగుతూ ప్రొఫెసర్ బి.ఎన్.పాండేగారు ప్రొఫెసర్ హరప్రసాద్ శాస్త్రిగారికి లేఖ వ్రాశారు. **"ఈ సమాచారానికి ఆధారం ఏమిటి?"** ప్రొఫెసర్ హరప్రసాద్‌గారు సమాధాన మిచ్చారు దానికి ఆధారం "మైసూర్ గెజిటీర్" అని.

అప్పుడు ప్రొఫెసర్ పాండేగారు మైసూర్ యూనివర్శిటీలోని చరిత్ర ఆచార్యులైన ప్రొఫెసర్ శ్రీకంఠియగారికి వ్రాశారు. మైసూర్ గెజిటీర్‌లో 3000మంది బ్రాహ్మణులను ఇస్లామ్ స్వీకరించమని ప్రస్తావించబడటం నిజమా అని ఆయనను అడుగుతూ. అది పూర్తిగా అబద్ధమని ప్రొఫెసర్ శ్రీకంఠియ గారు సమాధానమిచ్చారు. ఆయన ఆ సబ్జక్టులో పనిచేసారు మరియు అటువంటి ప్రస్తావన మైసూర్ గెజిటీర్‌లో లేదు, బదులుగా నిజమైన వివరణ దానికి భిన్నంగా ఉంది. అదేమిటంటే, **టిప్పు సుల్తాన్ ప్రతీ సంవత్సరం 156 హిందూ దేవాలయాలకు నిధులు ఇచ్చేవారని, శృంగేరీ శంకరాచార్యులవారికి నిధులు పంపుతుండేవారని ...**"

ఇప్పుడు కాస్త ఊహించండి, ఎటువంటి మోసం జరిగిందో! **ఉద్దేశ పూర్వకంగా మన చరిత్ర పుస్తకాలు తప్పుగా వ్రాయబడ్డాయి. సులభంగా ప్రభావితమయ్యే వయస్సులో ఉండే పిల్లవాడి మనస్సు విషపూరితం అయ్యేవిధంగా వ్రాయబడ్డాయి.** కాబట్టి అతడు **ఇండియాలో ముస్లిములను ద్వేషించడం** మొదలు పెడతాడు మరియు **పాకిస్తాన్‌లో అతడు హిందువులను ద్వేషించడం** మొదలు పెడతాడు. సులభంగా ప్రభావితమయ్యే ఆ వయస్సులో అతడి మనస్సులో ఉంచబడిన విషాన్ని తరువాత కాలంలో తొలగించడం చాలా కష్టం. మన చరిత్ర పుస్తకాలన్నీ ఈ విధంగా తప్పుడు వ్రాతలు అయిపోయాయి.

**ఇదే సమయం.** మనం మన చరిత్ర పుస్తకాలను తిరిగి వ్రాయాలి మరియు చూపవలసిన వాస్తవం ఏమిటంటే **1857 వరకూ ఇండియాలో మతఘర్షణలు లేవు**. మిశ్రమ సంస్కృతి ఎప్పటి నుండో

అభివృద్ధి చెందుతూ ఉండేది. హిందువులు ఈద్, ముహర్రమ్‌లో పాల్గొంటే, ముస్లిములు హోలీ, దీపావళీ మొదలైన వాటిలో పాల్గొనేవారు. అయితే కొన్ని బేధాలున్నాయనడంలో సందేహం లేదు. కాని అవి చాలా చిన్నవి. **1857లో గొప్ప తిరుగుబాటు జరిగింది.** హిందూ ముస్లిములు కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఆ విప్లవాన్ని అణచివేసిన తరువాత, బ్రిటిష్ పాలకులచే నిర్ణయించబడింది ఏమిటంటే ఈ దేశాన్ని నియంత్రించ డానికి ఉన్న ఒకే మార్గం - **విభజించి పాలించడం**. మరో విధంగా చెప్పాలంటే, హిందువులు మరియు ముస్లిములు ఒకరినొకరు కొట్టుకునేలా చేయడం. **అన్ని మతఘర్షణలు 1857 తరువాతే ప్రారంభ మయ్యాయి.**

ఇంగ్లీష్ కలెక్టర్ రహస్యంగా ఓ హిందూ పండితుడిని పిలిచి అతనికి కొంత డబ్బిచ్చి ముస్లిములకు వ్యతిరేకంగా మాట్లాడమనేవాడు మరియు అదే విధంగా రహస్యంగా ఓ మౌల్వీని పిలిచి అతడికి కొంత డబ్బిచ్చి హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడమనేవాడు....."

ఇది నేను మీకు చెప్పడానికి కారణం ఈ గేమ్‌లో నుండి చూడాలని మరియు సమయం ఆసన్నమైందని తెలపాలని. అంటే ఎంతకాలం తీసుకెళతాం ఈ సవారీని. **మనం తెలివితక్కువ వాళ్ళమా? ఎవడో మనదగ్గరకు రాగలిగి మరియు మనల్ని తెలివితక్కువవారిగా చేసి మనలో మనం కొట్టుకునేలా చేయడానికి?"**

చరిత్ర పుస్తకంలో పేర్కొనబడిన ఓ అసత్యాన్ని పరిశోధించి అసలు వాస్తవాలు ఈ విధంగా బయట పెట్టారు.

ఒకవేళ టిప్పు సుల్తాన్ బలవంతంగా మత మార్పిడికి ప్రయత్నించారని మనం అనుకుందాం. అతడు ఇస్లామ్ స్వీకరించమని బలవంతం చేశాడని చెపుతున్నారు కాబట్టి, అతడు ఇస్లామ్‌ను ఎంతగానో ప్రేమించి ఉండాలి. ఇస్లామ్‌ను ఎంతో గొప్పగా ప్రేమించి ఉంటే, ఆయనకి ఇస్లామ్ పట్ల కనీస అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలి.

ఇస్లామ్ ఏం చెబుతుందో క్రింది ఖుర్ఆన్ ఆయత్‌లో చూడండి:

**ధర్మం విషయంలో బలవంతం లేదు** (ఖుర్ఆన్ 2:256)

దాదాపు 22 లక్షల చదరపు మైళ్ళ విస్తీర్ణం కలిగిన అతి పెద్ద దేశానికి అధ్యక్షుడు - రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారు. ఆయన దగ్గర ఓ బానిస ఉండేవాడు. బానిస అంటే నౌకరు వంటివాడు కాదు. బానిస అంటే యజమాని ఏది చెబితే అది చేయవలసిందే. బానిసకు ఎటువంటి స్వేచ్ఛ ఉండదు. కాని ఇస్లామ్ శాశ్వతంగా బానిసత్వ నిర్మూలన కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. బానిసలను ముస్లిమ్ యజమానులు తమకంటే బాగా చూసుకునేలా చేసింది ఇస్లామ్.

తన బానిసను ఇస్లామ్ స్వీకరించమని దేశాధ్యక్షునిగానే ఆదేశించ వలసిన అవసరం లేదు, ఒక మామూలు యజమానిగా ఆదేశించినా సరే, ఆ బానిస ఇస్లామ్‌ను బలవంతంగా స్వీకరించవలసిందే! కాని ఉమర్(రజి)వారు అలా చేయలేదు.

ఆ బానిస పేరు అషఖ్. ఉమర్(రజి)వారు మరణించిన తరువాత అతడే స్వయంగా జరిగిన వృత్తాంతాన్ని ప్రజలకు తెలియజేశాడు.

"నేను క్రైస్తవ బానిసను మరియు నా యజమాని ఉమర్(రజి). ఒకరోజు ఉమర్(రజి)వారు నాతో అన్నారు : **'ఇస్లామ్ స్వీకరించు, ఎందుకంటే ముస్లిములకు చెందిన కొన్ని విషయాలు చూసుకునే విధంగా నిన్ను ఉపయోగించ గలుగుతాము. వాస్తవానికి, వారి వ్యవహారాలు చూడటానికి, వారి నుండి కానివారిపై ఆధారపడటం సమంజసం కాదు.'**

నేను తిరస్కరించాను. దానిపై ఆయన ఇలా చెప్పారు :

**ధర్మం విషయంలో బలవంతం లేదు** (ఖుర్ఆన్ 2:256)

తరువాత, మరణం దగ్గరైనప్పుడు ఆయన నాకు స్వేచ్ఛనిచ్చి నాతో చెప్పారు : 'వెళ్ళు నీవు కోరిన చోటికి' "

**కాబట్టి ఇస్లామ్‌ను అనుసరించేవారెవరూ బలవంతపు మత మార్పిడులకు ప్రయత్నించరు. ఇస్లామ్‌ను అనుసరించనివారు ఆ విధంగా ప్రయత్నిస్తే దానికి ఇస్లామ్‌కూ సంబంధం లేదు.**

**బలవంతపు మతమార్పిడులు ప్రపంచంలో ఎవరు చేస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అది బహిరంగ రహస్యమే!**

గత సంచికలో 'జిజ్‌యహ్' వ్యాసం అందించాము. అది చదివిన వారంతా ఇస్లామ్ యొక్క ఔన్నత్యాన్ని ఇస్లామ్ బోధించిన పరమత సహనాన్ని అర్థం చేసుకున్నారు. **అటువంటి వాస్తవాలు చరిత్ర పుస్తకాలలో ప్రచురిస్తే, ఇస్లామ్‌పై అపోహలు దూరమౌతాయి.**

ముస్లిములపై మరియు ఇస్లామ్‌పై అవాస్తవాలు చరిత్ర పాఠ్యపుస్తకాల ద్వారా బోధించబడినప్పుడు, విద్యార్థులు వాటినే బట్టీ పట్టాలి. ముస్లిమ్ విద్యార్థి కూడా వాటినే బట్టీ పట్టాలి. తరగతి గదిలో ఆ ముస్లిమ్ విద్యార్థి ఎటువంటి పరిస్థితికి లోనవుతాడో ఆలోచించారా?

**'నీవు నీ పాఠ్యపుస్తకం (Text book) లో చదివింది నిజం కాదురా కన్నా'** అని ఖండించి, అసలు వాస్తవాన్ని ఆ బిడ్డకు చెప్పాలంటే, తల్లిదండ్రులు విద్యావంతులై ఉండాలి.

**నేడు ఉన్నత విద్యను అభ్యసించిన ఎందరో ముస్లిములకు తమ ధర్మం గురించి, తమ చరిత్ర గురించి ఏమీ తెలియదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.**

**లేత వయస్సులో పిల్లలలో తప్పుడు భావాన్ని కలిగించి, వారు పెద్దయిన తరువాత పరమత సహనం అలవరచు కోవాలంటే అది ఎంతమందిలో సాధ్యమౌతుంది?**

**పిల్లల చేతుల్లో**
**తుపాకులు ఉండడం లేదా పాఠ్యపుస్తకాలు ఉండడం**
**రెండూ ఒకే ప్రభావాన్ని కలిగి ఉంటాయా?**

తీవ్రవాదులు తమ పిల్లలకు చిన్నతనం నుండే తుపాకీలు ఇచ్చి

శిక్షణ ఇస్తున్నారని చెబుతారు. ఆ విధంగా వారు కరడుగట్టిన తీవ్రవాదులై మానవత్వం విలువ తెలుసుకోలేక పోతున్నారని కథనాలు, సినిమాలు వస్తుంటాయి. అందుకని పరిష్కారంగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలి అంటున్నారు. **నిజమే! కాని ఆ విద్యాబుద్ధులు వక్రమార్గంలో ఉంటే, అప్పుడు కూడా జరిగేది వినాశనమే!**

మరి చిన్నతనం నుండే పిల్లలలో 'పరమత సహనాన్ని' కోల్పోయే విధంగా అబద్ధాలను బోధించడం వలన, వారు పెరిగి పెద్దయ్యాక **మతోన్మాదులు కావడానికి బీజాలు వేస్తున్నట్లు** మేధావులు ఎందుకు భావించడం లేదు. సత్యాన్నే పలకమని చెబుతూ అవాస్తవాలు బోధించడం తగునా?

మామూలు స్కూలులో చదువుకుని, కాలేజీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని, ఆశ్రమాల్లో పనిచేసిన **ఓ స్వామి గారు బాంబు దాడి చేయించారు. అతనిలోని ఆ తీవ్రవాదానికి కారణం ఏమిటి?** ఉగ్రవాద శిబిరాలలో కాకుండా ఆశ్రమాల్లో శిక్షణ పొందిన ఈ వ్యక్తి ఇలా ఎందుకు ప్రవర్తించాడు? దీనికి కారుకులు ఎవరు? ఒక దినపత్రికలో ప్రచురించ బడిన ఆ సమాచారం ఇక్కడ అందిస్తున్నాము.

### హిందువులు వెళ్ళొద్దనే దాడి చేయించా

**- అజ్మీర్ పేలుడుపై అసీమానంద** (సాక్షి దినపత్రిక, 11 జనవరి 2011)

అజ్మీర్ దర్గాకు హిందువులను వెళ్లకుండా చేసేందుకే అక్కడ దాడికి పాల్పడినట్లు స్వామీ అసీమానంద వెల్లడించాడు. నిత్యం పెద్ద సంఖ్యలో దర్గాకు వచ్చే హిందువులు, బాంబు దాడి జరిగితే ఇక్కడకు రావడం మానేస్తారనే అంచనాతోనే ఈ పనిచేశామని నేరాంగీకార ప్రకటనలో తెలిపాడు. దాడికి పాల్పడిన వారిలో మెజారిటీ వర్గానికి చెందిన వారితో పాటు మైనారిటీ వర్గం వారూ ఉన్నట్లు చెప్పాడు. పేలుళ్లు జరిగిన రెండు రోజులకు సునీల్ జోషీ (హత్యకు గురైన ఆరెస్సెస్ మాజీ ప్రచారక్), రాజు, మేహుల్ అనే మరో ఇద్దరితో కలిసి **గుజరాత్‌లోని తన ఆశ్రమానికి వచ్చినట్లు** తెలిపాడు. బాంబు అమర్చేందుకు **ఇంద్రేష్ కుమార్ (ఆరెస్సెస్ సీనియర్ నేత)** ఇద్దరు ముస్లిం యువకులను పంపారని సునీల్ జోషీ తనకు చెప్పినట్లు వెల్లడించాడు. అజ్మీర్ పేలుళ్లతో పాటు **హైదరాబాద్, మలేగావ్, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల వెనుక కొందరు ఆరెస్సెస్ కార్యకర్తలతో పాటు ఇంద్రేష్ హస్తముందన్నాడు.** "ఇంద్రేష్ నన్ను 2005లో కలిశాడు. దాడికి ప్రతిదాడి చేయక తప్పదన్న నా వాదన విన్న ఇంద్రేష్, 'అది నీ పనికాదు. ఆ బాధ్యతను మరో వ్యక్తికి (సునీల్) అప్పగించాం' అని చెప్పారు" అని బయటపెట్టాడు.

పైన చెప్పబడిన సునీల్ హత్య గావించబడ్డాడు. అతని వ్యక్తులే అతన్ని చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బహుశా అతని ద్వారా విషయం తెలిసిపోతుందని చంపివేశారేమో!

42 పేజీల నేరాంగీకార రిపోర్ట్‌ను తెహల్కా ప్రచురించింది. మాలెగావ్‌లో 80శాతం మంది ముస్లిములున్నారు. అజ్మీర్ దర్గా బ్లాస్ట్ అక్టోబర్ 11, 2007 రమదాన్ నెలలో దాదాపు 5000 మంది ఉన్నప్పుడు జరిగింది.

**మక్కా మస్‌జిద్‌ను బాంబ్ బ్లాస్ట్‌కు ఎన్నుకోవడానికి గల కారణం అప్పటి హైదరాబాద్ నిజామ్ దేశవిభజనలో పాకిస్తాన్‌వైపు ఉన్నాడట.**

**సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ని ఎక్కువగా పాకిస్తానీలే ఉపయోగిస్తున్నారని దానిపై దాడి చేయించాడట.**

ఇలాంటి తీవ్రవాద ఆలోచనలున్న స్వామీ అసీమానంద బోటనీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. 1977లో ఆరెస్సెస్‌వారి **ఆదివాసి కళ్యాణ్ ఆశ్రమంలో** చేరారు. 1981 వరకూ పశ్చిమ బెంగాల్‌లో ఉన్నారు. 1988 నుండి 1993 వరకూ అండమాన్ నికోబార్ ద్వీపాలలోఉన్న **వనవాసి కళ్యాణ్ ఆశ్రమం**లో ఉన్నారు. **1995 నుండి గుజరాత్ ఆశ్రమంలో** ఉన్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో సిబిఐ వారు ఇతనిని అరెస్ట్ చేశారు. సీనియర్ ఆరెస్సెస్ లీడర్ - **ఇంద్రేష్ కుమార్, ఆరెస్సెస్ ప్రచారక్ సునీల్ జోషి, సాధ్వి ప్రగ్యా సింగ్, సందీప్ దాంగే, రామ్‌జీ** కల్సంగ్రా మొదలైన వారితో ఈయన చాలా సార్లు సమావేశమయ్యారు, వారితో పాటు హిందుత్వ నాయకులు కూడ ఉన్నారని చెప్పాడు.

**అసీమానంద** నేరాన్ని అంగీకరించాక **ఆరెస్సెస్ ఛీఫ్ మోహన్ భగవత్** గారి స్పందన (ద హిందూ, 11 జనవరి 2011)
రాడికల్ ఆలోచనలు ఉన్నవారిని తమ సంస్థ నుండి వదిలి వెళ్ళమని చెప్పాము.

ఈ బ్లాస్ట్ జరిగి జనవరిలో వార్త ప్రచురించే సరికి మూడు సంవత్సరాలు అయింది. ఇది చేయించింది తమ సంస్థ వారేనని కనీస సమాచారం కూడా ఈయన దగ్గర లేదా? స్వామీ అసీమానంద 1977 నుండి ఆరెస్సెస్ ఆశ్రమాల్లో పనిచేస్తున్నాడు. అంటే దాదాపు 30 సంవత్సరాల నుండి ఆశ్రమాల్లో ఉండి, ఆరెస్సెస్ ప్రచారక్‌లతోనూ హిందుత్వ నాయకులతోనూ సంఘ వ్యతిరేక కార్యక్రమాల కొరకు సమావేశమౌతున్నా కూడా ఈ సంస్థ అధిపతికి ఆ విషయాలు తెలియ లేదు అంటే, ఇంకా ఇటువంటి వారు ఎంతమంది ఆశ్రమాల్లో ఉన్నారో?

**అసీమానంద 30 సంవత్సరాలు ఆశ్రమంలో ఉండి శాంతి యుతంగా ప్రవర్తించడానికి బదులు, బాంబ్ బ్లాస్ట్‌లకు సిద్ధమయ్యాడంటే, ఆయన ఎటువంటి శిక్షణను పొందాడు? ఇతరులకు ఎటువంటి శిక్షణ నిచ్చాడు?**

మరి ఆరెస్సెస్ నాయకులు ఇటువంటి వారిని **తమ సంస్థలో ఎప్పుడు గుర్తిస్తారు?** ఎప్పుడు వారిని బయటికి పంపిస్తారు? తమ ఆశ్రమాలు ఇటువంటి తీవ్రవాదులకు నిలయం అవుతున్నాయా? మరి **ముస్లిమ్ మదరసాలపై విషం వెళ్ళగక్కేవారు ఈ ఆశ్రమాల విషయంలో** ఏమి **మాట్లాడుతారో?**

పై విషయాలు చదివారు కదా! ఒక స్వామి గారు ఎందుకు ఆ విధంగా ప్రవర్తించారంటే, **అతనిలో పరమత సహనం లోపించింది.** శాంతి ఆశ్రమాలు కూడా అతనిలో **సహనాన్ని పెంచలేకపోయాయి.** బాంబు దాడి చేసి మారణహోమాన్ని సృష్టించేటంత విద్వేషం పెరిగింది. మేము ఆశ్రమాలపై వ్యాఖ్యలు చేయడం లేదు.

## నైతిక విలువలు బోధించాలి

చెడు ఆకర్షించినంత శక్తివంతంగా మంచి ఆకర్షించదు. నైతిక విలువల గురించి ఎంత చెప్పినా సరే, మనం కోరుకున్నంత స్థాయిలో వారు నీతిపరులు కాకపోవచ్చు. కాబట్టి మన చేతిలో ఏదీ లేదని నైతిక విలువలు గురించి చెప్పకపోతే ఏమౌతుంది?

చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా, ఇప్పుడు మానభంగాలు పెరిగిన తరువాత ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకూ నైతిక అంశాలు బోధించాలని నిర్ణయం తీసుకున్నారు.

సినిమాల ప్రభావం పిల్లలపై చాలా ఉంది. పిల్లల తల్లిదండ్రులపై కూడా చాలా ఎక్కువగా ఉంది.

చెడు చూడవద్దని ఒక పక్క చెబుతూనే, చెడు ఎక్కువగా కనిపించేలా చేయడం ఎందుకు? దానిని తగ్గించవచ్చు కదా! **నైతిక విలువలు లేని భావప్రకటనా స్వేచ్ఛ నాగరికం అవుతుందా? అనాగరికం అవుతుందా?**

**లేత వయస్సులో పిల్లలపై చెడు ప్రభావం పడకుండా అన్ని విధాలా జాగ్రత్త పడకపోతే ఏమౌతుందో నేడు చూస్తూనే ఉన్నాము.**

చాలా మంది చదువులు 10వ తరగతితోనే ఆపేస్తారు. అంతేకాకుండా బాల్యం నుండి ఆ పదవతరగతి మధ్య ఉండే వయస్సులో వారిపై పడే ప్రభావం వారి జీవితంలో చాలా ముఖ్యమైనది.

కాబట్టి ప్రభుత్వం కనీసం 10వ తరగతి వరకూ బోధించే బోధన అంశాలపై దృష్టిపెడితే, కనీసం మన భావిపౌరులైనా ప్రశాంతంగా జీవించ వచ్చు, ఇన్షా అల్లాహ్.

## ఇస్లామ్ మరియు సహనం

ఇస్లామ బోధించిన అతి ముఖ్య అంశాల్లో సహనం చాలా ప్రధాన మైనది. ఖుర్‌ఆన్‌లో ఎన్నో వాక్యాలు సహనం వహించమనే బోధిస్తాయి. 'తీవ్రవాదం' అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించిన దగ్గర నుండి, శతాబ్దాల పాటు ఆ పదానికి ముస్లిములకు ఎటువంటి సంబంధం లేదనే వాస్తవానికి స్వయంగా చరిత్రే సాక్షి. అప్పటికే ఎన్నో శతాబ్దాలుగా ఇస్లామ్ ఆచరణలో ఉంది. శతాబ్దాల క్రితం ప్రపంచంలో తీవ్రవాదులంటే ముస్లిమేతరులే గాని ముస్లిములు కాదని ఆ కాలం వారందరికీ తెలుసు.

గల్ఫ్ దేశాలలోని సహజ వనరులపై దుష్టదేశాల కన్ను పడిన దగ్గర నుండి మరియు యూదుల దుర్మార్గం భారీస్థాయికి చేరినప్పటి నుండి, ముస్లిములను తీవ్రవాదులుగా వర్ణిస్తూ ప్రచారం జరగడం మొదలైంది. **అబద్ధాలు చెప్పి, మోసాలు చేయడం, స్నేహితులుగా చేరి బానిసలుగా చేసుకోవడం పాశ్చాత్యులకు వెన్నతో పెట్టిన విద్య.** ప్రపంచంలోని ఎన్నో వ్యవస్థలపై వారు చెడు ప్రభావాన్ని వేసారు. అవి వారి నియంత్రణలోనే ఉన్నాయి.

**కాబట్టి ఇతర ధర్మాల వారికోసం మాత్రమే కాకుండా, సాధారణ ముస్లిములకు కూడా ఎన్నో వాస్తవాలు తెలియజేయవలసి ఉంది. ఈ వాస్తవాలు వారు తెలుసుకుంటే కనీసం కొంత వరకైనా ఇస్లామ్ పట్ల అపోహలు తొలిగే అవకాశం ఉంది.**

ఆరాధనకు అర్హుడు 'అల్లాహ్' మాత్రమేనని, ఆయనకు ఎవరినీ సాటి కల్పించ కూడదని, ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క ప్రవక్త మరియు సందేశహరుడనే విషయాన్ని మనస్ఫూర్తిగా విశ్వసించినవారు ముస్లిములవుతారు.

వారు అనుసరించ వలసినవి ముఖ్యంగా రెండే రెండు - **1. ఖుర్‌ఆన్ ఆదేశాలు 2. ముహమ్మద్(స)వారి బోధనలు.** అవి అల్లాహ్‌చే కాపాడ బడుతున్నాయి. వాటి ప్రామాణికతను ఎవ్వరైనా, ఎప్పుడైనా పరీక్షించుకునే విధంగా మార్పులకు గురికాకుండా అవి అవతరించి నప్పటినుండి అలాగే ఉన్నాయి.

పై రెండింటిని విశ్వసించని వాడు ముస్లిమ్ కానేకాడు. ఎవరైనా ఇస్లామ్ ప్రకారం చేసే ఆచరణను ఖండిస్తే, అతడు వెంటనే అడిగే విషయం : ''ఖుర్‌ఆన్‌లో మరియు ముహమ్మద్(స)వారి బోధన (హదీస్)లలో దానికి ఆధారం ఉందా?'' అని.

కాబట్టి ముహమ్మద్(స)వారు సహనాన్ని బోధించడం గురించి మాత్రమే కాకుండా, ఏ విధంగా దానిని ఆచరించి మానవులకు ఆదర్శనీయులు అయ్యారో క్లుప్తంగానైనా ఈ సందర్భంగా చెప్పవలసి ఉంది.

ముహమ్మద్(స)వారు పడినన్ని కష్టాలు ఎవరూ పడలేదు. ఆయన కడుపు నిండా ఏనాడూ తినలేదు. వరుసగా రెండు రోజులు భోజనం చేసిన సందర్భాలు ఆయన జీవితంలో చాలా తక్కువ. అతి నిరాడంబరంగా బ్రతికారు. ఆకలి నొప్పిని తట్టుకోవడానికి కడుపుకు రాళ్ళు కట్టుకున్న మహానాయకుడు. తన పాలనలో మదీనా నగరం ఐశ్వర్యంతో తులతూగుతున్నప్పుడు కూడా ఆయన దైనందిన జీవితంలో మార్పు రాలేదు. ఆయన(స) దగ్గర ఏదైనా ఉంటే అడిగిన వారికి కాదనేవారు కాదు. ఆయన తన జీవిత కాలంలో కనీసం నౌకరును కూడా కొట్టలేదు. ఆయన హింసా దౌర్జన్యాలకు ఎన్నో సార్లు గురయ్యారు. **కాని సహనమే వహించారు.**

ఆయన ఎంత సహనశీలురో చరిత్ర సాక్ష్యమిచ్చింది. అయితే క్లుప్తంగా కొన్ని విషయాలు ఇక్కడ చెప్పాలి.

బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, తరువాత తాతగారు, ఆయన తరువాత బాబాయి గారి సంరక్షణలో పెరిగారు. ఎన్నడూ

అబద్ధం చెప్పలేదు. ఎన్నడూ ఎవరిపై దౌర్జన్యం చేయలేదు. ముహమ్మద్(స)వారు బాల్యం నుండి అరేబియాలో ప్రజలచే ప్రసంశించ బడ్డారు. నిజాయితీపరుడు, నమ్మకస్తుడు, .... ఇలా సకల సుగుణాలు కలిగిన వ్యక్తిగా ఆయన అందరికీ సుపరిచితమే. అనాథలకు, అభాగ్యులకు సహాయం అందించేవారు. ముహమ్మద్(స)వారికి మక్కాలో వివాహం జరిగింది. సంతానం కలిగింది. ఆయనకు 40 సం॥లు నిండాయి. ఆయన పట్ల ప్రజలలో ప్రేమ అలాగే ఉంది. అల్లాహ్ ఆదేశం మేరకు ఆయన ప్రవక్తగా ప్రజలకు బోధించడం ప్రారంభించారు.

ఇక అప్పటి నుండి ఆయనపై హింసా దౌర్జన్యాలు మొదలయ్యాయి. శాంతిబాటలో ఎన్నో సందర్భాలలో అక్కడి ప్రజలు ముస్లిముల పట్ల పాల్పడిన హింసల గురించి తెలియజేశాము. ఈ చిన్న వ్యాసంలో అవన్నీ అందజేయడం లేదు. రక్తం కారేలా రాళ్ళతో కొట్టారు. **ఆరాధ్యుడు ఒక్కడే అని బోధించినందుకు దాదాపు 3 మైళ్ళు వెంబడించి రాళ్ళతో కొడతారా?** అయినా సరే వారి క్షేమాన్నే కోరారు ఈ కారుణ్యమూర్తి - ముహమ్మద్(స).

ఆయన సహచరులలోని ఒకరిని ఎడారి ఇసుకలో ఎండలో పడుకోబెట్టి ఛాతిపై బండరాయి నుంచారు. ముహమ్మద్(స)వారిని మరియు ఆయన బంధువులను 3 సంవత్సరాలు మక్కా నుండి వెలివేసారు. ఆ లోయలో చిన్న పిల్లలు ఆకలితో ఏడ్చేవారు. వారికి నిషిద్ధమాసాలలో మాత్రమే పట్టణంలోకి రానిచ్చేవారు. వారికి ఆహారం దొరక కుండా చేసారు. చివరికి ముహమ్మద్(స)వారిపై హత్యా ప్రయత్నం కూడా చేశారు.

ఈ హింసలు శృతిమించడంతో ముస్లిములంతా మక్కా వదిలి మదీనా వెళ్ళిపోయారు. అక్కడ కూడా వారు ప్రశాంతంగా జీవించకుండా యుద్ధానికి కాలుదువ్వారు. గత్యంతరం లేక వారితో యుద్ధం చేయవలసి వచ్చింది. 13 సంవత్సరాల పాటు తీవ్రమైన హింసలకు గురియైన తరువాత జరిగిన తొలి యుద్ధం అది. ముస్లిముల దగ్గర యుద్ధసామాగ్రి లేదు. ఆకలి తీరని కడుపులతో నీరసించి ఉన్నారు ముస్లిములు. అయినా సరే అల్లాహ్ నుండి అందిన సహాయంతో ముస్లిములు విజయం సాధించారు. ఆ తరువాత మరికొన్ని యుద్ధాలు జరిగాయి.

చివరిగా మక్కాపై ముహమ్మద్(స)వారు దండయాత్ర చేసారు. రక్తపాతం లేకుండా మక్కా స్వాధీనం చేసుకున్నారు. ఏ ప్రాంతంలో ఆయన(స) మరియు ఆయన అనుచరులు దౌర్జన్యాలకు గురిఅయ్యారో ఇప్పుడు అదే ముస్లిముల అధీనంలోకి వచ్చింది. వీరు ఇప్పుడు ఏది చేయాలనుకున్నా చేయగలరు.

ముస్లిములను ఎన్నో హింసలు పెట్టి బాధించిన అక్కడి ప్రజలు ఆ సమయంలో తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వారు అంతవరకూ పాల్పడిన దౌర్జన్యానికి ముహమ్మద్(స)వారు ప్రతీకారం తీర్చుకోవడంలో దోషం లేదు. కాని అందరినీ ఆయన క్షమించేసారు. అంతటి కారుణ్య మూర్తి - ముహమ్మద్(స)వారు.

**హింసలను భరిస్తూ 13 సంవత్సరాలపాటు సహనం వహించారు.** అవకాశం అధికారం వచ్చినప్పుడు వారిని శిక్షించకుండా క్షమించారు. క్రింది ఖుర్ఆన్ ఆయత్‌ను ఆయన(స) ఆచరించి చూపారు.

"ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని మీరు సహనం **చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది.**"
(దివ్య ఖుర్ఆన్ 16:126)

## పాలకులు చెడుగా ప్రవర్తిస్తే

**పేదవాడైన తన అనుచరుడు, అబూజర్(రజి)వారితో ముహమ్మద్(స) వారి సంభాషణ :**

"పాలకులు ముస్లిముల పట్ల చెడుగా ప్రవర్తించడం నీవు చూస్తే ఏమి చేస్తావు?"

అబూజర్(రజి) సమాధానమిచ్చారు, **"అల్లాహ్ సాక్షి, నా ఖడ్గాన్ని ఉపయోగిస్తాను".**

ప్రవక్త(స)వారు ఆయనకి చెప్పారు : "**కాని నీవు నన్ను పరలోకంలో కలిసేవరకూ సహనం వహిస్తే అది నీకు ఎంతో ఉత్తమమైనది**".

ఆ అనుచరుడు మరణించేవరకూ ముహమ్మద్(స)వారు చెప్పినట్లే సహనం వహించారు.

## ప్రజలకు శాంతిభద్రతలు కలగజేయడానికి కొన్ని శిక్షలు అమలు చేయక తప్పదు.

అరాచకాలు సృష్టించేవారిని, అన్యాయానికి ఒడిగట్టేవారిని శిక్షించక తప్పదు. క్రింది ఖుర్ఆన్ ఆయత్ చూడండి.

"....హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసి నందుకుగాని కాక, మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. **ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడిన వాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే ....**" (దివ్య ఖుర్ఆన్ 5:32)

పై ఆయత్‌లో అల్లాహుతాలా మానవుడి ప్రాణం అని చెప్పారు గాని ముస్లిమ్ ప్రాణం అని చెప్పలేదు. పై ఖుర్ఆన్ ఆయత్ ప్రకారం ముస్లిములు మరియు ముస్లిమ్ ఖలీఫాలు, ఏ మతధర్మానికి చెందిన వారినైనా ఒకే విధంగా చూసారు.

మానవుని పట్ల మాత్రమే కాదు జంతువుల పట్ల కూడా దయతోనే మెలిగారు ముస్లిములు. ప్రపంచంలో ఓ అతి పెద్ద భూభాగానికి అధ్యక్షుడు మరియు అమీరుల్ మోమినీన్ అయిన ఉమర్(రజి)వారు ప్రకటించిన క్రింది విషయాన్ని అర్థం చేసుకోండి.

**ఆయన పాలనలో ఆకలితో ఓ కుక్క టైగ్రిస్ నది ఒడ్డున చనిపోయినా సరే, దాని బాధ్యత తనదేనని చెప్పుకున్న ప్రజాస్వామ్య పాలకుడు ఉమర్(రజి).**

**తోటి మానవునికి కష్టం కలగకుండా ...**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్-స) ఇలా అన్నారు: "ఓ వ్యక్తి దారిన పోతుండగా, మార్గంపై ఓ ముళ్ళ కొమ్మను చూశాడు. దానిని తీసివేశాడు. దానిని (ఆ సత్కార్యాన్ని) అల్లాహ్ మెచ్చుకొని, అతనిని క్షమించాడు." **(సహీహ్ ముస్లిమ్, నెం. 6669, సంపుటి 6, అధ్యా.36)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త(స) ఇలా చెప్పారు: "ప్రజలకు ఇబ్బందిని కలిగించే మార్గంలోని చెట్టును నరికినందుకు గాను, స్వర్గంలో ఆనందిస్తున్న ఓ మనిషిని నేను చూశాను". **(సహీహ్ ముస్లిమ్, నెం. 6671, సంపుటి 6, అధ్యా. 36)**

ముస్లిములు చేసే ప్రతీ ఆరాధన మరియు ప్రతీ మంచి పని అల్లాహ్ క్షమాపణ కొరకే. తద్వారా లభించే స్వర్గం కొరకే. అటువంటి స్వర్గం ఇంత సులభంగా లభించిందా? అని ఎవరికైనా అనిపిస్తుంది. కాని అతని సంకల్పం చాలా గొప్పది. తన తోటివారికి కష్టం కలగకూడదనే అతని ఉన్నత సంకల్పాన్ని అల్లాహ్ స్వీకరించారు.

**పొరుగువానితో మంచిగా ప్రవర్తించాలి.**

పొరుగువానితో మంచిగా ప్రవర్తించమని చెప్పడం మాత్రమే కాకుండా, ఆ ప్రవర్తన ఎలా ఉండాలో, ఎంతటి సహనం వారిపట్ల వహించాలో స్పష్టంగా ముహమ్మద్(స)వారు బోధించారు. క్రింది బోధనలు చూడండి.

ఆయిషా(రజి) నుండి అమ్రా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్(స) చెప్పారు: "పొరుగువారి గురించి జిబ్రాయీల్(అ) ఆదేశిస్తూ ఉండేవారు, **పొరుగువారిని వారసులుగా చేసేస్తారేమోనని నేను అనుకునేటంతగా**".
**(అబూదావూద్, సహీహ్, 5151, అధ్యా. 122,123, సంపుటి 5)**

ముహమ్మద్ బిన్ అజ్‌లాన్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. అబూ హురైరా(రజి) చెప్పారు : "ఓ వ్యక్తి ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి తన పొరుగువాని గురించి ఫిర్యాదు చేశాడు. ఆయన(స) చెప్పారు, **"వెళ్ళి సహనంతో ఉండు"**. అతను రెండు లేదా మూడుసార్లు వచ్చాడు. అప్పుడు ఆయన(స) చెప్పారు, "వెళ్ళు, నీ సామాన్లను వీధిలో ఉంచు". కాబట్టి అతడు తన సామాన్లను వీధిలో బయట ఉంచాడు. మరియు ప్రజలు అతడిని (ఏమి జరిగిందని) అడగడం ప్రారంభించారు. అతడు వారికి జరిగిన వృత్తాంతాన్ని చెప్పాడు, ప్రజలు (ఆ పొరుగువానిని) 'అల్లాహ్ అతనికి ఫలానా ఫలానా చేయుగాక!" అని చెబుతూ తిట్టడం ప్రారంభించారు. అతని పొరుగువ్యక్తి అతని దగ్గరకి వచ్చి చెప్పాడు, "వెనక్కి వచ్చెయ్యి, నీకు ఇష్టం కానిది ఏదీ నా నుండి ఇక చూడవు". **(అబూదావూద్, హసన్, 5153, అధ్యా. 122,123, సంపుటి 5)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు, 'ఎవరైతే అల్లాహ్‌ను మరియు పరలోకాన్ని విశ్వసించారో, అతడు తన అతిథిని గౌరవించాలి, ఎవరైతే అల్లాహ్‌ను మరియు పరలోకాన్ని విశ్వసించారో, అతడు తన **పొరుగువారిని బాధించకూడదు.** ఎవరైతే అల్లాహ్‌ను మరియు పరలోకాన్ని విశ్వసించారో, అతడు మంచిని మాట్లాడాలి లేకపోతే నిశ్శబ్దంగా ఉండాలి".
**(అబూదావూద్, సహీహ్, 5154, అధ్యా. 122,123, సంపుటి 5)**

తల్హా ఉల్లేఖనం. ఆయిషా(రజి) చెప్పారు, "నేను అడిగాను, 'ఓ రసూలుల్లాహ్(స), నాకు ఇద్దరు పొరుగువారున్నారు. నేను ఎవరితో ప్రారంభించాలి.' ఆయన(స) చెప్పారు, **'నీకు ఎవరి ద్వారం దగ్గరగా ఉందో వారితో** (మొదలుపెట్టు)' "
**(అబూదావూద్, సహీహ్, 5155, అధ్యా. 122,123, సంపుటి 5)**

ఇంటి పొరుగువారితో ఎలా ప్రవర్తించాలంటే, చూసేవారికి వారు పొరుగువారిలా కాకుండా, వారి వారసులు అనుకునేటంతగా. ఇక్కడ ఓ అతి ముఖ్య విషయం కూడా ఉంది. పొరుగువారి విషయంలో కూడా పక్షపాతం చూపకుండా ఉండేలా, ఎవ్వరూ నిష్టూరమాడని విధంగా ఎంత గొప్ప విధానాన్ని బోధించారంటే, తన ఇంటి తలుపుకి దగ్గరగా ఎవరైతే ఉన్నారో, ఆ పొరుగువాని ఇంటి నుండే ప్రారంభించాలి అన్నారు.

అంటే మనం స్వీట్లు పంచాలనుకుంటే, మనకు బాగా ఇష్టమైన పొరుగువారికో లేదా పూర్వం మనకు ఎవరైతే బాగా మర్యాదలు చేశారో వారికి కాకుండా, మనకు బాగా దగ్గరగా నున్నవారికి ముందుగా పంచాలి.

ఈ విధానం ఎటువంటి ఆరోపణలకు అవకాశమివ్వదు.

కేవలం పొరుగువారే కాకుండా, పొరుగువారి పశువుల విషయంలో కూడా మంచిగానే ప్రవర్తించమని ముహమ్మద్(స)వారు చెప్పారు :

సురాఖా బిన్ జు'షుమ్ ఉల్లేఖనం. "నేను రసూలుల్లాహ్(స) వారిని తప్పిపోయిన ఓ ఒంటె గురించి అడిగాను. అది నా స్వంత ఒంటెల కొరకు ఏర్పాటు చేసుకున్న నీటి తొట్టెల దగ్గరకు వచ్చింది **- దానికి త్రాగడానికి నేను కొంత నీటిని ఇచ్చినట్లయితే నేను ప్రతిఫలం పొందుతానా? ఆయన(స) చెప్పారు, 'ఔను. ప్రతి జీవిలోనూ ప్రతిఫలం ఉంది'**
**(ఇబ్నెమాజా, సహీహ్, 3686, పుస్తకం 33, అధ్యా.8, సంపుటి 5)**

పై విషయాలు చాలు, ఇస్లామ్ ఎంత ఉన్నత స్థాయిలో పరమత సహనాన్ని బోధించిందో వివరించడానికి.

## ఇస్లామ్‌లో పరమత సహనం లేదని విమర్శలు

వక్రీకరణలో పాశ్చాత్యులు దిట్టలు కాబట్టి, ముస్లిమ్ ఖలీఫాలపై ఎన్నో అభాండాలు వేశారు.

రెండవ ఖలీఫా అమీరుల్ మోమినీన్ ఉమర్(రజి)వారి చరిత్ర తెలిసిన వారికి అవి ఎంత ఘోర వక్రీకరణలో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఈ రోజుకీ ఉన్న చరిత్ర పుస్తకాలలో ముస్లిమేతర జాతుల విషయంలో ఉమర్(రజి) కఠినంగా వ్యవహరించినట్లు ఉంటుంది. చరిత్రలో **ఈ విషయాలు చేర్చే సమయానికి మత దురభిమానం తీవ్రంగా ఉండేది.** మత దురభిమానంతో ఈ విషయాలు వక్రీకరించబడ్డాయి.

ఉమర్(రజి)వారు తమ పాలనలో క్రైస్తవ 'చర్చ్' గంటలను మోగించ వద్దని కఠినంగా ఆదేశించినట్లు చెబుతారు. భద్రంగా ఉన్న అప్పటి కాలపు పుస్తకాలలో (ఉదా: కితాబుల్ ఖరజ్, తారిఖె తబరి) ఈ విషయాలకు సంబంధించి వివరాలున్నాయి. వాస్తవానికి ముస్లిములు మస్జిద్‌లలో సలాత్ (నమాజ్) చేసుకునే సమయాలలో మాత్రమే, చర్చ్‌లలో గంటలు మ్రోగించవద్దని ఆదేశించడం జరిగింది.

అదే విధంగా క్రైస్తవులు తమ పిల్లలకు బాప్తిజమ్ ఇవ్వకుండా ఆదేశించారని నిందించారు. ఇబ్నె ఆతిర్ మరియు ఇతరులు వివరించిన దానిని బట్టి తగ్లబ్ తెగ కుటుంబాలు తమ పిల్లలకు బాప్తిజమ్ ఇవ్వకూడదని ఆదేశించినట్లు తెలుస్తుంది. తబరీ వ్రాసిన చరిత్రలో ఆ ఆదేశం గురించి ఇలా చెప్పబడింది : "ఇస్లామ్ స్వీకరించిన వారి పిల్లలకు **బలవంతంగా బాప్తిజమ్ ఇవ్వకూడదు**". ఎందుకంటే ఆ తెగవారి పిల్లలు అప్పటికే స్వచ్ఛందంగా ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. వారి పిల్లలను బలవంతంగా మార్చవద్దని ఆదేశించడం జరిగింది.

ఇదే విధంగా చాలా చరిత్ర పుస్తకాలలో క్రైస్తవులను ఉమర్(రజి)వారు అవమానించినట్లు మరియు చులకన చేసినట్లు వ్రాశారు.

కాని అవి ఏ మాత్రం నిజం కాదు. ముస్లిమేతరులు ఉమర్(రజి) పాలనలో గౌరవాన్ని పొందారేగాని, అవమానాన్ని కాదు.

**క్రిందటి సంచికలో జిజ్‌యహ్ పన్ను విషయంలో ఓ యూదుడిని అవమానకర పరిస్థితి నుండి తప్పించి, ఉమర్(రజి)వారు ఏ విధంగా గౌరవాన్ని కలుగజేసారో తెలియజేయబడింది.**

ఈజిప్టుపై అతి తక్కువ సైన్యంతో దండయాత్రకు బయలుదేరిన అమ్ర్ బిన్ ఆస్(రజి)వారికి ఒకచోట యుద్ధం జరిగాక ఎందరో యుద్ధ ఖైదీలుగా చిక్కారు. వారిలో గవర్నర్ కుమార్తె కూడా ఉన్నారు. అమ్ర్ ఆమెను గౌరవంగా ఆమె తండ్రి దగ్గరకు పంపారు.

ఆమె సేవకురాలు బార్బారా మార్గం మధ్యలో ఇలా చెప్పింది: "యువరాణీ! అరబ్బులు మన చుట్టూ ఉన్నారు."

**"నా జీవితానికి మరియు గౌరవానికి అరబ్బుల టెంట్‌లోనే రక్షణ ఉంది, నా తండ్రి రాజభవంతిలోకంటే"**
యువరాణి అర్మనోస సమాధాన మిచ్చింది.

తన కుమార్తె క్షేమంగా తిరిగి రావడం మరియు ముస్లిముల ఉత్తమ ప్రవర్తన గవర్నర్ ముఖౌఖిస్‌కి సంతోషం కలిగించింది.

ముస్లిమ్ పాలకుల పరిపాలనను ప్రశంసించి, వారి విజయం కోసమే ముస్లిమేతరులు కూడా దు'ఆ చేశారు. ఆ విషయం కూడా క్రిందటి సంచికలో తెలియజేయబడింది.

పైన తెలిపిన విషయాలు కొన్ని మాత్రమే. ఇంకా ఎన్నో అటువంటి సంఘటనలు ఉన్నాయి. ఇప్పుడు చెప్పండి, **పరమత సహనం ప్రపంచంలో ఎవరిలో ఎక్కువ ఉంది?** మత దురభిమానం ఎవరిలో ఎక్కువ ఉంది?

## పరమత సహనాన్ని తూట్లు పొడిచే అంశాలు

- **ముస్లిములపై తీవ్రవాదులని నిందలు**

ఇక్కడ ఒక సంఘటనను మీ దృష్టికి తేవాలని అనుకుంటున్నాము.

బాబిలోన్ ముట్టడి సమయంలో అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి టెంట్ (గుడారం) కోటకి అర కిలోమీటర్ దూరం లోపున వేయబడింది. అక్కడ యుద్ధం పూర్తయి అలెగ్జాండ్రియా వైపు వెళ్ళేటప్పుడు, సైనికులు ఆ టెంట్ తీసేసే సమయంలో దానిపై **ఓ పావురం పెట్టుకున్న గూడును గమనించారు** మరియు అందులో **గుడ్లు ఉన్నాయి**. అమ్ర్(రజి)వారు ఆ టెంట్‌ను ఉన్నచోటే వదిలేయమని ఆదేశించారు. సైన్యం ముందుకు పురోగమించింది. కాని ఆ టెంట్ మాత్రం బాబిలోన్ మైదానంలో అలాగే ఉండిపోయింది.

ఈ విషయాన్ని దివ్య సూచనగా భావించి, **"ఎక్కడ పావురం గూడు ఉందో అక్కడే ప్రజలు తమ పట్టణాన్ని నిర్మించుకోనివ్వండి"** అని ఆదేశించబడింది. అమ్ర్(రజి)వారి టెంట్ ఉన్న ప్రాంతం పట్టణానికి కేంద్రంగా తీసుకోబడింది. ఆ పట్టణానికి **'ఫుస్తాత్'** (فسطاط) అని పేరుపెట్టబడింది. అరబీలో ఫుస్తాత్ అంటే 'టెంట్'(గుడారం). క్రింది బోధన చూడండి :

> అబ్దుల్లా బిన్ అమ్ర్ ఉల్లేఖనం. కరుణ చూపినవారికి అనంత కరుణా మయుడు కరుణ చూపుతాడు. **భూమిపై నున్నవారిపై కరుణ చూపు మరియు ఆకాశాలపై నున్నవాడు నీపై కరుణ చూపుతాడు**" (అబూదావూద్, హసన్, 4941, పుస్తకం 40, అధ్యా. 58, సం. 5)

పై బోధననే ముస్లిమ్ నాయకుడు ఆచరణలో పెట్టారు. ఒక పావురం పెట్టుకున్న గూడు కోసం, దానికి నష్టం కలుగుతుందనే ఉద్దేశ్యంతో టెంట్ (గుడారాన్ని) అలాగే వదిలేసినవారు ఇస్లామ్‌ని అనుసరించే ముస్లిములు. **అటువంటి కరుణను ఆచరణలో పెట్టించిన ఇస్లామ్‌కు తీవ్రవాదం అనే పదాన్ని తగిలించడం అనాగరికం కాదా?**

తీవ్రవాదులంటే ముస్లిములేనా? అనుమానంతో అరెస్ట్ చేసిన తరువాత, నిర్దోషి అని నిరూపించబడినా సరే, పడిన మచ్చ త్వరగా పోతుందా? మనస్సుకు అయిన గాయం వెంటనే మానుతుందా? సున్నిత మనస్కులు మానసికంగా కృంగిపోతారు. ఒక్క దుర్మార్గుడు శిక్ష నుండి తప్పించుకున్నా ఫర్వాలేదు గాని, ఒక అమాయకుడిని మానసికంగా హింసించడం ఘోరమని తెలుసుకోవాలి.

మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారు కొన్నాళ్ళ క్రితం హైదరాబాద్‌లో ఇలా ప్రకటించారు : ***"మక్కా మస్జిద్ పేలుళ్ళు హిందూ ఉగ్రవాదుల పనే".*** *హిందూ ఉగ్రవాదులను, మతోన్మాద శక్తులనూ దూరంగా ఉంచేందుకు అంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.* ***మక్కా పేలుళ్ల కేసులో తొలుత అమాయకులైన ముస్లిమ్ యువకులను నిందితులుగా భావించి జైళ్ళకు పంపాల్సి వచ్చిందన్నారు.*** *పేలుళ్ళతో వారికి సంబంధం లేదని విచారణలో తేలిందన్నారు. ముస్లిమ్ యువకులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తామన్నారు."* **(సాక్షి దినపత్రిక, ఫిబ్రవరి 3, 2011 పేజీ. 12)**

ఎందరో అమాయకుల జీవితాలు బలయ్యాయి. వారి కెరీర్‌లను నాశనం చేశారు. అన్యాయానికి గురియైన కుటుంబాలలో సహజంగా ద్వేషం పుడుతుంది. ఇస్లామ్ సహనం వహించమని బోధించింది. కాని ముస్లిములంతా ఇస్లామ్‌ని పాటించక పోవచ్చు. **ద్వేషాన్ని ప్రభుత్వమే పెంచి పోషిస్తే పరమత సహనానికి చోటు ఎక్కడుంటుంది?**

## • మీడియా కవరేజి

ఓ మంచి సంకల్పంతో మీడియాకు రాజ్యాంగం స్వేచ్ఛనిచ్చింది. కాని ఆ స్వేచ్ఛ దుర్వినియోగం గావించబడుతుంది. ప్రతీ మీడియా సంస్థకి ఒక అజెండా ఉంటుంది. దాని ప్రకారం వార్తలను మలచడం, కవర్ చేయడం జరుగుతుంది.

వారికి అనుగుణంగా ఉండే విషయాన్ని మొదటి పేజీలలో ప్రముఖంగా ప్రచురిస్తే, దానికంటే ఎంతో ప్రాముఖ్యత కలిగిన విషయాన్ని పేపర్‌లోపల ఎక్కడో చిన్న కార్నర్‌లో ప్రచురించడం చేస్తున్నారు.

ఎన్నో అపార్థాలకు, అపోహలకు, అపనిందలకు మీడియా కారణమౌతుంది. అశాంతికి కూడా ఒకొక్కసారి కారణం అవుతుంది.

ఒక వ్యక్తి 99 మంచి పనులు చేశాడనుకుందాం. ఒక్కటే చెడ్డ పని చేశాడు. మరో వ్యక్తి 99 చెడ్డ పనులు చేశాడు. కాని ఒకే ఒక్క మంచిపని చేశాడు. ఈ వాస్తవాలు తెలిస్తే ఎవరు మంచివాడో, ఎవరు చెడ్డవాడో చాలా సులభంగా ఎవరైనా చెప్పగలుగుతారు.

**కాని వాస్తవాల వక్రీకరణ ఎలా జరుగుతుందంటే, చెడ్డవాడు చేసిన ఒకే ఒక మంచిపనిని పదేపదే ప్రస్తావిస్తూ, మంచివాడు చేసిన ఒకే ఒక తప్పును పదే పదే చూపుతూ చెడ్డవాడిని మంచివాడిగా మరియు మంచివాడిని చెడ్డవాడిగా చిత్రీకరించడం జరుగుతుంది. ప్రజలకు ఏది నిజం మరియు ఏది అబద్ధం అని తెలుసుకోవడానికి సమయంగాని అవసరంగాని ఉండదు.**

వారికి అసలు విషయం తెలిసేసరికి కొన్ని నెలలు గడిచిపోతాయి. లేదా కొన్ని సంవత్సరాలు గడిచిపోతాయి. జరగవలసిన నష్టం జరిగి పోతుంది.

ముస్లిమ్ దేశాలలో జరిగే ఎన్నో సంఘటనలలో ఏదో ఒక దురదృష్ట సంఘటనను ఎన్నిక చేసుకుని అంతర్జాతీయ వార్తలలో అదే వేస్తుంటారు. ఇస్లామిక్ తీవ్రవాదం అని వేస్తుంటారు. ప్రజలలో ముస్లిముల పట్ల మరియు ఇస్లామ్ పట్ల ద్వేషభావాన్ని కలిగించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు.

ఇది పరమత సహనాన్ని దెబ్బతీసే అతి ముఖ్యమైన విషయాలలో ఒకటి. అదే విధంగా ప్రజలను బాగా ప్రభావితం చేసే రంగం - సినిమా రంగం. నేడు కామెడీ సినిమాలలో సైతం తీవ్రవాదులంటే ముస్లిములే అన్న విధంగా చిత్రీకరణ చేస్తున్నారు. కథ వ్రాసిన వ్యక్తికి గాని, ఆ సినిమాకు దర్శకత్వం వహించే వ్యక్తికిగాని ఇస్లామ్‌పై కనీస అవగాహన ఉండదు.

## • బహిరంగ సభలు

ఎవరో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే, దానికి స్పందించి తిరిగి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం నుండి నియంత్రించు కోవాలి.

**వ్యక్తిగత దూషణలకు పోవద్దు** : క్రింది హదీస్ చూడండి.

> అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "ఒక వ్యక్తి తన తల్లిదండ్రులను దూషించడం ఘోరపాపాలలో ఒకటి". (ప్రజలచే) ఇలా అడగబడింది, "ఓ రసూలుల్లాహ్(స)! ఒక వ్యక్తి ఎలా తల్లిదండ్రులను దూషిస్తాడు?" ప్రవక్త(స)వారు చెప్పారు, "ఆ వ్యక్తి మరో వ్యక్తి తండ్రిని దూషిస్తాడు మరియు రెండవ వాడు మొదటి వాడి తండ్రిని దూషిస్తాడు మరియు అతని తల్లిని దూషిస్తాడు. (సహీహ్ బుఖారీ, 5973, పుస్తకం 78, అధ్యా.4, సంపుటి 8)

**పరమత గ్రంథాలను దూషించ కూడదు** : క్రింది హదీస్ చూడండి.

> అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం : గ్రంథప్రజలు (తమ మతగ్రంథమైన) 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : "**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము". **(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

**ఇతరుల ఆరాధ్య దైవాలను దూషించ కూడదు :**

> **"మరియు అల్లాహ్‌ను వదిలి వారు ప్రార్థిస్తున్న ఇతరులను దూషించ కండి. ఎందుకంటే, వారు ద్వేషంతో, అజ్ఞానంతో అల్లాహ్‌ను దూషించ వచ్చు."** (ఖుర్'ఆన్ 6:108)

నాయకులైనా, మరెవరైనా సరే బహిరంగ సభల్లో ప్రసంగించే టప్పుడు ఖుర్'ఆన్ మరియు సున్నత్ ప్రకారంగా వ్యవహరించాలి.

## • మతధర్మాల మధ్య డిబేట్‌లు

ఇప్పటి వరకూ తెలిసిన విషయాలను బట్టి మూడు ప్రయోజనాల కోసం ఈ డిబేట్‌లు జరుగుతున్నాయి.

1. తమ పాపులారిటీని పెంచుకోవడానికి, తమకు ఎంతో జ్ఞానముందని

నిరూపించు కోవడానికి ఈ డిబేట్లను వేదికగా కొందరు చేసుకున్నారు. **నిజంగా జ్ఞానం ఉన్నవాడు ఈ పని చేయడు.** ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను అర్థం చేసుకోనివారు మాత్రమే ఈ డిబేట్‌ల పట్ల ఆసక్తి చూపుతారు. **ఉమర్(రజి)వారు తన బానిసను ఎందుకు మార్చలేక పోయారు?** ఆయనకున్న జ్ఞానం అసాధారణమైనది కాదా? ఉమర్(రజి)వారికే సాధ్యం కానిది వీరికి సాధ్యమౌతుందని ఎలా భావించారు?

2. ఈ డిబేట్‌లను రికార్డింగ్ చేసి కొంతమందికి పంపి, ధర్మం గురించి పనిచేస్తున్నామని చెబుతూ, వారి నుండి డబ్బు దండుకోవడానికి మరియు కష్టపడి పనిచేయకుండా విలాసంగా బ్రతకడానికి.
3. ఈ డిబేట్లను అడ్డం పెట్టుకుని కొందరు మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) ముస్లిముల ముసుగులో ఇస్లామ్‌పట్ల దుష్ప్రచారం చేస్తూ, ఒక మతధర్మం వారి దగ్గర నుండి డబ్బు తీసుకుంటున్నారు. పై రెండు రకాల వ్యక్తుల కంటే, ఈ మునాఫిక్‌ల వలన జరిగే నష్టం చాలా తీవ్రంగా ఉంది.

గ్రామాల్లో తిరుగుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. తినడానికి ఒకప్పుడు తిండిలేనివారు కూడా ఈ కార్యక్రమాల ద్వారా ఐశ్వర్యవంతులు అయ్యారు. వారు చేసే కర్మలకి ఇహలోకంలో మరియు పరలోకంలో శిక్షించబడతారు, ఇన్షా అల్లాహ్. అయితే వీరి వలన అమాయకులెందరో బలైపోతున్నారు.

ఈ డిబేట్ల గురించి ఇంటెలిజెన్స్‌వారు ఆరా తీస్తున్నారని తెలుసుకుని, రహస్యంగా ఎవరికీ అనుమానం రాకుండా, ఇండ్లలో డిబేట్లు ఏర్పాటు చేసుకుని వీడియో రికార్డింగ్ చేస్తున్నారు. వీటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాటి కింద ఎంతో నీచంగా పోస్టులు పెడుతున్నారు. ఇవి ఎంతగా విద్వేషాలు పెంచు తున్నాయో అందరికీ తెలిసిన విషయమే!

ఈ డిబేట్లు సున్నత్‌కి వ్యతిరేకం. ప్రవక్త(స)వారు ఇతర గ్రంథాల విషయాలను విన్నప్పుడు వాటిని నిజమనిగాని అబద్ధమనిగాని చెప్పవద్దని చెప్పినప్పుడు ఇక వాటి అవసరం ఏమిటి? మస్‌జిద్‌లలో ఉండే ఇమామ్‌లను డమ్మీలుగా చేసేసి, డమ్మీ జ్ఞానులు దావా పేరుతో వేదికలెక్కుతున్నారు.

- **దావా పేరుతో జరుగుతున్న వేల కోట్ల వ్యాపారం**

ముస్లిములపై సలాత్ ఏ విధంగా బాధ్యతగా ఉందో, అదే విధంగా ధర్మ సందేశాన్ని తెలియజేయడం కూడా ప్రతీ ముస్లిమ్‌పైనున్న ముఖ్యమైన బాధ్యతే! వీటి కోసం ప్రత్యేక సంస్థలు మరియు జీత భత్యాలతో పనిచేసే ప్రసంగీకుల అవసరం ఎంతమాత్రం లేదు. ఇదంతా ఓ బిద్'అత్.

మాకు తెలిసిన సమాచారం ప్రకారం, ఒక ప్రసంగానికి 500 రూపాయల నుండి 15,000 రూపాయల వరకూ తీసుకుంటున్నారు. ట్రైన్ ఛార్జీల దగ్గరనుండి ఫ్లైట్ ఛార్జీల వరకూ వసూలు చేస్తున్నారు.

ఇండియాలోని 25 కోట్ల మంది ముస్లిములు, 100 కోట్ల మంది ముస్లిమేతరలకు తమ ధర్మం గురించి తెలియజేయాలంటే ఒకొక్కరు 4 గురికి చెబితే సరిపోతుంది. మరి ఈ మొత్తం 25 కోట్ల మందికి ఇస్లామ్ అంటే సరియైన అవగాహన ఉందా? వీరికి అవగాహన కల్పించకుండా, వీరంతా ఇస్లామ్‌లో స్థిరంగా ఉండేలా చేయకుండా, నమాజ్ విధానాల పేరు చెప్పో మరొకటి చెప్పో ముస్లిముల మధ్య చీలికలు తెచ్చి, మేం ఇతరులను మార్చేస్తాం అని కోట్లు ఖర్చుపెట్టి బహిరంగ సభలు పెట్టడం సున్నత్ అవుతుందా?

పేదవారికి సహాయం అందించడం ద్వారా అల్లాహ్ ఏర్పాటు చేసిన 'జకాత్' ఉత్తమ వ్యవస్థ గురించి వారికి తెలియజేయడానికి బదులు, ఆ పేదవారికి అందవలసిన జకాత్‌నే మింగేస్తూ, దావా అని చెప్పడం నీచమైన పని కాదా? పేదవారికి అందవలసిన ఆర్థిక వనరులను 'దావా' పేరుతో స్టేజ్ షోల కోసం ఖర్చు చేయడం **ప్రవక్త(స) సాంప్రదాయమా?**

పేదలకు దానమివ్వడాన్ని చూస్తే ప్రవక్త(స)వారి ముఖంలో సంతోషం కనిపించేది. ప్రవక్త(స)వారికి సంతోషం కలిగించే పనిచేస్తే అల్లాహ్ మన పట్ల ప్రసన్నుడౌతాడు, ఇన్షా అల్లాహ్!

### వివిధ జమాత్‌ల ముస్లిమ్ నాయకులపైనున్న బాధ్యత

కనీసం ఓ ఐదు సంవత్సరాలపాటు దాయీలకు, స్టేజ్ షోల కోసం ఖర్చు చేయకుండా సేకరించబడిన సొమ్మును పేదప్రజలకు పంచి, ఇమామ్‌ల బాగోగులు పట్టించుకుని, మస్‌జిద్‌కు రోజూ వచ్చే ప్రతీ ముస్లిమ్‌కి ఇస్లామ్ పట్ల, ఇస్లామ్ చరిత్ర పట్ల కనీస అవగాహన కలిగించే బాధ్యతను ఇమామ్‌పై ఉంచాలి. అది ఎంత మంచి ఫలితం ఇస్తుందో ఇన్షా అల్లాహ్ మీరే చూస్తారు.

## ప్రభుత్వంపై నున్న బాధ్యత

పరమత సహనం విషయంలో ఓ ప్రత్యేక చట్టాన్ని అమలులోకి తేవాలి. ఆ చట్టం గురించి సందేహాలు లేకుండా స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా పిల్లల పాఠ్య పుస్తకాల కవర్ పేజీపై ప్రచురించాలి.

- ఒక ప్రసంగం ఎప్పుడు భావ ప్రకటనా స్వేచ్ఛగా పరిగణించ బడుతుంది? మరియు ఎప్పుడు అది నేరంగా పరిగణించ బడుతుంది? వీటి మధ్యనున్న ఆ బేధాన్ని స్పష్టపరచాలి.
- ఒక మతధర్మం వారు మరో మతధర్మంపై బహిరంగ సమావేశాల్లో చర్చ తీసుకురాకుండా హెచ్చరించాలి.
- వివిధ మతధర్మాలకు చెందిన వారు స్వార్థప్రయోజనాల కోసం ఏర్పాటు చేసుకునే ప్రత్యక్ష లేదా పరోక్ష డిబేట్లను మరియు వాటి రికార్డింగ్‌లను నిషేధించాలి.
- పరమత సహనానికి గొడ్డలిపెట్టుగా ఉన్నటువంటి ఎన్నో బోధనాంశాలను చరిత్ర పుస్తకాల నుండి తొలగించాలి.
- తీవ్రవాదం అనే పదాన్ని ఏ మత ధర్మానికి తగిలించ వద్దని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రత్యేకంగా తెలపాలి. వాటిపై ప్రెస్ కౌన్సిల్‌చే నియంత్రణ ఏర్పాటు చేయాలి. ఒకవేళ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి.

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 29

فِعل ثلا ثي مَزِيد فِيه
ఫి'లె సులాసీ మజీద్ ఫీహి
[క్రియ యొక్క నాల్గవ రూపం]

**أَفْعَلَ** — ప్రారంభంలో హమ్‌జా అదనంగా వచ్చినప్పుడు
(فعل ماضی میں پہلاحرف أ زیادہ ہو)

| | | | | | |
|---|---|---|---|---|---|
| పూర్తి చేయుట<br>to complete<br>پورا کرنا | సంపూర్ణం<br>اِتْمَام<br>(ఇత్‌మామ్) | పూర్తి చేసినవాడు<br>مُتِمّ<br>(ముతిమ్మ్) | పూర్తి చేయి<br>أَتْمِمْ<br>(అత్‌మిమ్) | పూర్తి చేస్తాడు<br>يُتِمُّ<br>(యుతిమ్ము) | పూర్తి చేశాడు<br>أَتَمَّ<br>(అతమ్మ) |
| ప్రేమించుట<br>to love<br>پسند کرنا | اِحْبَاب<br>(ఇహ్‌బాబ్) | مُحِبّ<br>(ముహిబ్బ్) | أَحْبِبْ<br>(అహ్‌బిబ్) | يُحِبُّ<br>(యుహిబ్బు) | أَحَبَّ<br>(అహబ్బ) |
| ధర్మసమ్మతం చేయుట<br>to make lawful<br>حلال کرنا | اِحْلَال<br>(ఇహ్‌లాల్) | مُحِلّ<br>(ముహిల్ల్) | أَحْلِلْ<br>(అహ్‌లిల్) | يُحِلُّ<br>(యుహిల్లు) | أَحَلَّ<br>(అహల్ల) |
| దాచుట, రహస్యంగా మాట్లాడుట<br>to conceal; to speak secretly<br>چھُپانا | اِسْرَار<br>(ఇస్‌రార్) | مُسِرّ<br>(ముసిర్ర్) | أَسْرِرْ<br>(అస్‌రిర్) | يُسِرُّ<br>(యుసిర్రు) | أَسَرَّ<br>(అసర్ర) |
| మార్గభ్రష్టునిగా చేయుట<br>to leave in error;<br>to send astray گمراہ کرنا | اِضْلَال<br>(ఇజ్‌లాల్) | مُضِلّ<br>(ముజిల్ల్) | أَضْلِلْ<br>(అజ్‌లిల్) | يُضِلُّ<br>(యుజిల్లు) | أَضَلَّ<br>(అజల్ల) |
| సిద్ధం చేయుట تیار کرنا<br>to prepare; to make ready | اِعْدَاد<br>(ఇ'దాద్) | مُعِدّ<br>(ము'ఇద్ద్) | أَعْدِدْ<br>(అ'దిద్) | يُعِدُّ<br>(యు'ఇద్దు) | أَعَدَّ<br>(అ'అద్ద) |
| రుచిగా చేయుట<br>to make to taste<br>چکھانا | اِذَاقَة<br>(ఇజాఖ(త్)) | مُذِيق<br>(ముజీఖ్) | أَذِقْ<br>(అజిఖ్) | يُذِيقُ<br>(యుజీఖు) | أَذَاقَ<br>(అజాఖ) |
| ఉద్దేశించుట<br>to intend, to wish<br>ارادہ کرنا | اِرَادَة<br>(ఇరాద(త్)) | مُرِيد<br>(మురీద్) | أَرِدْ<br>(అరిద్) | يُرِيدُ<br>(యురీదు) | أَرَادَ<br>(అరాద) |
| మీద పడుట<br>to befall; to inflict<br>(کوئی چیز) آپڑنا | اِصَابَة<br>(ఇసాబ(త్)) | مُصِيب<br>(ముసీబ్) | أَصِبْ<br>(అసిబ్) | يُصِيبُ<br>(యుసీబు) | أَصَابَ<br>(అసాబ) |
| విధేయత చూపుట<br>to obey<br>اطاعت کرنا | اِطَاعَة<br>(ఇతా'అ(త్)) | مُطِيع<br>(ముతీ') | أَطِعْ<br>(అతి') | يُطِيعُ<br>(యుతీ'ఉ) | أَطَاعَ<br>(అతా'అ) |
| స్థాపించుట, నిలబెట్టుట<br>to establish; to set upright<br>کھڑا کرنا | اِقَامَة<br>(ఇఖామ(త్)) | مُقِيم<br>(ముఖీమ్) | أَقِمْ<br>(అఖిమ్) | يُقِيمُ<br>(యుఖీము) | أَقَامَ<br>(అఖామ) |
| చావుకు కారణమగుట<br>to cause someone to die<br>موت دینا | اِمَاتَة<br>(ఇమాత(త్)) | مُمِيت<br>(ముమీత్) | أَمِتْ<br>(అమిత్) | يُمِيتُ<br>(యుమీతు) | أَمَاتَ<br>(అమాత) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 29 నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 79.2***

ఈ నెల నేర్చుకున్న పదాలు 596 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 596 చోట్ల చూడవచ్చు)

*source: www.emuslim.com*

# పాఠకుల అభిప్రాయాలు

### జిజ్‌యహ్

'జిజ్‌యహ్' వ్యాసంపై విశేష స్పందన లభించింది. సాధారణంగా ఎక్కువమంది స్కూలులో చదువుకునే పాఠ్యపుస్తకాలు (text books)లో మాత్రమే జిజ్‌యహ్ గురించి చదువుతారు. ముస్లిముల పట్ల ద్వేషభావాన్ని ప్రేరేపించే విధంగా ఆ పాఠాలు ఉంటాయి. అవి వాస్తవం కాదు. ముస్లిమ్ విద్యార్థులు కూడా అవే కంఠస్థం చెయ్యాలి. ఏమీ చెప్పలేని పరిస్థితికి లోనవుతారు. ఈ 'జిజ్‌యహ్' వ్యాసం ద్వారా తెలుసుకున్న వాస్తవాలను ఉత్సాహంగా తమ టీచర్‌తో లేదా తోటి విద్యార్థులతో పంచుకోగలుగుతారు. ఒకే రకమైన అభిప్రాయం చాలామంది నుండి అందుకున్నాము. ఇంతవరకూ జిజ్‌యహ్ అంటే తమకు కూడా వేరే భావం ఉండేదని, ఇప్పుడు చాలా స్పష్టంగా తెలిసిందని ప్రశంసించారు. అల్‌హమ్‌దులిల్లాహ్! అల్లాహ్ అవకాశం ఇస్తే, చరిత్రలో వక్రీకరించబడిన ఎన్నో వాస్తవాలను ఆధారాలతో సహా అందిస్తాము.

### తిరిగి గూటికి

పాఠకుల నుండి ప్రత్యేక ఆదరాభిమానాలను పొందిన శీర్షిక ఇది. ప్రతీ సంచికలో తప్పనిసరిగా ప్రవక్త(స)వారి అనుచరులలోని ఒకరి గురించి అందించాలని కోరుతున్నారు. కష్టాలలో వారు వహించిన సహనం, వారి విశ్వాస త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తున్నాయి. ఒకరు స్వయంగా తనకు తాను సంస్కరించు కోవడానికి ఇవి వాస్తవ ఉదాహరణలుగా నిలిచాయి. 1400 సంవత్సరాల క్రితం నిజమైన ప్రజాస్వామ్యం అందించారు ఖలీఫాలు. మహాత్మగాంధీ గారు కూడా ఉమర్(రజి)వారి వంటి నాయకుడు ఉంటే మనదేశానికి నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని అభిప్రాయ పడ్డారంటే, ఇస్లామీయ చరిత్రలోని అంశాలు ఎంతో నిత్యనూతనమైనవనే విషయం అర్థం అవుతుంది. అంతేగాని ఇవి ఏవో పాతకాలపు కథలుగా కొట్టిపారేసేవి కావని వివేకంగలవారు అర్థం చేసుకున్నారు. **నేటి సమాజ సంస్కరణకు వీరి జీవితచరిత్రలు తెలుసు కోవడం చాలా ముఖ్యం.** మా పాఠకులు ఆ విషయం గ్రహించడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.

### పరిశోధనా సమయం

ఒక పాఠ్యపుస్తకంలో ఒక క్రమంలో ఏ విధంగా పాఠాలు అందిస్తారో, అదే విధంగా ఇస్లామ్‌కి చెందిన అన్ని రంగాల గురించి ఒక క్రమంలో వాస్తవాలను అందించడానికి 'శాంతిబాట టీమ్' పరిశోధన చేస్తుంది. దీని కొరకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. కాబట్టి మాకు సమయం చాలా విలువైనది. అందుకని చందా వివరాల కోసం చేసే ఎంక్వయిరీలు గాని, మారిన అడ్రస్ వివరాలు తెలియజేయడానికి గాని ప్రతీ రోజూ 3 గంటల నుండి 5 గంటల మధ్య మాత్రమే ఫోన్ చేయమని కోరుతున్నాము. ఎంత చిన్న సందేహమైనా సరే, కార్డుపై వ్రాసి పంపగలరు. మీ సందేహాలకు సమాధానాల కోసమై దయచేసి ఫోన్‌లో సంప్రదించవద్దని తెలియజేస్తున్నాము. మీరు వ్రాసిన సందేహాలు ఇస్లామ్ పరిధిలో ఉంటే మరియు అవి ఇంతకు పూర్వం శాంతిబాటలో ప్రచురించి ఉండకపోతే, వ్యాసం రూపంలో వాటికి సమాధానం అందించ బడుతుంది. అలా కాకుండా అవి ఇస్లామ్ పరిధిలో లేకపోయినా, పూర్తి ఎడ్రస్ లేకపోయినా, చేసే విమర్శలకు ప్రామాణిక ఆధారాలు లేకపోయినా వాటిని తిరస్కరించడం జరుగుతుంది.

### ప్రకటన

**మా సొసైటీల పేర్లు చెప్పి మేము ప్రచురించిన పుస్తకాలు చూపి, సభ్యులమని చెప్పుకుని ఎవరైనా మస్‌జిద్‌ల కోసం గాని, మదరసాల కోసం గాని లేక ఇతరత్రా విరాళాల కోసం వస్తే, వారు మా సభ్యులు కాదని తెలుసుకోండి. మేము విరాళాల కోసం ఎవరినీ కోరలేదు. ఇన్నా అల్లాహ్ ఎవరినీ కోరము అల్లాహ్ నుండి తప్ప - శాంతిబాట టీమ్**

**మన రాష్ట్రంలోగాని ఇతరచోట్లగాని శాంతిబాటకు అనుబంధ సంస్థలు ఏమీ లేవు.**

**ఏ జమాత్‌కు ఇది అనుకూలం గాని లేదా వ్యతిరేకం గాని కాదు.**

**ఒకవేళ ఎవరైనా ఆ విధంగా ప్రచారం చేస్తే, అటువంటి ప్రచారానికి మాకూ ఎటువంటి సంబంధం లేదు. కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌పైనే ఆధారపడి స్వచ్ఛందంగా కొందరు ముస్లిమ్ సోదరులు నడుపుతున్న పత్రిక ఇది మరియు ఇది ముస్లిమ్ ఉమ్మత్‌కి సంబంధించినది. సత్యాన్ని నిర్భయంగా ఏ ఒత్తిడి లేకుండా ప్రజలకు తెలియజేయాలని మేము ఎవరి దగ్గర నుండి ఆర్థిక సహకారాన్ని కోరలేదు.శాంతిబాటలో అరుదైన గ్రంథాల నుండి ఎంతో విలువైన ఇస్లామీయ సమాచారాన్ని ప్రామాణిక ఆధారాలతో అందిస్తున్నాము కేవలం అల్లాహ్‌పై నున్న భరోసాతో మాత్రమే.**

మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Publishing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

# తొలి తెలుగు పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రిక

అల్లాహ్ అనుగ్రహంతో
4వ సంవత్సరం
విజయవంతంగా
నడపబడుతుంది.
అల్-హమ్దులిల్లాహ్!





సర్వమానవాళి సంతోషంగా
జీవించడానికి అల్లాహ్ చూపిన మార్గాన్ని
సులభమైన తెలుగులో అందరికీ
అందించాలనేది మా సంకల్పం


విదేశాలలో ఉండి తెలుగు చదవగలిగే వారి కోసం ప్రచురించబడిన వెంటనే పత్రికను
వెబ్‌సైట్‌లో ఉచితంగా అందుబాటులోకి తెస్తున్న ఏకైక తెలుగు ఇస్లామీయ మాసపత్రిక



అల్లాహ్‌ను మరియు ముహమ్మద్(స)వారిని ప్రేమించే వారిచే
ఆదరించ బడుతూ, ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని అందించే పత్రిక




*For Free Download of*
*Our Magazine and Books*
*visit*
www. saanthibaata.net
www.saanthibaata.com



ధర్మం పేరుతో పేదప్రజలకు అందవలసిన
సొమ్మును దోచుకుంటున్న అవినీతి విద్వాంసుల
మరియు ప్రచారకుల గుట్టు బయట పెట్టిన పత్రిక

శాంతిబాట
ప్రారంభానికి
ముందు
ప్రచురించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




శాంతిబాట
పాఠకులకు
తొలి సంవత్సరం
ఉచితంగా
అందించబడిన
పరిశోధనాత్మక
పుస్తకం




సత్యాన్ని ప్రేమించేవారికి
మా మనవి :
మీ బంధువులను, స్నేహితులను
చందాదారులుగా చేర్చి సత్యాన్ని
వ్యాపింపజేయమని కోరుతున్నాము.

**SAANTHIBAATA MONTHLY February, 2013** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

సృష్టికర్తయైన అల్లాహ్ పంపిన ప్రవక్త మరియు సందేశహరుడైన

# ముహమ్మద్(స)వారి బోధనల సారాంశం

ఏ ధర్మానికి చెందిన పొరుగువాడైనా సరే, ఆ పొరుగువానిని ప్రేమించడం మాత్రమే కాకుండా, అతడి అవసరాలను కూడా తెలుసుకోవాలి. అతడు ఆకలితో ఉంటే, అతనితో పాటు ఆహారాన్ని పంచుకోవాలి. అతడు పస్తులుండగా మనం కడుపు నిండా తింటే మనం విశ్వాసులం కాము.

కూలివాని చెమట బొట్టు ఆరకముందే అతని కూలి అతనికి ఇచ్చివెయ్యాలి.

బహుమతులుగాని మరేదైనా పంచవలసి వస్తే మన ఇంటికి ఏ పొరుగువాని గుమ్మం దగ్గరగా ఉందో వారికి ముందు ఇవ్వాలి, వారు ముస్లిములు కాకపోయినా సరే.

పొరుగువాని ప్రశాంతతకు భంగం కలిగించేవాడు విశ్వాసి కాడు.

భార్యను బాగా చూసుకునే వాడే ఉత్తముడు.

తల్లిదండ్రులను ప్రేమించాలి. వారికి సేవ చేయాలి. వారి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలి. వారు వృద్ధాప్యంలో ఉంటే, 'ఉఫ్' అని అసహనం కూడా వ్యక్తం చేయకూడదు.

పిల్లలను ప్రేమించాలి. వారు ఆడపిల్లలైనా మగపిల్లలైనా సరే వారిని విద్యావంతులుగా చేయాలి. ఉత్తమ లక్షణాలు వారికి అలవడేలా వారికి శిక్షణ నివ్వాలి.

వ్యభిచారానికి, మద్యపానానికి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

స్త్రీలను గౌరవించాలి.

పరమత సహనం కలిగి ఉండాలి.

కుమార్తెలను బాగా చూసుకునే విశ్వాసులకు స్వర్గ శుభవార్తనిచ్చారు. కుమార్తెలను కలిగి ఉండడం విశ్వాసులకెంతో అదృష్టం.

మానవులంతా సమానమే. వారి రంగు, రూపు, జాతి, స్థితి మొదలైన వాటివలన వారికి ఎలాంటి ఆధిక్యత లేదు. అల్లాహ్ పట్ల భీతి (తఖ్వా) కలిగి, మంచిగా ఆచరించేవారే అందరికంటే అధికులు.

తన స్వహస్తాలతో కష్టపడి తినేతిండి ఉత్తమమైన ఆహారం. శక్తిని బట్టి కష్టపడి పనిచేసి సంపాదించాలి.

ఆధునిక సైన్స్‌కు పునాదులు వేయించి, సైన్స్‌లో వివిధ
రంగాలకు పితామహులను తయారుచేసిన
ఇస్లామ్ సర్వమానవులు ఆచరించదగిన ధర్మం.
ఎవరో కొందరు ముస్లిములను చూసి ఇస్లామ్‌ను
నిందించడం అనాగరికం మరియు హేయమైన పని.
కత్తితో ఇస్లామ్ వ్యాపించలేదు. మానవత్వంతో, ఉత్తమ
సంస్కారంతోనే వ్యాపించింది.




23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్